www.prajasakti.com

సిటీ

ప్రజాశక్తి


ప్రతి అక్షరం ప్రజల పక్షం

Publishedfrom Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam and ongole

సంపుటి : 37 సంచిక : 216
12 + స్నేహ + 12 పేజీలు వెల : 5.00

విజయవాడ, ఆదివారం 6 ఆగస్టు 2017

facebook/prajasakti,
twitter/prajasakti



మానవుడు స్వతహాగా సంఘజీవి. స్నేహంతో కలసి ఉంటూ అభివృద్ధి సాధించాడు. అందుకే ఒక కవి అంటారు.. 'స్నేహ బంధమూ ఎంత మధురమూ... చెరిగిపోదు. తరిగిపోదు.. జీవితాంతమూ... కష్టసుఖాల్లో.. తోడూ నీడగా.. ఒకే ఆత్మ ఉంటుంది రెండు శరీరాలలో.. ఒకటే పలుకుతుంది వేరు వేరు గుండెల్లో..!' సహవాసానికి కులం లేదు. మతం లేదు. భాష లేదు. లింగ భేదం లేదు. సరిహద్దులు అసలే ఉండవు. అలాంటి స్నేహానికి చిరునామా చే గువేరా-కాస్ట్రో అనుబంధంపై ప్రత్యేక కథనం 'స్నేహ'లో..

సిఎం పేషీలో
ఇష్టారాజ్యం
- ముఖ్యమంత్రికి ఐవైఆర్ లేఖ

9

నేడు, రేపు గ్రూప్ 3 మెయిన్స్ పరీక్షలు

పైపైకి ఉల్లి ధర

ఒక్కరోజులో

రెట్టింపు



వంటింట్లో టమోటా సృష్టించిన కలకలం పూర్తిగా తగ్గక ముందే ఉల్లిపాయల వంతు వచ్చింది. ఉల్లి ధర ఒక్కసారిగా రెట్టింపైంది. బహిరంగ మార్కెట్లో శుక్రవారం వరకు 15 నుండి 18 రూపాయల వరకు పలికిన కిలో ఉల్లిపాయల ధర శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 30 నుండి 36 రూపాయలకు చేరింది. కొన్ని ప్రాంతాల్లో కిలో 40 రూపాయలకు కూడా విక్రయించారు. రైతు బజార్లలో కూడా ఉల్లి ధరలో గణనీయంగా మార్పు కనిపించింది. అనూహ్యంగా చోటు చేసుకున్న ఈ పరిణామం మార్కెట్లో కలకలం రేపింది. కొందరు వ్యాపారులు సరుకును బ్లాక్ చేయడం కూడా ప్రారంభించారు. మరోవైపు దేశ వ్యాప్తంగా వివిధ మార్కెట్లలో ఉల్లికి కొరత ఏర్పడిందన్న వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ఉల్లి మళ్లీ కన్నీళ్లను తెప్పించడం ఖాయమన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

విజయవాడలో..

రాజధాని ప్రాంతమైన విజయవాడ, గుంటూరులలో శుక్రవారం 16 నుండి 18 రూపాయలు పలికిన ఉల్లిపాయల ధర శనివారం 32 నుండి 36 రూపాయలకు చేరింది. విజయవాడలోని కొన్ని ప్రాంతాల్లో కిలో 40 రూపాయలకు కూడా విక్రయించారు. విజయవాడలోని రైతు బజార్‌లో 20 రూపాయలకు అమ్మారు. రెండు రోజులుగా రైతు బజార్‌కు ఉల్లి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని వ్యాపారులు తెలిపారు.

విశాఖలో..

విశాఖ నగరంలోనూ ఉల్లి ధరలో పెరుగుదల కనిపించింది. శుక్రవారం కిలో 18 రూపాయలకే దొరికిన ఉల్లిపాయల కోసం శనివారం మరో ఎనిమిది రూపాయలు అదనంగా వెచ్చించాల్సి వచ్చింది. విశాఖ పరిసర ప్రాంతాల్లో కిలో 30 రూపాయలకూ విక్రయించారు.

ఎందుకీ పరిస్థితి..!

తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మహారాష్ట్రలో ఉల్లి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఆ రాష్ట్రం నుండి అంతంతమాత్రంగా ఉన్న దిగుమతులు శుక్ర, శనివారాల్లో దాదాపుగా నిలిచిపోయాయి. మన రాష్ట్రంలోనూ కరువు పరిస్థితులు నెలకొనడంతో స్థానికంగా ఉత్పత్తి తగ్గింది. మరోవైపు కోల్‌కతాలో అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ధర కూడా ఎక్కువ పలుకుతుండటంతో మార్కెట్‌కు వచ్చిన కొదిపాటి సరుకును కూడా అక్కడికి పంపడానికే వ్యాపారులు మొగ్గు చూపుతున్నారు. శనివారం కర్నూలు మార్కెట్ యార్డ్‌కు ఐదు లారీల లోడ్‌రాగా, వాటిలో మూడు లారీల సరుకు కోల్‌కతాకే వెళ్లినట్లు సమాచారం.


కర్నూలులో..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో అతిపెద్ద ఉల్లి మార్కెట్టైన కర్నూలులోనూ ధరలు పెరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్లో మూడు రోజుల క్రితం 15 రూపాయలు పలికిన ఉల్లిపాయలు శుక్రవారం 25 రూపాయలకు, శనివారం 32 రూపాయలకు చేరాయి. మార్కెట్‌కు ఉల్లి సరఫరా గణనీయంగా తగ్గింది. కర్నూలు మార్కెట్లో ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉల్లి ధరలకు మరింతగా రెక్కలు వస్తాయని భావిస్తున్నారు.

హైదరాబాద్‌లో కిలో రూ.45

హైదరాబాద్‌లో కూడా ఉల్లి ధరల్లో గణనీయమైన పెరుగుదల కనిపించింది. మూడు రోజుల వరకు 18 నుండి 20 రూపాయలున్న ధర శనివారం 40 రూపాయలకు చేరింది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో కిలో 50 రూపాయలకు కూడా అమ్ముతున్నారు. మరింత పెరిగే అవకాశం ఉందన్న సమాచారంతో వినియోగదారులు ఉల్లి విక్రయాల వద్ద బారులు తీరుతున్నారు. ఇక్కడి మలక్‌పేట మార్కెట్లో మూడు రోజుల క్రితం క్వింటా ఉల్లి 1800 రూపాయలు పలకగా, శనివారం 3,200 రూపాయలకు విక్రయించారు.

ఉప రాష్ట్రపతిగా వెంకయ్య



- 516 ఓట్లతో గోపాలకృష్ణ గాంధీపై గెలుపు
- 11న ప్రమాణ స్వీకారం
- 98.2 శాతం పోలింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారత నూతన (13వ)ఉప రాష్ట్రపతిగా ఎం. వెంకయ్యానాయుడు ఎన్నికయ్యారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి, గాంధీజీ మనుమడు గోపాలకష్ణ గాంధీపై 272 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఈ ఎన్నికకు రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు, నామినేటేడ్ సభ్యులతో కలిపి మొత్తం 785 మంది ఓటర్లు కాగా, అందులో 14 మంది ఓట్లు హక్కును వినియోగించుకోలేదు. 771 ఓట్లు పోలవ్వగా, అందులో 760 చెల్లిన ఓట్లు, 11 ఓట్లు చెల్లనివిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ షంషేర్ షరీఫ్ వెల్లడించారు. ఇందులో వెంకయ్యకు 516 రాగా, ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి గోపాలకష్ణ గాంధీకి 244 ఓట్లు వచ్చాయని వెల్లడించారు. మొత్తం 98.2 శాతం పోలింగ్ జరిగిందని తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు పార్లమెంట్ ఆవరణలోని రూమ్ నెంబర్ 62లో మొదలైన ఈ ఓటింగ్ ప్రక్రియ, సాయంత్రం 5 గంటలకు ముగిసింది. అనంతరం పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు.

ఒకే బ్యాలెట్ బ్యాక్స్ ద్వారా పోలింగ్‌ను నిర్వహించామని షరీఫ్ తెలిపారు. పోలింగ్ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్ పరిశీలకుల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ షీల్ వేశామని, సాయంత్రం మిగతా 8లో

గేట్ టాపర్ సుధీర్ ముంబయిలో ఆత్మహత్య!



9

కాగితాలపైనే ఎస్సీ నిధులు

- ఖర్చు నామమాత్రమే!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళితుల అభివృద్ధి కోసం ఎంతో చేస్తున్నామని చెప్పుకొంటున్న రాష్ట్ర ప్రభుత్వ మాటలకు, చేతలకు పొంతన లేని పరిస్థితి నెలకుంటోంది. అట్టహాసంగా వివిధ పథకాల పేరిట నిధులు భారీగా కేటాయించినప్పటికీ ఖర్చు నామమాత్రంగా ఉంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని శాఖలు 15 ఉన్నాయి. ఎస్సీల అభివృద్ధి, సంక్షేమం పేరిట మొత్తం 40 శాఖలకు చేసిన కేటాయింపుల్లో 16 శాఖలు 25 శాతం కూడా ఖర్చు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ కొద్దిరోజుల క్రితం చేసిన సమీక్షలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గతంలో ఎస్సీ ఉప ప్రణాళిక స్థానంలో తాజాగా ఎస్సీ కాంపోనెంట్(ఎస్‌సిసి) పేరిట నిధుల్ని ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది ఎస్‌సిసి కోసం రూ.9847 కోట్లు కేటాయించారు. అయితే ఈ నిధుల్ని సక్రమంగా ఖర్చు చేసే విషయంపై మాత్రం ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. కేటాయించిన నిధుల్లో 75 శాతం కన్నా ఎక్కువగా ఖర్చు చేసిన శాఖ కేవలం ఒక్కటంటే ఒక్కటే ఉంది. ఏభై శాతానికిపైగా ఖర్చు చేసినవి ఐదు, 25 నుంచి 50 శాతానికి మధ్య ఖర్చు చేసినవి మూడు శాఖలు ఉండగా, 25 శాతం కన్నా తక్కువ ఖర్చు పెట్టిన శాఖలు 16 ఉన్నాయి. అత్యధికంగా గ్రామీణాభివృద్ధి శాఖ రూ.2794 కోట్లలో 1270 కోట్లు ఖర్చు చేసింది. మహిళా సంక్షేమ శాఖలో కూడా రూ.298 కోట్లకుగాను 164 కోట్లు ఖర్చు చేశారు. పంచాయితీరాజ్‌లో అత్యధికంగా రూ.198 కోట్లకుగాను 125 కోట్లు ఖర్చు చేశారు. యువజన సంక్షేమశాఖ, పరిశ్రమలు వంటి శాఖల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. మొత్తం నిధులు రూ.9847 కోట్ల రూపాయలను 11 సెక్టార్లకు కేటాయించారు. ఆయా రంగాల్లో ఎస్సీల అభివృద్ధి కోసం ఈ నిధుల్ని ఖర్చు చేయాలని నిర్దేశించారు. ఇందులో భాగంగా పచ్చదనం రంగానికి 1.1 శాతంకేటాయించగా, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో 1.18 శాతం, పట్టణ మౌలికాభివృద్ధి రంగంలో 3.3 శాతం, ఆరోగ్యం, పౌష్టికాహార విభాగంలో మిగతా 9లో

గరగపర్రు దళితులకు
సర్కారు వెన్నుపోటు

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

సాంఘిక బహిష్కరణకు గురైన గరగపర్రు దళితులకు న్యాయం చేస్తామని చెప్పి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచింది. మంత్రుల బృందం, ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఇచ్చిన హామీలను సైతం తుంగలో తొక్కింది. ఈ ఏడాది ఏప్రిల్ 12న అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు సమయంలో అగ్రవర్ణాలకు, దళితులకు మధ్య వివాదం ఏర్పడింది. దీంతో మే 5 నుంచి దళితులపై అగ్రవర్ణాలు సాంఘిక బహిష్కరణ విధించాయి.


కౌలు పొలాలు తీసేసుకున్నాయి. పనులకు రాకూడదని నిబంధన విధించాయి. ఈ విషయం పెద్దదై బయటకు పొక్కడంతో ప్రభుత్వం దళితులను ఆదుకుంటామని చెప్పింది. గతనెల 25న మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, పితాని సత్యనారాయణ, జవహర్, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్, ఎమ్మెల్యే శివరామరాజు ఆ గ్రామంలో పర్యటించారు. కలెక్టర్ కొన్ని కుటుంబాలకే పరిహారం అందించాలని నివేదిక ఇచ్చారని, ప్రతి కుటుంబానికీ రూ.లక్ష చొప్పున పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. అట్రాసిటీ చట్టం ప్రకారం సాంఘిక బహిష్కరణకు గురైన దళితుల కుటుంబానికి రూ.పది లక్షల చొప్పున పరిహారం, లేదా భూమి కొనుగోలు చేసి ఇవ్వాల్సి ఉంది. మంత్రుల బృందం రూ.లక్ష పరిహారం ప్రకటించినప్పటికీ గరగపర్రు దళితులు సరిపెట్టుకున్నారు. ఆ పరిహారం అందించడంలోనూ ప్రభుత్వం దళితులకు తీరని అన్యాయం చేసేందుకు పూనుకుంది. గ్రామంలో 360 దళిత కుటుంబాలు ఉంటే.. అందులో మిగతా 9లో

చిత్తూరులో
ఘోర ప్రమాదం

- నలుగురు స్పెయిన్ వాసులు, టెంపో డ్రైవర్ మృతి
- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్/ పుంగనూరు

చిత్తూరు జిల్లా మదనపల్లె- పుంగ నూరు జాతీయ రహదారి నెత్తిరోడింది. పుంగనూరు మండలంలోని ఈడిగపల్లి పంచాయతి యాతాలవంక మలుపు వద్ద శనివారం ఉదయం ట్రావెలర్ టెంపోను కంటైనర్ ఢీకొన్న ఘటనలో ఐదుగురు మృతి చెందారు. వీరిలో నలుగురు స్పెయిన్ దేశస్తులు కాగా మరొకరు టెంపో డ్రైవర్. మరో తొమ్మిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగుళూరు ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో స్పెయిన్ దేశానికి చెందిన ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు మిగతా 9లో



'వంశధార'కు సహకరించాలి : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా సమగ్రాభివృద్ధికి దోహదపడే వంశధార ప్రాజెక్టు రెండో దశ పూర్తికి స్థానిక ప్రజలు సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. శ్రీకాకుళం జిల్లా ముఖ్య నేతలతో శనివారం సిఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యమని, జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార కీలకమని, దాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసుకోవాల్సిన అవసరముందని తెలిపారు. పుష్కలంగా నీటి వనరులు ఉన్న జిల్లా గత పాలకుల నిర్లక్ష్యం, అవినీతి వల్ల వెనుకబడిన జిల్లాగానే మిగిలిపోయిందన్నారు. తాము అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి : జవహర్



ప్రజాశక్తి-నంద్యాల

కర్నూలు జిల్లా నంద్యాల బహిరంగసభలో వైఎస్ఆర్‌సిపి నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి సిఎంపై చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎక్సైజ్ శాఖమంత్రి జవహర్ డిమాండ్ చేశారు. నంద్యాల టిడిపి కార్యాలయంలో శనివారం విలేక రుల సమావేశంలో ఎక్సైజ్ శాఖా మంత్రి జవహర్, ఎమ్మెల్సీ షరీఫ్, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ హిదాయత్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. బహిరంగసభలో జగన్ మహ్మద్ ప్రవక్త పేరు ప్రస్తావించడం దారుణమని, ప్రవక్త పేరును ఉచ్చరించే అర్హత, హక్కు ఆయనకు లేదని అన్నారు. ముస్లింలకు రక్షణ కల్పించింది టిడిపి ప్రభుత్వమేనన్నారు.

ప్రజ్ఞ

1. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో ఏమని పిలుస్తారు?
2. 100 మీటర్ల పరుగులో హుస్సైన్ బోల్టు సగటు టైమింగ్ ఎంత?
3. మరణ ధ్రువీకరణ కోసం కేంద్రం దేన్ని తప్పనిసరి చేసింది?
4. సభాహక్కుల తీర్మానం ఎదుర్కొన్న కేంద్ర మంత్రి ఎవరు?
5. నీతి అయోగ్ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసిన ఆర్థికవేత్త ఎవరు?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- మొత్తం 41 సెట్లు దాఖలు
- నంద్యాల బరిలో టిడిపి, వైసిపి, కాంగ్రెస్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక నామినేషన్ల పర్వం శనివారంతో ముగిసింది. గతనెల 29న ఉప ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కాగా మొత్తం 41 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. టిడిపి, వైసిపి, కాంగ్రెస్, ఆర్‌పిఎస్, ఎంఆర్‌పిఎస్, అన్న వైఎస్ఆర్, ఎంఐఎం, బిసి యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులు నామినేషన్ వేశారు. జులై 29న అన్న వైఎస్ఆర్, నవతరం పార్టీల తరపున 2 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆగస్టు 2న 5 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందారెడ్డి తరపున 2, భూమా మౌనికారెడ్డి మరో నామినేషన్‌ను దాఖలు చేశారు. అన్న వైఎస్ఆర్ పార్టీ తరపున షేక్ మహబూబ్‌బాష మరో సెట్‌ను, ఎంఐఎం తరపున పివి.నారాయణ రెడ్డి దాఖలు చేశారు. ఆగస్టు 4న 13 నామినేషన్లు దాఖలయ్యాయి. వైసిపి నుంచి ఎస్.చంద్రమోహన్ 3 సెట్ల నామినేషన్ల దాఖలు చేశారు. ఆర్‌పిఎస్ నుంచి బవనాసి పుల్లయ్య, ఎం.మల్లికార్జునరావు, బిసి యునైటెడ్ ఫ్రంట్ నుంచి జి.అబ్దుల్ సత్తార్, వైసిపి తరపున ఎస్.రవిచంద్ర కిశోర్‌రెడ్డి, కాంగ్రెస్ తరపున ఎస్.సుదర్శన్‌రెడ్డి, సమాజ్‌వాదీ పార్టీ తరపున రాఘవేంద్ర, ఇండిపెండెంట్‌గా జి.రామరాజులు దాఖలు చేశారు. చివరిరోజు శనివారం 21 మంది నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి అబ్దుల్‌ఖాదర్, సి.పుల్లయ్య నామినేషన్లు వేశారు. టిడిపి తరపున భూమా మౌనికారెడ్డి, వైసిపి నుంచి ఎస్.శివరాం, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఆర్‌పిఎస్ నుంచి బి.పుల్లయ్య, జి.నవీన్, ఎంఆర్‌పిఎస్ తరపున బి.నరసింహులు, రాజ్యాధికార పార్టీ తరపున వి.సున్నరాయుడు, స్వతంత్ర్య అభ్యర్థులుగా బ్రహ్మానందారెడ్డి, రఘునాథరెడ్డి, ఎస్.రాజమోహన్‌రెడ్డి, ఎన్.మధుమోహన్‌రెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, వై.శ్రీనివాసులురెడ్డి, వి.రెడ్డప్ప, రాజారెడ్డి, బాలసుబ్బయ్య, రవిశంకర్‌రెడ్డి, జిపి.గురవయ్య, కోలా కలగన్ నామినేషన్‌లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.ప్రసన్న వెంకటేష్‌కు అందజేశారు.



కాంగ్రెస్ అభ్యర్థిగా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి తదితరులు

అట్టహాసంగా కాంగ్రెస్ నామినేషన్

చివరిరోజు శనివారం పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరా రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ అభ్యర్థి సయ్యద్ అబ్దుల్ ఖాదర్ నామినేషన్ దాఖలు చేశారు. నంద్యాల పద్మావతి నగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరి ఆర్‌డిఓ కార్యాలయంలో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా రఘువీరా రెడ్డి మాట్లాడారు. 25 ఏళ్లుగా కాంగ్రెస్‌లో పని చేస్తున్న అబ్దుల్ ఖాదర్ సేవలను గుర్తించి నంద్యాల ఎన్ని కల్లో అభ్యర్థిగా ప్రకటించామని తెలిపారు. రోజుకో పార్టీ మారే వైసిపి, టిడిపి నాయకు లకు నంద్యాల ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు రక్ష ణ కల్పించేది ఒక్క కాంగ్రెస్ పార్టీనే అని చెప్పారు. 600 హామీలను తుంగలో తొక్కి న పార్టీ టిడిపి అని, వారికి ఓట్లు వేస్తే బూడి దలో పోసిన పన్నీరే అని ప్రజలకు సూచించారు.

ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర పరిశీలకులు హిమాన్షుచౌదరి

నంద్యాల ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు హిమాన్షు చౌదరి అధికారులను ఆదేశించారు. కర్నూలు ప్రభుత్వ అతిథిగృహంలో కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎస్పీ గోపీనాథ్‌జెట్టి మర్యాద పూర్వకంగా కలిశారు. నంద్యాల ఉప ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. ఉప ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎన్నికలను నిర్వహించాలని ఆదేశించారు.

జగన్‌కు ఇసి నోటీసు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

నంద్యాల ఉప ఎన్నికల ప్రచార సభలో 'ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని నడిరోడ్డుపై కాల్చిపారేసిన తప్పులేదు' అని వైఎస్ఆర్‌పార్టీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై 48 గంటల్లో సమాధానం ఇవ్వాలని ఎన్నికల కమిషన్ శనివారం నోటీసుల జారీ చేశారు. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా సుమోటాగా తీసుకున్నట్లు ఇసి ప్రకటించారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని కర్నూలు జిల్లా కలెక్టర్ ఎస్. సత్యనారాయణకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. ప్రసన్న వెంకటేశ్‌కు నోటీసులు జారీ చేశారు. బహిరంగ సభను ప్రత్యక్ష ప్రసారం చేసినందుకు జగతీ పబ్లికేషన్స్‌కు, వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ విచారణకు కూడా ఆదేశించారు.

ప్రతి కుటుంబానికి లక్ష ఇవ్వాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమ గోదావరి జిల్లాలో సాంఘిక బహిష్కరణకు గురైన గరగపర్రులోని ప్రతి దళిత కుటుంబానికి రూ.లక్ష రూపాయిలు ఇవ్వాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. కేవలం 240 కుటుంబాలకు రూ.2.4కోట్లు ఇవ్వడం దళితుల మధ్య గొడవలు, అపోహలు కల్పించడం తప్ప మరోకటి కాదని సంఘం ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి ప్రత్యేక పరిస్థితులు, ఘటనలు సంభవిస్తే ప్రభుత్వ జనరల్ ఫండ్ నుంచి ఇవ్వకుండా ఎస్సీ కార్పొరేషన్ నుంచి చెల్లించడం సిగ్గు చేటని, ఈ చర్య దళితులను మోసం చేయడమేనని విమర్శించారు.



రైవస్ కాల్వలో దొరికిన సూర్యకుమారి మృతదేహం (ఇన్‌సెట్లో ఫైల్ ఫోటో)

సూర్యకుమారి అదృశ్యం విషాదాంతం

- రైవస్ కాలువలో మృతదేహం లభ్యం
- గాంధీనగర్‌లో స్కూటీ గుర్తింపు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

విజయవాడలో సంచలనం సృష్టించిన డాక్టర్ సూర్యకుమారి అదృశ్యం విషాదాంతమైంది. ఆమె మృతదేహాన్ని విజయవాడ సమీపంలోని నిడమానూరు వద్ద రైవస్ కాల్వలో శనివారం గుర్తించారు. మృతురాలి మెడలో ఉన్న చైను ఆధారంగా తల్లిదండ్రులు తమ బిడ్డేనని గుర్తించారు. ముందుగా పోలీసులు విజయవాడ గాంధీనగర్‌లో రైవస్ కాల్వ వద్ద ఆమె ద్విచక్ర వాహనాన్ని గుర్తించారు. దీంతో అనుమానంతో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు జెమిని బోట్ల సాయంతో కాల్వలో రాత్రి ఏడు గంటల సమయంలో నిడమానూరు వద్ద మృతదేహాన్ని గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఎంబిబిఎస్ పూర్తి చేసిన సూర్యకుమారి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో సేవలందించేందుకు కృష్ణాజిల్లా విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు నెలల నుంచి సేవలందిస్తోంది. ఈ క్రమంలో జులై 31వ తేదీ అర్ధరాత్రి ఆమె అదృశ్యమైంది. తమ కుమార్తె కనిపించడంలేదని ఈనెల ఒకటో తేదీన ఆమె తల్లిదండ్రులు మాచవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే జయరాజు కుమారుడు విద్యాసాగర్‌ను అదుపులోకి తీసుకుని నాలుగు రోజులపాటు విచారించారు. అనంతరం శుక్రవారం సాయంత్రం విద్యాసాగర్‌ను విడుదల చేశారు. సూర్యకుమారి కాల్‌డేటా, సిసి కెమెరాల పుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఆమె స్కూటీ రైవస్ కాల్వ వద్ద ఉందని శనివారం మధ్యాహ్నం సమాచారం వచ్చింది. అప్రమత్తమైన పోలీసులు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. రైవస్ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకుందేమోననే అనుమానంతో బోట్ల సాయంతో కాల్వలో గాలించారు. చివరికి నిడమానూరు వద్ద ఆమె మృతదేహాన్ని గుర్తించారు. సూర్యకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఆమెది హత్య, ఆత్మహత్య అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సూర్యకుమారి సోదరి కర్నాటకలో ఐఎఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తోంది.



పురుషోత్తపట్నం వద్ద నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్

హడావిడిగా 'పురుషోత్తపట్నం'

- పూర్తి కాని వంతెనలు.. ఆదరాబాదరాగా పైపులైన్లు
- 15న తాత్కాలికంగానే ఏలేరుకు నీటి విడుదల!

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

ఓ వైపు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి ఈనెల 15న ఏలేరుకు నీరిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. మరోవైపు గోకవరం మండలం వీరలంకపల్లి - బావాజీపేట మధ్య జాతీయ రహదారిపై వంతెన నిర్మాణమే పూర్తికాలేదు. దీని నిర్మాణం పూర్తికాకుండా ఏలేరుకు నీరివ్వడం అసాధ్యం. దీంతో తాత్కాలిక ప్రాతిపదికనే నీరిచ్చేందుకు అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం వద్ద 10 పంపులను ఏర్పాటు చేస్తున్నారు. 85 మీటర్ల వెడల్పుతో ఐదు పంపుల ద్వారా 10.1 కిలోమీటర్ల మేర నీటిని పంపింగ్ చేస్తారు. దేవీపట్నం మండలం గండికోటలోని పోలవరం ఎడమ ప్రధాన కాలువలో 1.6 కిలోమీటరు వద్ద ఆగస్టు 15న నీటిని వదలాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రతి ఏటా 10 నుంచి 12 టిఎంసిల నీరు కొరతగా ఉంది. దీన్ని అధిగమించేందుకు పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 1,400 క్యూసెక్కుల నీటిని ఏలేరుకు పంపిస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ పథకం మొదటిదశలో రూ.1,029 కోట్ల విలువైన పనులు చేపట్టారు. పోలవరం ఎడమ కాలువలో ఎత్తిపోసిన నీరు, ఆ కాలువ ద్వారా 50 కిలోమీటర్లు పయనిస్తుంది. అనంతరం రెండోదశలో మరో పంపింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అక్కడ్నుంచి 13 కిలోమీటర్ల దూరం వరకు 8 పంపుల ద్వారా నీటిని పంపే ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రెండోదశకు సంబంధించిన పనులు 40 శాతం కూడా పూర్తి కాలేదు. పురుషోత్తపట్నం నుంచి ఏలేరుకు నీరు చేరాలంటే గోకవరం మండలం వీరలంకపల్లి - బావాజీపేట మధ్య జాతీయ రహదారిపై వంతెన నిర్మాణం పూర్తి కావాలి. ప్రస్తుతం వంతెనకు సంబంధించి పిల్లర్ల ఏర్పాటు కూడా పూర్తి కాలేదు. వీటి నిర్మాణం పూర్తయ్యాక వంతెనకు స్లాబ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. సిఎం చంద్రబాబు ఈనెల 7న పనుల పరిశీలనకు వస్తున్న నేపథ్యంలో రాత్రింబవళ్లు పనులు చేస్తున్నప్పటికీ వంతెన నిర్మాణం శనివారం నాటికీ ఓ కొలిక్కి రాలేదు. ఈ వంతెన పూర్తి కావడానికి ఇంకా రెండు, మూడు నెలలు పట్టే అవకాశం ఉంది.

వాతావరణం

24 గంటల్లో అల్పపీడనం

- వాయువ్య బంగాళాఖాతంలో ఆవర్తనం
- 7, 8 తేదీల్లో కోస్తా, సీమల్లో పలుచోట్ల జల్లులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

శుక్రవారం ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం శనివారం నాటికి వాయువ్య బంగాళాఖాతానికి చేరుకుంది. 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఆవరించి ఉన్న ఆవర్తనం నైరుతి దిశకు వంగి ఉన్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఇది రాగల 24 గంటల్లో అల్పపీడనంగా మారుతుందని అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో కోస్తా, రాయలసీమలో ఆదివారం అక్కడక్కడా సోమ, మంగళవారాల్లో పలు చోట్ల ఓ మోస్తరు నుంచి చెదరుమదురు జల్లులు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. వారం రోజులుగా మండుతున్న ఎండలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, హిమాలయాల్లో ఉన్న నైరుతి రుతు పవనాలు వెనక్కు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. శనివారం రాష్ట్రంలో అక్కడక్కడా చెదురు మదురు నుంచి మోస్తరు జల్లులు పడ్డాయి.

వ్యవసాయంపై చర్చించే తీరికే లేదా?

- 8, 9 తేదీల్లో వర్షాభావ ప్రాంతాల్లో పర్యటన
- నంద్యాల ఎన్నికపైనే ప్రభుత్వ దృష్టి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాగునీరు లేక వ్యవసాయ రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితులపై చర్చించే తీరిక ప్రభుత్వానికి లేకుండా పోయిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకుండా పూర్తిగా నంద్యాల ఉప ఎన్నికపైనే దృష్టి సారించడం దారుణమని విమర్శించారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 7న వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనంతపురంలో రాష్ట్రస్థాయి సదస్సును ఏర్పాటు చేశామన్నారు. 8, 9 తేదీల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో వర్షాభావం నెలకొన్న ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితుల్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెబుతూ చంద్రబాబు ప్రభుత్వం అప్పుల్లో ముంచుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు నెలల వ్యవధిలో రూ. 10,600 కోట్లను అప్పులుగా తీసుకొచ్చారన్నారు. ఈ మూడేళ్ల కాలంలో ఎక్కడెక్కడ, ఎంతెంత అప్పులు తీసుకొచ్చారు, ఏమేరకు అప్పులు పెరిగాయనే విషయమై ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలు సబబుకాదు

సిఎం చంద్రబాబుపై నంద్యాల సభలో ప్రతిపక్షనేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు సబబుకాదని రామకృష్ణ అన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకొచ్చాక ప్రజాస్వామ్యం, ప్రతిపక్షాలపై దాడులు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సంఘ్‌పరివార్, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, హిందూసేన వంటి మతోన్మాద శక్తులు దాడులకు పాల్పడుతున్నాయన్నారు. భౌతికదాడులకు పాల్పడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయన్నారు. గుజరాత్‌లో వరద ప్రాంతాల్లో పర్యటించేందుకు వెళ్లిన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీపై రాళ్లదాడికి పూనుకోవడం శోచనీయమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఉందా? లేదా? అనే అనుమానం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లివిల్సన్, రావుల వెంకయ్య, పుట్టా హరినాథరెడ్డి పాల్గొన్నారు.

మూడు రోజుల్లో 25.18 లక్షల ఎంఆర్ టీకాలు

కమిషనర్ సుజాత శర్మ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు పోలియో తరహాలోనే 2020 నాటికి దేశంలో మీజిల్స్ (తట్టు)- రుబెల్లా(పొంగు)లను తరిమికొట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎమ్ఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టిందని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ సుజాత శర్మ పేర్కొన్నారు. ఈ నెల ఒకటో తేదీన మొదలైన ఎమ్ఆర్ టీకాల కార్యక్రమం సెప్టెంబర్ 8 వరకు చేపడతామని శనివారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,22,06,946 మంది 9 నెలల నుంచి 15 ఏళ్ల వయసు బాలలకు ఒక డోసు ఈ టీకాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈనెల మూడో తేదీ వరకు దాదాపు 25.18 లక్షల మందికి టీకాలు వేశామని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2.6 మిలియన్ల మంది పిల్లలు మీజిల్స్ బారిన పడుతున్నారని కమిషనర్ తెలిపారు. మీజిల్స్ వల్ల 2000 నాటికి ఏటా మరణించేవారి సంఖ్య 6,51,600 ఉంటే, ఈ టీకాల వల్ల 2015 నాటికి ఆ సంఖ్య 1,34,200కు తగ్గిందని వివరించారు.

నిధుల విడుదలపై పంచాయతీలకు ఆంక్షలు

- ఎస్‌డబ్ల్యూఎం షెడ్లు నిర్మించాలని షరతు
- సర్పంచ్‌ల అభ్యంతరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీలకు కేటాయించిన నిధుల విడుదలపై అధికారులు ఆంక్షలు విధిస్తుండటం పంచాయతీరాజ్ శాఖలో వివాదాస్పదంగా మారింది. అన్ని గ్రామ పంచాయతీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూఎం) ప్లాంట్లు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామంలో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి, తడి చెత్తతో వర్మీకంపోస్టు, పొడి చెత్త విక్రయాలతో ఆదాయం పొందితే పారిశుధ్య సమస్య పరిష్కారమవుతుందనేది ప్రభుత్వ ఆలోచన. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు ఎస్‌డబ్ల్యూఎం షెడ్లు నిర్మించని గ్రామ పంచాయతీల్లో వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని, లేకుంటే 14వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులను అనుమతి లేకుండా విడుదల చేయకూడదని సర్క్యులర్ జారీ చేశారు. ప్లాంటు నిర్మించి, ఎంబుక్‌లో రికార్డు చేయించుకుని డిపిఓ కార్యాలయాల్లో సమర్పించాలని ఆదేశించడంతో గ్రామాల సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూఎం ప్లాంట్లు ముందుకు సాగకపోవడానికి ప్రధానంగా స్థలాల కొరత ఉందని సర్పంచులు చెబుతున్నారు. రెవిన్యూ అధికారులు స్థలం కేటాయిస్తే పంచాయతీలు ప్లాంట్లు నిర్మిస్తాయంటున్నారు. స్థల సమస్య పరిష్కరించకుండా నిధుల విడుదల నిలిపివేస్తే పంచాయతీల్లో రోజువారీ కార్యక్రమాలు, వివిధ పనులు నిలిచిపోతాయంటున్నారు. ఎస్‌డబ్ల్యూఎం ప్లాంట్ల నిర్మాణం కొన్ని పంచాయతీల్లో పూర్తి చేసి ఆదాయాన్ని ఆర్జిస్తుండటంతో మిగిలిన పంచాయతీల్లో ఈ విధానాన్ని కొనసాగించాలనే ఒత్తిడి ప్రభుత్వం వైపు నుంచి పెరిగింది. ఏడాది నుంచి కసరత్తు చేస్తున్నా కేవలం 400 పంచాయతీల్లో మాత్రమే ఎస్‌డబ్ల్యూఎం ప్లాంట్ల నిర్వహణ సాగుతుండగా, 1100 పంచాయతీల్లో మాత్రమే ప్లాంట్లు ఏర్పాటుకు షెడ్లు నిర్మించారు. ఈ ఏడాది చివరి నాటికి అయిదు వేల గ్రామాల్లో ప్లాంట్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యం కావడంతో అధికారులు ఆర్థిక ఆంక్షలు పెడుతున్నట్లు సమాచారం.

ఆంక్షలు ఎత్తివేయాలి: జాస్తి

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మంట్ ప్లాంట్లు నిరించని గ్రామ పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులు విడుదల నిలిపివేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆదేశాలు ఇవ్వడాన్ని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు తప్పుబట్టారు. నిధుల విడుదలపై ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలన్నారు. ఇప్పటికే ఈ విషయంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులకు వినతి పత్రం సమర్పించినట్లు చెప్పారు. నిధుల విడుదల నిలిచిపోతే గ్రామాల్లో పారిశుధ్యం, ఇతర అత్యవసర పనులకు ఆటంకం ఏర్పడి ప్రజలు అసౌకర్యానికి గురవుతారన్నారు.

రేపటి నుంచి మున్సిపల్ జెఎసి రిలే దీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ డిమాండ్ల సాధనకై ఈనెల 7ఏడో తేదీ నుంచి విజయవాడలోని అలంకార్ సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోందని జెఎసి నాయకులు కె ఉమామహేశ్వరరావు, రంగనాయకులు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పట్టణ ప్రజల సంక్షేమానికి తూట్లు పొడిచేందుకు 279 జీవోను అమలు చేసేందుకు పూనుకొందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 279, టెండర్ల రద్దు, మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలు, విజయవాడ, విశాఖ నగరాలకు 010 పద్దు, పర్మినెంట్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, స్కూల్ స్వీపర్లకు ఫుల్‌టైం వర్కర్లుగా గుర్తింపు తదితర డిమాండ్ల సాధనకై ఈ దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షలను, ఈనెల 22న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

దేశంలోనే జిసిసి అగ్రగామి

- రూ. 500 కోట్లు టర్నోవర్ లక్ష్యంగా ప్రణాళికలు
- మంత్రి నక్కా ఆనంద్ బాబు వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలోని గిరిజన సహకార సంస్థల్లో ఎపిలోని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్(జిసిసి) అగ్రగామిగా నిలిచిందని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి నక్కా ఆనంద్ బాబు తెలిపారు. రానున్న రెండేళ్లలో జిసిసి ద్వారా రూ. 500 కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. విజయవాడలో ఒక ప్రైవేటు హోటల్‌లో జిసిసి తయారు చేసిన నన్నారి షర్బత్ టెట్రాప్యాక్, త్రిఫలా షర్బత్‌ను శనివారం మంత్రి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్ల క్రితం వరకు జిసిసి టర్నోవర్ రూ. 90 కోట్లుండగా, గతేడాది రూ. 247 కోట్లు టర్నోవర్ సాధించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 317 కోట్ల టర్నోవర్ దిశగా జిసిసి కార్యకలాపాల్ని సాగిస్తోందన్నారు. గిరిజనుల అటవీ ఉత్పత్తులకు, వ్యాపార పంటలకు జిసిసి ద్వారా గిట్టుబాటు ధరలను అందిస్తున్నట్లు తెలిపారు.

అరకు కాఫీకి సిఎం చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారన్నారు. జిసిసి ద్వారా సుమారు 200 మంది స్థానిక గిరిజన యువతకు అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. గిరిజన బ్రాండ్ తో విక్రయిస్తున్న జిసిసి ఉత్పత్తులకు అన్ని ప్రాంతాల్లో డిమాండ్ పెరుగుతోందన్నారు. నన్నారి షర్బత్ టెట్రాప్యాక్, త్రిఫలా షర్బత్‌లకు ఇప్పటికే రూ. 35 లక్షల కొనుగోలు ఆర్డర్లొచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి పద్మ, జిసిసి ఎండి రవీంద్రనాథ్, విజిలెన్స్ డైరెక్టర్ గిరిజా ప్రసాద్, అరకు ఎమ్మెల్యే సర్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న మంత్రి నక్కా ఆనంద్‌బాబు, జిసిసి ఎండి రవీంద్రనాథ్

పదేళ్లుగా ఉపాధి కరువు

వ్యవసాయ ఆధారిత, సంపన్న గ్రామాలుగా పేరొందిన ఆ ప్రాంతాలు నేడు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. సెజ్‌కు భూములిస్తే మీకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, మీ పిల్లలకు కార్పొరేట్ విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికారు. అరచేతిలో వైకుంఠం చూపించి భూములను తమ సొంతం చేసుకున్నారు. కాని వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పదేళ్లుగా ఒక్కటంటే ఒక్క పరిశ్రమ మాత్రమే వచ్చింది. 'అటు వ్యవసా యానికి, కూలీ పనులకు నోచుకోక, జీవనోపాధి లేక ఎదురుచూస్తున్నాం' అని తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సముద్రతీర ప్రాంతమైన కెఎస్ఇజడ్ బాధితులు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు.



కాకినాడ సెజ్ ముఖద్వారం

- పెళ్లి సంబంధాలు రావడం లేదు
- జాబ్‌కార్డులతో ఎదురుచూపులు
- ఇదీ కాకినాడ సెజ్ గ్రామాల్లో పరిస్థితి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి కోసం పదేళ్లక్రితం సుమారు పదివేల ఎకరాలను అప్పటి ప్రభుత్వం యు.కొత్తపల్లి, తొండంగి మండలాల రైతుల నుంచి సేకరించింది. పదివేల ఎకరాలను సేకరించగా, ఐదు వేల ఎకరాలను కొనుగోలు చేయగా, 3,500 ఎకరాలకు అవార్డు ప్రకటించారు. మరో 1400 ఎకరాలకు అవార్డు ప్రకటించి ఉన్నా రైతులు డబ్బులు తీసుకోలేదు. ఈ భూముల్లో పది ఎకరాల్లోనే బొమ్మల ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. మరో 20 ఎకరాల్లో పునరావాస కాలనీ నిర్మించారు. మిగిలిన భూములు నిరుపయో గంగానే ఉన్నాయి. అటు రైతులు పంటలు వేయనీ యకుండా అడ్డు కున్నారు. అలాగని పరిశ్రమలు కూడా తీసుకురాక పోవడంతో ఆ ప్రాంత వాసులు నానా తంటాలు పడుతున్నారు.

పదేళ్లలో ఒక్క పరిశ్రమే...

పదేళ్ల క్రితం పదివేల ఎకరాలను సేకరించిన సెజ్ యాజమాన్యం ఇక్కడికి ఒక్క పరిశ్రమనే తీసుకురాగలిగింది. చైనాకు చెందిన బొమ్మల కంపెనీని తూతూ మంత్రంగా పది ఎకరాల్లో ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ ఫ్యాక్టరీలో 500 మంది మహిళలకు అరకొర వేతనాలతో ఉపాధి చూపిస్తున్నారు. రూ.30వేల కోట్లతో పరిశ్రమలు వస్తున్నాయని, సీఎం చంద్రబాబు అనేక కంపెనీలతో ఎంఒయులు కుదుర్చుకున్నారని సెజ్ యాజమాన్యం, ప్రభుత్వం ప్రకటించుకుం టున్నా కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు.

16 గ్రామాలు ఖాళీ

యు.కొత్తపల్లి మండలం పొన్నాడ, రమణక్కపేట, మూలపేట, శ్రీరాంపురం పంచా యతీల్లోని 34 శివారు గ్రామాల ప్రజలు సెజ్‌లో బాధితులుగా ఉన్నారు. విలువైన భూములు లాక్కోవ డంతోపాటు కొన్ని గ్రామాలను ఇప్పటికే ఖాళీ చేయిం చారు. మాతావారిపాలెం, కోల్లావారిపాలెం, దడాలవారి పాలెం, రామరాఘవపురం పంచాయతీ ల్లోని 16 గ్రామాలను ఖాళీ చేయించారు. ఈ గ్రామాల నుంచి వెయ్యి కుటుంబాలను ఖాళీ చేయించి మూలపేటలోని ఎస్ఇజడ్ పునరావాస కాలనీకి తరలించారు.



మీ కోసం.. మీ పిల్లల భవిత కోసం అని ఎస్ఇజెడ్ యాజమాన్యం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

జాబ్ కార్డులే.. ఉపాధి ఏదీ?

నిరుద్యోగు లకు ఉపాధి కల్పిస్తామని ప్రకటించి ఐదువేల మందికి ఉపాధి కార్డులు ఇచ్చారు. 250 మందికి ఉపాధి శిక్షణ ఇచ్చారు. ఉపాధి చూపకపో వడంతో పరిశ్రమల కోసం బాధిత గ్రామాలు ఎదురుచూస్తున్నాయి. సెజ్ కోసం సేకరించిన భూములను కాపలా కాసేందుకు సెక్యూరిటీ గార్డులుగా కొంతమందిని ఉపయోగించు కుంటున్నారు.

గ్రామాల్లో అభివృద్ధి కట్

సెజ్ ప్రభావిత గ్రామాల్లో ఇంకా నాలుగు గ్రామాలు ఖాళీ చేయకుండా అక్కడి ప్రజలు ఎదురుతిరిగారు. యు.కొత్తపల్లి మండలం శ్రీరాంపురం, రామణక్కపేట, పొన్నాడ, మాతావారి పాలెం గ్రామాలను సెజ్ యాజమాన్యం ఖాళీ చేయించేందుకు అనేక పర్యాయాలు ప్రయత్నించింది. ఆ గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకోడానికి, విద్యుత్, మంచినీటి కుళాయి కనెక్షన్ ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఇలా అనేక అభివృద్ధి పనులకు ఆ నాలుగు గ్రామాలు దూరంగా ఉంటున్నాయి.

పెళ్లిళ్లకు దూరం

సెజ్ ప్రభావిత గ్రామాల్లో ఒకప్పుడు అందరికీ ఎంతో కొంత భూమి ఉండేది. భూములు లేని పేదలకు నిత్యం వ్యవసాయ పనులు, ఇతర పనులు ఉండేవి. సెజ్ యాజమాన్యం ప్రవేశించిన తర్వాత భూములు లాక్కున్నారు. దీంతో విలువైన ఇళ్లు, పొలాలు కోల్పోయారు. ఇళ్ళు, పొలాలు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో సుమారు 20 వేల కుటుంబాలు రోడ్డునపడ్డాయి. అటు ఉపాధి లేక, ఇటు సొంత ఇళ్ళు లేకపోవడంతో బంధువులు కూడా రావడం మానేశారు. ఇక ఆ గ్రామాలకు పిల్లలను ఇస్తే కష్టాలు పడాల్సిందేనని ఆ గ్రామాల వారితో తమ పిల్లలకు పెళ్లి సంబంధాలు చేసుకునేందుకు ఇతర ప్రాంతాల వారు అయిష్టత చూపుతున్నారు.

రెండెకరాలు కోల్పోయాను



సెజ్ పేరుతో ఒక ఇళ్ళు, రెండు ఎకరాల పదిసెంట్ల భూమిని కోల్పోయాను. గతంలో రామరాఘవ పురంలో నివాసం ఉంటున్నప్పుడు ఉపాధి ఉండేది. సెజ్‌లో 66 రకాల ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొంత సొమ్ము జీతంగా ఇస్తామన్నారు. ఇవేవీ అమలు కాలేదు. ఎస్ఇజడ్ కాలనీలో యువకులు 300 మంది చదువుకుని ఉన్నారు. 25 మందికే ఉద్యోగాలు ఇచ్చారు. మిగిలినవారు ఉపాధి కోసం వేచిచూస్తూ తల్లిదండ్రులకు భారంగా ఉంటున్నారు.

– బండి ఏసుబాబు, సెజ్ బాధితుడు


అభివృద్ధికి ఆమడ దూరం



ఎస్ఇజడ్ కారణంగా గ్రామంలో రోడ్లు నిర్మించలేదు. ఎక్కడికి వెళ్లాలన్నా గ్రామస్థులు ఇబ్బందిపడు తున్నారు. పంచాయతీ పరిధిలో హౌసింగ్ రుణాలు ఇవ్వడం లేదు. రావివారిపాడు గ్రామస్థులు ఇళ్లు నిర్మించుకుంటామని అడిగినా రుణాలు ఇవ్వడం లేదు. రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదు. చిన్న, సన్నకారు రైతులకు అప్పులు పుట్టడం లేదు

– తెలంగశెట్టి భాగ్యలక్ష్మి, పొన్నాడ సర్పంచ్

బతకడమే కష్టంగా ఉంది



రావివారిపాడులో ఉన్న మమ్మల్ని సెజ్ పునరావాస కాలనీకి తీసుకొచ్చారు. గ్రామంలో ఉన్న 12 సెంట్ల భూమిని కోల్పోయాను. మా పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని అన్నారు. నాకు నలుగురు కుమారులు, డిగ్రీ, పదో తరగతి చదువుకున్నా ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నారు. బతకడమే కష్టంగా ఉంది. కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలో తెలియడం లేదు.

– మచ్చా చంద్రరావు, సెజ్ బాధితుడు

సిక్కోలులోనూ నిరాశే..!

- జూన్‌లో 18 మండలాల్లో లోటు వర్షపాతం
- మడ్డువలసలో పడిపోయిన నీటిమట్టం
- అంతంతమాత్రంగా సాగునీరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లాలో సాగు ఈడికగా సాగుతోంది. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో పనులు మొద లవ్వలేదు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 5,08,527.5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయించాలని వ్యవ సాయ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ 2,19,355 ఎకరాల్లోనే వరి సాగవుతోంది. ఇందులో 1,81,730 లక్షల ఎకరాల్లో ఎదలు, 37,625 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. వర్షాభావ పరిస్థితులతో పలు ప్రాంతాల్లో వరి నారుమళ్లు ఎండిపోతున్నాయి. జిల్లాలో జూన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయి. జూన్‌లో సాధారణ సగటు వర్షపాతం 134.9 మిల్లీమీటర్లకుగానూ, 115.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జి.సిగడం మండలంలో మైనస్ 76.5 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం ఉంది. మరో 17 మండలాలూ లోటులోనే ఉన్నాయి.

కష్టాలతో ఖరీఫ్ ప్రారంభం

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ కష్టాలతో ప్రారంభమైంది. నాసిరకం విత్తనాలు రైతులను నిలువునా ముంచేశాయి. భామిని, రేగిడి ఆముదాలవలస, పాలకొండ, కవిటి మండలాల్లో నాసిరకం విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా 1061, 1075, 1010, స్వర్ణ, సాంబమసూరి రకాల విత్తనాలు మొలకెత్తలేదు. ఒడిశాలో కురిసిన భారీ వర్షాలకు జులై 16న నాగావళి నదిని ఆకస్మికంగా వరద నీరు ముంచెత్తడంతో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. నీరు తగ్గాక పంటపొలాల్లో ఇసుక మేటలు వేసింది. వీరఘట్టం, పాలకొండ, బూర్జ, ఆముదాలవలస మండలాల్లో దాదాపు పది వేల ఎకరాల్లో వరి నారుమళ్లు దెబ్బతిన్నాయి. వరుసగా రెండేళ్లు కరువు దెబ్బతీస్తే, అంతకుముందు మూడేళ్లు హుదూద్, ఫైలిన్, నీలం తుపాన్లు రైతులను నష్టపరిచాయి.

నేటికీ అందని 2015 కరువు సాయం

2015 కరువుకు సంబంధించి 2016 జనవరిలో ప్రభుత్వం విడుదల చేసిన రూ.46.63 కోట్ల కరువు సాయం రైతులకు నేటికీ అందలేదు. రైతులకివ్వాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.75 లక్షలు ఖజానా శాఖలో మూలుగుతోంది. 2016 ఖరీఫ్‌లో వచ్చిన కరువుతో జిల్లాలో 34,112 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. కరువు సాయం కింద రూ.20.46 కోట్లను ఇన్‌పుట్ సబ్సిడీగా అందించాల్సి ఉంటుందని అధికారులు ప్రతిపాదనలు పంపారు. సాయం కోసం రైతులకు ఎదురుచూపులే మిగిలాయి.

నిరాశాజనకంగా పరిస్థితులు

జిల్లాలో సాగునీటి పరిస్థితి నిరాశాజనకంగా ఉంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మడ్డువలస రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పడిపోయాయి. గరిష్ట నీటిమట్టం 65 మీటర్లు కాగా, ప్రస్తుతం 61.75 మీటర్లు ఉంది. గత ఖరీఫ్‌లో ఇదే సమయానికి నీటిమట్టం 64 మీటర్లు ఉండేది. హిరమండలం మండలం గొట్టా బ్యారేజీ ప్రాంతంలో గండిపడింది. దీంతో, ఎడమ కాలువకు విడిచే పెట్టే నీటిని అధికారులు తగ్గించారు. వాస్తవానికి ఎడమ కాలువ సామర్థ్యం 2400 క్యూసెక్కులు కాగా, ప్రస్తుతం 1900 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు.

పొలాకి, నరసన్నపేట, టెక్కలి మండలాల్లోని శివారు భూములకు నీరందడం లేదు. ఎడమ కాలువ సామర్థ్యం 865 క్యూసెక్కులు కాగా, 725 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. గార మండలానికి పూర్తిగా నీరందడం లేదు. వంశధార కుడి, ఎడమ కాలువలకు షట్టర్లు నిర్మించక పోవడంతో శివారు ప్రాంతాలకు నీరందడం లేదు. తోటపల్లి పాత రెగ్యులేటరీ వ్యవస్థ కాలువ ద్వారా 450 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టాల్సి ఉండగా, 250 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. పాలకొండ, బూర్జ మండలాలకు చుక్క నీరు కూడా అందడం లేదు.

ఉపాధి ఉత్తిదే!

- ఆరు నెలలుగా రూ.10.75 కోట్ల బకాయిలు
- 1.06 లక్షల మంది ఆధార్ సీడింగ్‌కు దూరం
- సకాలంలో వేతనాలందక లక్షలాది మంది వలసలు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

'ఉపాధి హామీ' పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. ఆరు నెలలుగా అనేక కారణాలతో ఆ జిల్లాలో రూ.10.75 కోట్ల బకాయిలు నిలిచిపోయాయి. ఇప్పటివరకు 1.06 లక్షల మందికి ఇంకా ఆధార్ సీడింగ్ చేయాల్సి ఉంది. ఉపాధి పనులకు వెళ్లినా సకాలంలో వేతనాలు అందకపోవడంతో పనులకు వెళ్లేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

ప్రభుత్వ విధానాలు, అధికారుల నిర్లక్ష్యం వెరసీ నెల్లూరు జిల్లా కూలీల పాలిట శాపంగా మారాయి. జిల్లాలోని 940 పంచాయతీల్లో 5,79,948 మందికి జాబ్ కార్డులున్నాయి. వారిలో 5,29,497 మంది శ్రమశక్తి సభ్యులుగా ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.69 లక్షల పనులు కల్పించారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ జరగకపోవడంతో కేవలం 3,45,000 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. సర్కారు జారీ చేసిన జాబ్‌కార్డులతో పోల్చితే కేవలం 60 శాతం మంది మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ప్రస్తుతం పంట సంజీవని, చెక్‌డ్యాములు, నీటికుంటలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యక్తిగత మరుగుదొడ్లు, వర్మీకంపోస్టు ప్లాంట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు, నాడాప్ కంపోస్టు ప్లాంట్లు, సోప్ కిట్లు తయారీ వంటి తదితర పనులు జరుగుతున్నాయి. జిల్లాలో గతేడాది 46 మండలాల్లో 45 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. ఈ ఏడాది సోమశిల రిజర్వాయరులో 7 టిఎంసిలు, కండలేరు రిజర్వాయరులో 4.10 టిఎంసిలకు నీటిమట్టం పడిపోయింది. దీంతో రైతులు సాగుకు స్వస్తి చెప్పి ఉపాధి పనులపైనే ఆశలు పెట్టుకున్నారు.

జిల్లాకు రావాల్సిన 'ఉపాధి' నిధులు నిలిచిపోయాయి. ఆరు నెలలుగా రూ.10.75 కోట్ల బకాయిలున్నాయి. కూలీలకు వేతనాలూ అందడం లేదు. కార్మికులకు రూ.2.90 కోట్లు, మెటీరియల్స్‌కు రూ.4 కోట్లు చెల్లించాల్సి ఉంది. వేతనాల చెల్లింపుల్లో అవకతవకలను అరికట్టేందుకు ప్రభుత్వం నూతన విధానం ప్రవేశపెట్టింది. ఆధార్, బ్యాంకు ఖాతాను జోడించి నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధపడింది. 4.50 లక్షల మంది కార్మికుల్లో ఇప్పటికీ 1.06 లక్షల మంది కూలీల ఖాతాలు ఆధార్ సీడింగ్ కాలేదు. బకాయి వేతనాలు మరో రూ.3.85 కోట్ల చెల్లింపులు నిలిచిపోయాయి.

సకాలంలో వేతనాలందక అవస్థలు

జిల్లాలో కరువు ఛాయలు అలముకుంటున్న నేపథ్యంలో 'ఉపాధి' పనులు ఊరటనిస్తాయని పలువురు ఆశతో ఎదురు చూస్తున్నారు. పనులున్నా నెలల తరబడి వేతనాలు చేతికందకపోవడంతో పస్తులతో అలమటిస్తున్నారు. జిల్లాలోనూ 46 మండలాల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. నెలల తరబడి బకాయిలు నిలిచిపోవడంతో రోజు గడవక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇంకొందరు కరువు పనులకు వెళ్లినా తమకు సకాలంలో వేతనాలు అందడం లేదని వరికుంటపాడుకు చెందిన వెంకటేశ్వర్లు వాపోయారు. చేసేదేమీ లేక గ్రామాలు విడిచి పట్టణాలకు కుటుంబాలతో సహా వలస పోతున్నామని పలువురు వాపోయారు.

14 వరకు ప్రత్యేక క్యాంపులు



ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింకప్ చేపట్టేందుకు 14 వరకూ ప్రత్యేక క్యాంపులు చేపట్టనున్నాం. ఆధార్ సీడింగ్‌తో సాంకేతిక సమస్యలను అధిగమిస్తాం. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా ఉపాధి పనులను పెంచి జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తాం.

– డ్వామా పిడి డి.హరిత

న్యాయ నిపుణుల సలహా తీసుకుంటాం

ఆయేషా హత్య కేసు పునర్విచారణపై సిపి గౌతమ్ సవాంగ్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణలో న్యాయ నిపుణుల సలహా తీసుకుంటామని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ గౌతమ్ సవాంగ్ తెలిపారు. కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాము పారదర్శకంగా ఈ కేసును పునర్విచారిస్తామని అన్నారు. కేసు విచారణకు సిట్ అధికారులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. కేసు విచారణ ఎలా సాగుతుందనేది బయటకు చెప్పకూడదన్నారు. ఈ కేసుపై స్థానికుల్లో చాలా అనుమానాలు, అపోహలు ఉన్నాయని, వీటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించిన పోలీసులు

మెడికల్ షాపు యజమాని సహా ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ నగరంలో 'డ్రగ్స్' రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. రూ.లక్షలు విలువ చేసే మత్తు మందును శనివారం స్వాధీనం చేసుకున్నారు. నాలుగో పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. రైల్వే న్యూకాలనీకి చెందిన యువకులు మత్తుమందు సేవిస్తున్నట్లు డ్రగ్స్ కంట్రోల్ అధికారులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు నలుగురు యువకులను పట్టుకుని విచారించగా, మెడికల్ షాపు నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు చెప్పారు. మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహించి, అక్కడ నుంచి భారీగా కోరక్స్ సిరప్‌ను స్వాధీనం చేసుకున్నారు. మెడికల్ షాపు యజమాని సహా ఐదుగురిని అరెస్టు చేశారు.

పిల్లలకు గుర్తింపు కార్డు నిర్ణయాన్ని విరమించుకోవాలి

ఆర్టీసి ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్టీసి బస్సుల్లో పిల్లల టికెట్టు(హాఫ్ టికెట్టు)కు గుర్తింపు కార్డును తప్పనిసరి చేస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పిల్లలకు బస్సు టికెట్టులో రాయితీ ఎప్పటి నుంచో ఉందని, ఇప్పుడు గుర్తింపు కార్డును తప్పనిసరి చేయడం సరైంది కాదన్నారు. క్యాట్ కార్డ్ అమ్మకాల పేరుతో కండక్టర్లపై వేధింపులు మానుకోవాలని, కండక్టర్లలో ఉన్న భయాదోళనలను తొలగించాలని డిమాండ్ చేశారు. మోటారు వాహన చట్టం సవరణ బిల్లు పార్లమెంటులో వాయిదా పడి సెలక్షన్ కమిటీకి వెళ్లిందని, ఆ బిల్లుపై ఆందోళన కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

కలిమిశ్రీకి శ్రీకృష్ణదేవరాయులు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - విజయవాడ



మల్లెతీగ సాహిత్య వేదిక అధ్యక్షుడు, నవ మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీకి చిత్తూరుకు చెందిన లలిత కళాసాగర్ సంస్థ శ్రీకృష్ణదేవరాయులు జాతీయ పురస్కారం-2016ను ప్రకటించింది. సాహిత్యరంగం, పత్రికారంగంలో రెండు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న సాహితీ కృషికి ఈ పురస్కారం అందజేస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు మర్రిపూడి దేవేంద్రరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కోశాధికారిగా ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టి సాహిత్య కార్యక్రమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 29న చిత్తూరులోని రేణుక కళ్యాణమండపంలో 'శ్రీకృష్ణ దేవరాయులవారి సువర్ణ పాలన - వైభవం'పై జరిగే జాతీయ సదస్సులో కలిమిశ్రీకి ఈ పురస్కారం అందజేయనున్నట్లు దేవేంద్రరావు తెలిపారు.

ఎస్‌పిసిఎలో అవినీతి బట్టబయలు

ఆర్‌డిఒ విచారణలో వెలుగు చూస్తున్న నిజాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

జంతు హింస నివారణ సంఘం (ఎస్‌పిసిఎ) పాత కమిటీ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. గోవుల సంరక్షణ నిమిత్తం ఎస్‌పిసిఎలోని కొంతభాగంలో నిర్మించిన షాపుల అద్దెలు రూ.15 లక్షలకు పైగా పాత కమిటీ సభ్యుల జేబుల్లోకి వెళ్లిపోయాయని ఆర్‌డిఒ విచారణలో తేలింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ మండలంలోని జంతుహింస నివారణ సంఘంలో గోవులను రక్షించి, సంరక్షించేందుకు గురుప్రసాద్ నాయకత్వంలో ఒక కమిటీని గతంలో ఏర్పాటు చేశారు. ఆవుల మరణాల నేపథ్యంలో ఆ కమిటీని రద్దు చేసి, ఆర్‌డిఒ ఎల్.రఘుబాబు ఆధ్వర్యాన కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్‌డిఒ రఘుబాబు, జంతుసంరక్షణ అధికారి వెంకటేశ్వరరావు ఎస్‌పిసిఎకు సంబంధించి 12 షాపులు అద్దెకు తీసుకున్న వారిని శనివారం ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. ఒక్కో షాపునకు రూ.1000 అద్దె ఇస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. షాపు యజమానులను ఆర్‌డిఒ ప్రశ్నించగా, ఒక్కో షాపునకు రూ.6,500 చొప్పున నెలకు ఇస్తున్నామని తెలిపారు. 10 నెలల అడ్వాన్స్‌గా ఒక్కషాపునకు రూ.78,000 చొప్పున మొత్తం రూ.7.80 లక్షల వరకు ఇచ్చామన్నారు. ఏడాది కాలంలో 12 షాపులు అద్దె రూపంలో రూ.9.36 లక్షల వరకూ ఇవ్వాల్సి ఉంది. ఒక ఏడాదిలో ఒక్కో షాపునకు రూ.1,200 చొప్పున 12 షాపులకు రూ.1.44 లక్షలు మాత్రమే రికార్డుల్లో చూపారు. మొత్తం అడ్వాన్స్, 12 నెలల అద్దె కలిపి రూ.17.16 లక్షలు అయింది.

మిగిలిన రూ.15.72 లక్షలు పాత కమిటీ సభ్యుల జేబుల్లోకి వెళ్లిపోయినట్లు ఆరోపణలొచ్చాయి. పశువుల దాణా, ఆవుల అమ్మకాలతో పాటు చాలా అంశాల్లో అవినీతి జరిగిందని స్థానికులు చెబుతున్నారు. రూ.లక్షలు కమిటీ సభ్యులకు ఇచ్చామని, ఇప్పుడు మళ్లీ అద్దెలు, అడ్వాన్సులు కట్టాలంటే ఎలా అని షాపుల నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. నేరుగా రశీదు పొంది అద్దె డబ్బులు చెల్లించాలని ఆర్‌డిఒ తెలిపారు.


ఆరోగ్యంగా ఉన్న ఆవులు


షాపు యజమానులకు విచారిస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
సవ్వడి
సాహిత్యం - కళలు
విజయవాడ
ఆదివారం 6 ఆగస్టు 2017



ఎప్పుడెప్పుడు రాయాలంటే- బాధేసినప్పుడు రాయండి. ఆనందమేసినప్పుడు రాయండి. కోపం వచ్చినప్పుడు రాయండి. రిలాక్సు కావాలన్నప్పుడు రాయండి. బిజీలో రాయండి. ఖాళీ దొరికితే రాయండి. రాస్తూ ఉండండి.

– జనార్దన మహర్షి

... ఏమున్నది గర్వకారణం?

తన తిండి తాను తిన్నందుకు
కటిక చాకిరీ చేస్తూ
అక్షరం నేర్చుకున్నందుకు
ఊరు చివరెక్కడో
తన బానిస బతుకును పాటగా పాడుకున్నందుకు..

గొడ్లకాడ బుడ్డోళ్ళై మీ ఇండ్ల పాలేళ్ళై ఊడిగం చేసీ
తాను సాకి తాను మేపి
తన గొడ్డుకూర తాను తిన్నందుకు
మతోన్మాదుల మూకుమ్మడి దాడిలో
చచ్చి శవాలౌతున్న వారికోసం ఏం చేసామని గర్విద్దాం?

గోనెసంచుల్లో కుక్కబడిన ఖండిత శవాలకేంన్యాయం చేశాం?
ఆధిపత్య కుల రాబందులు వేటాడే సరదాకై
గుడిసెల్ని చెరపట్టి
ఆడతనాన్నీ అమ్మతనాన్నీ నడివీధిన నడిపించి
కామపు కళ్ళకావరం చల్లార్చుకొంటూ
వికటంగా నవ్వినపుడేంచేశామని సమర్థించుకొందాం?

పశువునేమో మాతను చేసి మనసారా పూజించి,
గుడిసెలోని పసిబిడ్డకు మాతంగని ముద్రవేసి
దేవుడిపేర దోచుకుంటే
తప్పురా అని ముక్కోటి దేవతల్లో ఒక్కడైనా
ముందుకొచ్చి ప్రశ్నించని అత్యాచారాల భూమిలో..
ఆడబిడ్డకేం విలువుందని గర్విద్దాం?

సందుకో దేవాలయం గొందుకో దేవుడూ కొలువైన దేశంలో
వెలివేతల్ని ప్రశ్నించని మూగదేవుళ్ళ రాజ్యంలో
స్తంభం చీల్చుకురాడేంటో ఏ నరసింహావతారుడూ
ఖైర్లాంజీ హత్యాచారాలు ప్రతి నిత్యం చెలరేగుతున్నా..!

కులకాంతలకే చీరలిచ్చే నిక ష్టులే దేవుళ్ళైన
హెచ్చుతగ్గుల భారతంలో
అట్టడుగు వర్గపు మగువ దేహం
రెడ్లైట్ ఏరియాల్లో చిత్రహింసల పాలౌతుంటే..
ఏం సాధించామని గర్విద్దాం?

సామాన్యులు కుక్కలని రోజుకో రీతిన రాళ్ళదెబ్బల పాల్జేస్తున్న
మతఛాందసుల రాజ్యంలో ఫుట్పాత్‌లు రక్తమోడి
గొప్పోళ్ళకు తర్పణమౌతున్న నిచ్చెనమెట్ల సమాజంలో
మూలవాసుల్ని అనాథలు చేసే కుట్రల్లో
మనువాద తలకాయలు తలమునకలౌతున్న
అత్యవసర సమయాల్లో..

కులాంహంకార హత్యల పందేరంలో..
అణచివేత బహురూపపు విన్యాసాల్లో
పసికందులు, నవయువతులు నైవేద్యాలౌతుంటే.
భిన్నత్వంలో ఏకత్వం పేరుతో
పరాయి దేశాల ప్రెసిండెంట్లని నమ్మిద్దాం.

ఇంట్లో ఈగల మోతని కాశ్మీర్ శాలువాతో
అందంగా కప్పేసి, బడుగుల బతుకుల్ని
అధికారపు గొడుగులుగా వాడుకున్న
మతమౌఢ్యపు మంత్రాంగం
పరిపాలన గాలికొదిలి అభివృద్ధికి నీళ్ళొదిలి
మతతత్వపు వీణలు సవరిస్తూ తిరుగుతుంటే..
మనమంతా నిష్టగా కళ్ళుమూసి.. సర్వమత ప్రార్థనలు చేద్దాం!

వైరుధ్యపు వ్యవస్థకు ఊపిర్లూదే పనిలో
చచ్చిన కుల సింహపు కళేబరంలో
సనాతన హిందూధర్మం రంగరించి మళ్ళీ ప్రాణం పోద్దాం
కులహంకార క్రూరమ గం దేశాన్ని కబళించాక
తీరిగ్గా కొవ్వొత్తులు వెలిగిద్దాం

వివక్షల దుర్గంధాన్ని
ధవళ వస్త్రాల చాటున బహు తెలివిగా దాచిపెట్టి
ప్రశాంతంగా మనమంతా ర్యాలీలు నిర్వహిద్దాం.
నిజాయితీ పాళ్ళే లేని మొక్కుబడి ప్రార్థనలేగా..
కపటపు పెదవులతో గడగడా వల్లించేద్దాం!

– అరుణ గోగులమండ
88971 07984

కవిత్వం

నేను ఓ చెలమనై ...

మూతికి ముంత కట్టి
చేతికి సంకెళ్ళు వేసి
తాటాకు బహుమానంగా ఇచ్చిన
దేశంలో...
తరతరాలుగా బతుకుతున్న
దేశ భక్తులం!

మానెత్తుటితో నేలను తడిపి
మాకష్టంతో సేద్యం చేసి
కలవారి కల్లంలో రాసులు పోసి
వారి కళ్ళలో ఆనందాలు నింపిన
జాతి మాది ...

ఓట్ల కోసం అంటరానితనాన్ని
ఆలింగనం చేసుకుని
అంబేద్కర్‌ని అక్కున చేర్చుకుని
కోట్లకు పడగలెత్తే
మను నాగుల పాలనలో...
విలువలకు...వలువులూడదీసి
ఆవుని దైవాన్ని చేసి
మనిషి మనుగడనే ప్రశ్నిస్తున్నాయి!

కులం కాలకూట విషనాగైన వేళ
భూమిని బందీ చేసిన బలిసినోళ్ళు
చూడూరు గుండె కోసి... గొంతు నొక్కారు
దొరతనాన్ని ప్రశ్నించారని
నీరుకొండలో మానాన్ని ఊరేగించారు

మీరు మా మానాన్ని వెలకట్టిన చోట
మేము వివక్షను వెలివేస్తున్నాం
తరాల చరిత్రని తలకెత్తుకుని
జ్ఞాన సముద్రాన్ని ఈది... ఈదీ
చెలమల్లో ఊటల్లా
చైతన్యం పెళ్ళుబికి
గరగపర్రులో గళం విప్పి గర్జిస్తోంది!
తిరుగుబాటు చరిత్రని తిరగరాస్తోంది!

– రెడ్డి శంకరరావు
94943 33511

స్మరణం

జానపదాల జీవనది .. జాలాది

జాలాది ఓ జ్ఞాననిధి. జన పదాల జీవనది. మనసున్న అక్షరం ఆయన కవిత్వం. తన కలం పాళీ నుంచి అమృతాన్నీ, హాలాహలాన్నీ సమపాళ్లలో సృజించగల సరస్వతీ పుత్రుడు కళాప్రపూర్ణ డాక్టర్ జాలాది రాజారావు. క్రైస్తవ నేపథ్యంలో పుట్టి హిందూ ధర్మాలమీద, పురాణాల మీద మంచి పట్టు సాధించి అద్భుతమైన పదబంధాలతో మేటి కవిత్వాన్ని గుప్పించినవాడు. పూర్వాశ్రమంలో నల్లబల్ల వేదికగా పిల్లలకు పాఠాలు చెప్పిన బడిపంతులు. ఆనక వెండితెర వేదికగా సమాజానికి అపురూపమైన జీవిత పాఠాలు చెప్పాడు. ఆయన కవిత్వానికి సామాజికాంశాలే జీవనాడులయ్యాయి. 'పుణ్యభూమి నాదేశం నమో నమామీ..' అంటూ స్వాతంత్ర్యోద్యమ చరిత్రను అక్షర శరాలతో కళ్లముందు సాక్షాత్కరింపజేసినవాడు. ఎందుకంటే ఆయన జీవితాంతం పోరాడినవాడు. కంటినీ చూపునూ వేర్వేరుగా చూడలేం. పోరాటాన్నీ, జాలాది జీవితాన్ని కూడా అంతే. 1932 ఆగస్టు 9న కృష్ణా జిల్లా గుడివాడ సమీపాన దొండపాడులో పుట్టాడు. వావిలాల గోపాల కృష్ణయ్య సహచర స్వాతంత్ర్య సమరయోధుడు జాలాది ఇమ్మానుయేలు, అమృతమ్మ దంపతులకు ఐదో సంతానంగా జన్మించాడు. చిన్నతనంలోనే బాలింతరాలైన తల్లి జబ్బుపడి మరణించడంతో గొల్లభామ' (మిల్క్ మెయిడ్) పాలడబ్బాలే తనకు తల్లిలేని లోటు తీర్చాయి. పాలబుగ్గల వయస్సులోనే స్వాతంత్ర్యోదమంలో చెరసాల పాలైన తండ్రి జాలాది ఇమ్మానుయేలు, వావిలాల గోపాల కృష్ణయ్యలకు రహస్యపత్రాల ద్వారా సమాచారం అందించి బతుకు పోరాటాన్ని రుచి చూశాడు జాలాది. బ్రిటిషర్ల కర్కశత్వానికి మచ్చుతునకల్లాంటి లాఠీదెబ్బలు అనుభవించారు. అందుకే ఆయన పాటల్లోని భావావేశం అగ్నిపర్వతం విస్ఫోటం చెందినట్టుగా ఉంటుంది. ఆనాటి సమాజంలో వేళ్లానుకున్న వర్ణవివక్షలు యవ్వన ప్రాయంలో జాలాదికి వచ్చిన ఉద్యోగాన్ని గద్దలా తన్నుకుపోయాయి. ఆ తర్వాత బతకలేక బడిపంతులు ఉద్యోగం. రేపటి పౌరులకు రేఖాచిత్రాలతో బతులకు పాఠాలు చెప్పే (డ్రాయింగ్ టీచర్) వృత్తిలో సంతృప్తిని వెతుక్కుంటూ ప్రవృత్తిగా నాటక రచన, ప్రదర్శనలతో శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం, రాయవలసలలో జీవితానికి దిశ నిర్దేశాలేర్పరచుకున్నారు. ఆ తరుణంలో అక్షర జ్ఞానం లేక మగ్గిపోతున్న గిరిజన జాతుల జీవితాలను లోతుగా అధ్యయనం చేశారు. వారి భావాలకు రెక్కలు తొడిగే పద సంపదతో ఆత్మఘోషను అర్థం చేసుకునే అక్షర నిక్షిప్తాలు పుంఖానుపుంఖాలుగా వెలువరించారు.

పాలకుల కుటిల రాజకీయ చదరంగంలో పావుగా జీవితంలో ఇమడలేక 1969 బడిపంతులు ఉద్యోగం వదిలేశారు. భార్య ఆగ్నేశమ్మ ఉద్యోగరీత్యా కృష్ణా జిల్లా నందిగామ సమీపాన ఉండే కోనాయపాలేనికి వారి కుటుంబం మకాం మార్చేసింది. ఆ పరిసరాల్లో 25 గ్రామాల్లో భూగర్భ జలాల్లో ఫ్లోరిన్ అధిక మోతాదులో ఉండటం వల్ల తీవ్రమైన తాగునీటి సమస్య. ప్రజలు తరచూ అనారోగ్యాల బారిన పడుతుంటే జాలాది చూస్తూ ఊరుకోలేక తాగునీటి ఉద్యమం చేపట్టారు. కలెక్టర్, శాసనసభ్యులను కలిసి సమస్య వివరించి వారి చొరవతో 150 బోరు బావులు తవ్వించి తాగునీటి కష్టాలు కడతేర్చారు. ఓపక్క ఉద్యమాన్ని నడిపిస్తూనే మరోపక్క రంగస్థల కళలో రాణించే ప్రయత్నం కొనసాగించారు. గుడివాడలో ప్రభాకర్ నాట్యమండలితో కలసి వంటి ఎన్నో నాటికలు రచించారు. శ్మశానం, అమరజీవి, తండ్రి, కారుమేఘాలు వంటి నాటికల ప్రదర్శనలిప్పించి విమర్శకుల ప్రశంసలందుకున్నారు. పీసపాటి నరసింహారావు వంటి ఉద్ధండులతో కలసి పౌరాణిక పద్య నాటకాల్లో దుర్యోధనుడు, అర్జునుడు వంటి ముఖ్య భూమికలు పోషించారు. జారా, జస్రా అనే కలం పేర్లతో ఆయన రచనలు అచ్చయ్యేవి. సినిమా రంగంలో పుష్కలమైన అవకాశాలుంటాయని మిత్రుల ప్రోద్బలంతో 1970లో చెన్నపట్నం బాట పట్టారు. కొన్నాళ్లు 'ఘోస్ట్ రైటర్'గా బతుకు బండి నెట్టుకొచ్చారు. 1974లో నటుడు కైకాల సత్యనారాయణ నిర్మాత పీసీ రెడ్డికి జాలాదిని పరిచయం చేశారు. ఆ సందర్భంలో పీసీ రెడ్డి మాట కలుపుతూ 'మీరు బాగా రాస్తారని విన్నాను. ఏదీ ఒక పాట పాడండీ...' అని అడిగిందే తడవుగా- 'పొగ చూరిన ఆకాశంలో పోకిరోడు మెరిశాడు... ఊరవతలి చేలల్లో ఉరిమురిమి చూశాడు. సూరట్టుకు జారింది సితుక్కు సితుక్కు వాన...' అనే పల్లవి పాడి వినిపించాడు. పీసీ రెడ్డి దానికి తగిన చిత్రీకరణ ప్రణాళిక రచించుకొని జాలాదికి మళ్లీ కబురెట్టారు. 'పల్లెసీమ'లో ఆ పాటను పి.సుశీల చేత పాడించి, జయసుధ మీద చిత్రీకరించారు. తరువాత జాలాదికి సినీ గీత రచయితగా అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. చిరంజీవి 'పునాది రాళ్లు' చిత్రానికి జాలాది రాసిన 'యాతమేసి తోడినా ఏరు ఎండదు, పొగిలి పొగిలి ఏడ్చినా పొంత నిండదు' గీతానికి కైకాల సత్యనారాయణ అభినయం కవి హృదయాన్ని రసస్ఫోరకంగా ఆవిష్కరించింది. ఆ చిత్ర గీతానికి సినీహెరాల్డ్ పురస్కారం జాలాదిని వరించింది. గేయ రచయితగా అదే ఆయన తొలి విజయం. 1979లో దేవుడే గెలిచాడు చిత్రం కోసం 'ఈ కాలం పది కాలాలు బతకాలనీ..' అంటూ కాలాన్ని తన కలంతో దీవించాడు. 1986లో ఇదా ప్రపంచం చిత్రం కోసం 'బండెల్లిపోతాంది సెల్లెలా... బతుకు బండెల్లిపోతాంది సెల్లెలా...', 1991లో ఎర్రమందారం చిత్రంలో 'యాలో యాలో ఉయ్యాల ఏడేడు జన్మాలు మొయ్యాల... కన్ను తెరిస్తే ఉయ్యాల... కన్ను మూస్తే మొయ్యాల..' గీతాలకు నంది పురస్కారాలందుకున్నారు. 1993లో ఎన్టీ రామారావు రాజకీయ జీవిత విరామంలో తీసిన అపురూప చిత్రం 'మేజర్ చంద్రకాంత్'లో 'పుణ్యభూమి నాదేశం నమో నమామీ.. ధన్య భూమి నాదేశం సదా స్మరామీ...' గీతాన్ని తెలుగు జాతి ఎప్పటికీ మర్చిపోలేదు. ఆ పాటకు జాతీయ పురస్కారం చేతికందేంత దూరం వచ్చి రాజకీయ కారణాలతో వెనుదిరిగింది. నంది అవార్డుల కమిటీ సభ్యుడిగా కూడా సేవలందించిన జాలాది 'పుణ్యభూమి' పాటకి జాతీయ అవార్డు రాకపోవడానికి రాజకీయాలే కారణమని పెద్ద దుమారమే రేగింది. ఎన్టీ రామారావు, ఆయన కుమారులు బాలకృష్ణ, హరికృష్ణ, హరికృష్ణ తనయుడు జూనియర్ ఎన్టీయార్... ఇలా ఒకే కుటుంబంలో మూడు తరాలకు (త్రీజీ) సినిమా పాటలందించిన ఘనత జాలాదిది.

దేశభక్తుడైన తన తండ్రి జాలాది జాలాది ఇమ్మానుయేలు త్యాగాలను గుర్తించి స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ఆంధ్ర విశ్వకళాపరిషత్తు పాలకమండలి సభ్యుడిగా నియమించారు. కృష్ణా జిల్లా నుంచి ఎన్నికైన మొట్టమొదటి శాసనమండలి సభ్యుడు (ఎంఎల్‌సీ)గా కూడా ఆయన చరిత్రలో చెరగని ముద్రలేశారు. తండ్రి బాటలోనే జాలాది ఆంధ్ర విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యుడిగా కొంతకాలం సేవలందించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం 75వ స్నాతకోత్సవంలో ఆయన కళాప్రపూర్ణ గౌరవ డాక్టరేటు అందుకున్నారు. జీవిత చరమాంకంలో శ్వాసకోస వ్యాధితో బాధపడుతూ 2011 ఆగస్టు 9న జాలాది తన 79వ జన్మదిన వేడుకలు విశాఖలోని కళాభారతి ఆడిటోరియంలో జరిపించుకున్నారు. అదే ఏడాది అక్టోబర్ 14న తన బతుకు పోరాటాన్ని చాలించి 'పుణ్యభూమి'కి శాశ్వతంగా దూరమైపోయారు. జీవిత సత్యాలను అలవోకగా ఆవిష్కరించడంలో తనకు తానే సాటి. చేతి చిటికెన వేళ్లు కలిస్తే కల్యాణం..., కాలి బొటన వేళ్లు కలిస్తే నిర్యాణం... అంటూ రెండు వాక్యాల్లో జీవితం మొత్తాన్ని నిర్వచించిన మేధావి ఆయన. కుకులమ్మ కవితా సంపుటిలో జాలాది అంతర్మథనం శ్రీశ్రీకి ఎంతగానో నచ్చింది. ఆయన విశ్వమోహిని కావ్యంలోనూ మానవ సంబంధాల పాఠకుల్ని కంటతడి పెట్టిస్తాయి. కానీ, ఆ రెండు పుస్తకాలూ మూడు దశాబ్దాలు ఆలస్యంగా వెలువరించడంతో సాహితీ ప్రపంచంలో జాలాదికి దక్కాల్సిన ఖ్యాతి దక్కలేదు.



- రతన్ రాజు బందిలి
94902 63115

సందర్భం

నెలనెలా సాహిత్య హేల

ప్రతి ఊరిలోనూ కవులూ, రచయితలూ ఉంటారు. కానీ, వారిలోని మౌలికశక్తిని వికసింపజేసి, వారిని మంచి రచయితలుగా రూపొందించగలిగే సమిష్టి ప్రోత్సాహం మాత్రం అన్నిచోట్లా ఉండదు. రచయితలకు సాహిత్య సంబంధమైన నిరంతర అవగాహన అవసరం. అది లోపిస్తే రచయిత ఎదుగుదల ఏదో ఒక స్థాయిలో ఆగిపోతుంది. అలా ఆగిపోకుండా 2013లో ప్రజాకవి డాక్టర్ అద్దేపల్లి రామ్మోహనరావు కాకినాడలో నిరంతర సాహిత్య వాతావరణాన్ని కల్పిస్తూ సాహితీ స్రవంతి శాఖను ఏర్పాటు చేశారు. నెలనెలా సాహిత్యహేల పేరుతో ప్రతి నెలా మొదటి ఆదివారం ఒక సాహిత్య సభను నిర్వహించి తీరాలి. ఆ సభలో ఎవరో ఒకరు ఒక కవిని లేదా కావ్యాన్ని గురించి విశ్లేషణాత్మక ప్రసంగం చేయాలి. అనంతరం ముందుగానే ఇచ్చిన కవితాంశంతో ప్రతి ఒక్కరూ కవితను రాసుకొచ్చి సభలో వినిపించాలి. ఇదీ, నిర్ణయం. ఇది కవులందరికీ నచ్చింది. ముందుగా ఎంపిక చేసిన వస్తువుపై కవిత రాయాలనే ఉత్సాహం కవులందరిలోనూ ఉరకలు వేసింది. కొత్తవారికి ప్రేరణనిచ్చింది. ప్రతినెలా కనీసం 50, 60 మందికి తగ్గకుండా సభ జరగడం ఆనవాయితీగా మారింది.

కొన్ని ప్రత్యేక సందర్భాల్లో నెలకు రెండు మూడు సభలు కూడా జరిగాయి. ఇక్కడ అందరికీ ప్రాతినిథ్యం ఉంది. పదవులు లేవు. సేవ మాత్రమే ఉంది. ఎవరికి ఏ కొత్త ఆలోచన వచ్చినా దానిని అనుసరిస్తూ, అనేక కోణాల్లో సంస్థను విస్తరింపజేస్తూ ... అలా అలా సంవత్సరం గడిచాక వార్షికోత్సవాన్ని నిర్వహించాలన్న ఆలోచన సభ్యులందరిలోనూ చోటు చేసుకుంది. సరే అన్నారు అద్దేపల్లి. అంతే! 18-5-2014న రోజంతా సాహిత్య కార్యక్రమాలతో ప్రథమ వార్షికోత్సవం ఎంతో ఘనంగా జరిగింది. కవులందరూ ఏడాది పొడవునా చదివిన కవితలతో 'కడలి చిరునామా' అనే కవితా సంకలనాన్ని తీసుకురావటం జరిగింది. ఇదే సభలో రామకృష్ణ శ్రీవత్స, గడల శివ ప్రసాద్, డా॥ శిరీష వంటి కవుల కవితా సంకలనాలను కూడా ఆవిష్కరించారు.

రెండో సంవత్సరంలో కార్యక్రమాలు మరింత విస్తృతమయ్యాయి. సంగీత, నాట్య, నాటకాదుల గురించి కూడా అప్పుడప్పుడు ఆయా రంగాల నిష్ణాతులతో ప్రసంగాలు జరపటం మొదలయింది. కవిత్వానికి సంబంధించి ఓ కొత్త కార్యక్రమం మొదలైంది.అది కవి స్వరం. అంటే ఒకే కవి, తన కవితల్ని అరగంటసేపు చదవటం. ఇది కవిత్వంలోని క్రమానుభూతిని తెలియజేస్తుంది. ఈ విషయంలో కూడా సాహితీ స్రవంతి సాఫల్యం సాధించింది. నియోగి, విద్యార్థి, జి.సుబ్బారావు, బొల్లోజు బాబా, మేకా మన్మథరావు, రామకృష్ణ శ్రీవత్స వంటి కవులు తమ కవిస్వరం ద్వారా సభ్యులకు భావోత్తేజాన్ని కలిగించారు.

సామాజిక సమస్యల పరిష్కారమే ఈనాటి సాహిత్య లక్ష్యం. ఆ లక్ష్యంతోనే ఏ పక్షపాత దృష్టీ లేకుండా పద్యం, శతకం, వచన కవిత, దీర్ఘకవిత, కథ, నవల, మినీ కవిత వంటి అన్ని సాహిత్య రూపాల్ని ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతూ సాహితీ స్రవంతి. ఎందరో కవులు, రచయితలు సాహితీ స్రవంతి వేదికపై తమ గ్రంథాల్ని ఆవిష్కరించుకోవటానికి ఇష్టపడుతూ వచ్చారు. అలాగే ఎవరైనా ఒక విషయం మీద ప్రసంగిస్తామంటే వారికి కూడా వేదిక కల్పించబడుతోంది. ఈ విధంగా సాహితీ స్రవంతి వర్ధమాన కవులకు, ఇప్పుడిప్పుడే వర్ధిల్లుతున్న కవులకూ ఒక వేదిక అయింది.

ఇలా కాకినాడలో జరిగే ప్రతి సభకీ నేను హాజరు కావటం, అప్పుడప్పుడు ఆయన సూచించిన అంశాలపై ప్రసంగించటం గమనించిన అద్దేపల్లి పెద్దాపురంలో కూడా సాహితీ స్రవంతి శాఖను ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ఆ మేరకు చల్లా విశ్వనాథం, నేను, శివ, క్రాంతి, ప్రజానాట్యమండలి సభ్యులు అందరం కలిసి పెద్దాపురం శాఖను ఏర్పాటు చేశాం. శ్రీశ్రీ, గురజాడ, జాషువా, గరికపాటి రాజారావు, యాసలపు సూర్యారావు వంటి ప్రసిద్ధ కవుల, వ్యక్తుల జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తూ వచ్చాం, ఇక్కడి గ్రంథాలయాధికారి సలాది సాయి సత్యనారాయణగారితో కలిసి- తెలుగు భాషా దినోత్సవం, సినారె సభ, ఉగాది కవి సమ్మేళనం వంటి కార్యక్రమాల్ని నిర్వహించాం. ఇప్పటికీ పెద్దాపురం, కాకినాడ శాఖలు రెండూ కలిసే సభల్ని జరుపుతున్నాయి.

భావ ప్రకటనా స్వేచ్ఛను సారిస్తూ నరేంద్ర దభల్కోర్ ఎంఎం కల్బుర్గి వంటి రచయితలపై కొందరు పిరికిపందలు దాడిచేసి చంపిన హేయమైన చర్యను నిరసిస్తూ పెద్దాపురంలో కొవ్వొత్తులతో మౌనప్రదర్శనను సాహితీ స్రవంతి నిర్వహించింది. 2015 మార్చి 29న కాకినాడ గాంధీభవన్‌లో సాహితి స్రవంతి ఆధ్వర్యంలో 'జనకవనం' పేరుతో ఉభయ గోదావరి జిల్లా కవుల అపూర్వ కవి సమ్మేళనం జరిగింది. 2015 ఆగస్టు 9న సాహితీ స్రవంతి ద్వితీయ వార్షికోత్సవం అద్దేపల్లి ఆధ్వర్యంలో ఎంతో హుందాగా జరిగింది. ఎమ్ఎల్సి రాము సూర్యారావు, తెలకపల్లి రవి, సత్యాజీ, ద్వానాశాస్త్రి, రామసూరి, వాడ్రేవు వరలక్ష్మీదేవి ప్రధాన వక్తలుగా ఆ కార్యక్రమం సాగింది. సాహితీ స్రవంతి ద్వితీయ వార్షికోత్సవ సంచిక 'ఆశాద్వీపం'తోపాటు ఇతర కవుల గ్రంథాలావిష్కరణ జరిగింది.

ఇలా రెండేళ్లుఅద్దేపల్లి సారథ్యంలో నిత్యచైతన్య స్రవంతిగా సాగిన సాహితీ స్రవంతి 13-1-16న అద్దేపల్లి నిష్క్రమణతో మూగవోయింది! కవులూ, రచయితలూ బెంగటిల్లిపోయారు. సాహితీ స్రవంతి ఇంక ఆగిపోతుందా అని భయపడ్డారు. కానీ, అద్దేపల్లికి ఎంతో ఆత్మీయుడిగా దగ్గరైన గనారా అద్దేపల్లి స్ఫూర్తితో దాన్ని ముందుకు నడిపించారు. నెలనెలా కార్యక్రమాలు మళ్ళీ మెల్లగా గాడిలో పడ్డాయి. సిపిఎం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నవలా రచన పోటీల్లో ద్వితీయ బహుమతి పొందిన గనారా నవల 'కడలి కల్లోలం' ఆవిష్కరణ సభ 12-6-2016న కాకినాడలో తెలకపల్లి రవి ఆధ్వర్యంలో ఎంతో విశ్లేషణాత్మకంగా సాగింది. డా॥ వాడ్రేవు వీరలక్ష్మీదేవి, వొరప్రసాద్ నవలను విశ్లేషించారు. మూడో వార్షికోత్సవాన్ని బాధాతప్త హృదయంతో అద్దేపల్లి లేకుండానే జరుపుకోవాల్సి వచ్చింది. చీకటి దివాకర్, శిఖామణి, కొప్పర్తి, గిడ్డి సుబ్బారావు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. ఈ సభలో సాహితీస్రవంతి మూడో వార్షికోత్సవ సంచిక 'గోదావరి ప్రతిబింబం'తో పాటు, అద్దేపల్లి రచించిన 'లోపలి నిశ్శబ్దాలు' అనే కవితా సంకలనాన్ని, ఇతర కవుల గ్రంథాల్ని ఆవిష్కరించటం జరిగింది.

ప్రస్తుతం కాకినాడ సాహితీ స్రవంతికి డాక్టర్ వుయ్యపు హనుమంతరావు గౌరవాధ్యక్షునిగా, గనారా కార్యదర్శిగా, పద్మజవాణి కోశాధికారిగా మార్ని జానకిరావు చౌదరి, బొల్లో జుబాబా, మేడిశెట్టి శ్రీరాములు, పాలపర్తి ధనరాజ్, రామకృష్ణ శ్రీవత్సవంటి సాహితీవేత్తలు సభ్యులుగా వ్యవహరిస్తూ ... ముందుకు నడిపిస్తున్నారు. కాకినాడ సాహితీ స్రవంతి ఈరోజు (6-8-2017) ఆదివారం) కాకినాడ పిఆర్ ప్రభుత్వ కళాశాలలో నాలుగో వార్షికోత్సవాన్ని జరుపుకొంటోంది. చేయి చేయి కలిపితే చేయలేనిదేముంది అన్నట్లుగా కాకినాడ కవులందరి ప్రోత్సాహంతో ఈ సాహితీ స్రవంతి సంఘటితశక్తితో, చైతన్య నిరతితో అప్రతిహతంగా ముందుకు సాగిపోతోంది.



సాహితీ స్రవంతి ద్వితీయ వార్షికోత్సవ సభలో రాము సూర్యారావు, అద్దేపల్లి, తెలకపల్లి రవి, వొరప్రసాద్, గనారా (ఫైల్‌ఫొటో)

– డాక్టర్ జోశ్యుల కృష్ణబాబు
98664 54340

గరగపర్రు - వెలిపై 13న నిరసన కవిత్వం

గరగపర్రు – వెలిపై నిరసన కవిత్వ సభను ఆగస్టు 13 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం – అంబేద్కర్ భవనంలో నిర్వహిస్తున్నాం. ఈ సభలో పాల్గొని చదివే కవితలన్నీ సంకలనంగా ప్రచురిస్తాం. కవిత్వ సభ సంచాలకులుగా నేలపూరి రత్నాజీ, వీధి మురళీకుమార్, కోలాటి పెద్దిరాజు, రాపాక సన్ని విజయకృష్ణ వ్యవహరిస్తారు. మరిన్ని వివరాలకు 9848187416 నంబరులో సంప్రదించవచ్చు.

– బహుజన రచయితల వేదిక

'సోమేపల్లి' చిన్న కథల పోటీ

సోమేపల్లి వారి కుటుంబం అ ఏడాది కూడా జాతీయ స్థాయిలో తెలుగు చిన్న కథల పోటీలు నిర్వహిస్తోంది. గెలుపొందిన తొలి మూడు కథలకు వరుసగా రూ.2500, రూ.1500, రూ.1000 బహుమతులు ఉంటాయి. మరో రెండు కథలకు రూ.500 చొప్పున ప్రత్యేక బహుమతులు ఇస్తారు. ఈ పురస్కారం కోసం పంపే కథల నిడివి రాతలో రెండు నుంచి ఐదు పేజీల లోపు ఉండాలి. డిటిపి అయితే 2 పేజీల్లో ఉండాలి. ఒకరు ఎన్ని కథలనైనా పంపవచ్చు. కథ పుటలపై రచయిత పేరు, వివరాలు ఉండకూడదు. హామీపత్రంపై మాత్రమే రచయిత వివరాలు పేర్కొనాలి. సెప్టెంబర్ 30వ తేదీలోపు రమ్యభారతి, పిబి నెం.5, 11-57/1-32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ-520001. (సెల్: 9247475975) చిరునామాకు కథలు పంపాలి.

- చలపాక ప్రకాష్
ఎడిటర్, రమ్యభారతి

ప్రతిలిపి హర్రర్ కథల పోటీ

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రతిలిపి హర్రర్ కథల పటీ నిర్వహిస్తోంది. జీవితంలో మీరు భయపడిన సందర్భాన్నే కథగా మలచి పంపండి. లేదా హర్రర్ కథలు రాసి పంపండి. ప్రతి ఒక్క రచయిత రెండు కథలు పంపవచ్చు. కథలు పంపవల్సిన ఆఖరి తేది ఆగస్టు 25. కథకి సంబంధిన ఫోటో కూడా మీరే పంపాలి. మీ కథలు తెలుగులో టైపు చేసి యూనికోడ్ ఫార్మాట్‌లో telugu@pratilipi.com కి మెయిల్ చేయాలి. మెయిల్ సబ్జెక్టులో 'తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రతి లిపి వారి హర్రర్ కథల పోటీకి ..' అని రాయాలి. మీ సందేహాలకు 7259511956కి సంప్రదించండి.

- జాని తక్కెడశిల, ప్రతిలిపి (తెలుగు విభాగం)
వాట్స్ అప్ : 9491977190, మొబైల్ : 7259511956

విశాఖ కథాసాహిత్యంపై 8న సదస్సు

సాహిత్య అకాడమీ, విశాఖ సాహితీ సంయుక్తాధ్వర్యాన ఈనెల 8వ తేదీన ఎయు హిందీ విభాగం సెమినార్ హాల్లో విశాఖ జిల్లా కథా సాహిత్యంపై ఒక రోజు సదస్సు జరుగుతుంది. ప్రముఖ కచయిత చింతకింది శ్రీనివాసరావు కీలకోపన్యాసం చేస్తారు. సాహితీ ప్రముఖులు ఎన్ గోపి, గొల్లపపూడి మారుతీరావు, కోలవెన్ను మలయవాసిని, డివి సూర్యారావు, ఆదూరి సీతారామమూర్తి, వెలమల సిమ్మన్న తదితరులు పాల్గొంటారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకూ ఈ సదస్సు జరుగుతుంది.

జీవన the family



నిన్ను నిన్నుగా ప్రేమించుటకు
నీ కోసమే కన్నీరు నింపుటకు
నేనున్నానని నిండుగ పలికే
తోడొకరుండిన అదే భాగ్యమూ.....


స్నేహాన్ని ఇంతకంటే గొప్పగా ఎలా నిర్వచించగలం? ఒక గాఢాంధకారం అలుముకున్నప్పుడు, నిరాశా నిస్పృహలు చుట్టుముట్టినపుడు.. 'నీ కోసం నేనున్నాను సుమా..!' అంటూ భుజం తట్టే ఆత్మీయమైన స్పర్శ స్నేహం. ఆనందాన్ని రెట్టింపు చేస్తూ.. విషాదాన్ని సగానికి సగం తగ్గిస్తుంది స్నేహం. స్నేహం అంటే భాషకందని కమ్మటి భావన. చుట్టూ అల్లుకున్న మానవ సంబంధాల పొదరింట్లో విరిసిన అందమైన గులాబీ. జీవితంలో మరిచిపోలేని ఒక మధుర జ్ఞాపకం. ఎప్పుడో చిన్నప్పుడు... బుడి బుడి అడుగుల బాల్యంలోనే అల్లుకునే స్నేహ బంధాలు కొన్నయితే... పరవళ్లు తొక్కే యవ్వనంలో పెనవేసుకునే అనుబంధాలు మరికొన్ని. ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఏ కాలేజీలోనో.. లైబ్రరీలోనో.. కలిసి నడిచే కారిడార్‌లోనో.. తరగతి గదిలోని ఒకే బెంచిపై.. మాస్టారు బోధించే పాఠాల్లో సందేహాల్లోనో.. ఊపిరి పోసుకొనేదే స్నేహం. మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలుగా మారిపోయి.. మనిషన్నవాడు మాయమైపోతున్న తరుణం ఇది. ఇలాంటి సమాజంలోనూ ఎక్కడో ఒకచోట ఆత్మీయమైన స్నేహాలు.. ఉన్నతమైన మానవతా విలువలు.. వెలుగురేఖల్లా దారి చూపుతూనే ఉంటాయి. జీవితకాలం పాటు మనతో నడుస్తూ.. ప్రయాణిస్తూ.. వెన్నంటి ఉండేది స్నేహం. అలాంటి మీ స్నేహితులందరికీ 'హ్యాపీ ఫ్రెండ్‌షిప్ డే!' ... మీలాగే ఇక్కడ కొందరు సెలబ్రెటీల మధ్య స్నేహం ఎలా విరబూసిందో తెలుసుకుందాం పదండి.

స్నేహమేరా జీవితం శాశ్వతం

ఈ పెద్దోళ్లదో సరదా స్నేహం



కోట శ్రీనివాసరావు, బాబూమోహన్ తెలుగు సినిమా ఇండస్ట్రీలో మోస్ట్ సీనియర్ ఆర్టిస్టులు. ఎంతోమంది అభిమానుల హృదయాలను కొల్లగొట్టిన కమెడియన్లు. 'మామగారు' చిత్రంతో ప్రారంభమైన వీరి కాంబోప్యాక్ ఎన్నో ఏళ్ల పాటూ, సినిమాల పాటూ నవ్విస్తూనే ఉంది. అయితే వీళ్లిద్దరి గురించి మాట్లాడినప్పుడు వీరి స్నేహం గురించి కూడా మాట్లాడాల్సిందే. అంతలా కలిసిపోయాయి వారి మనసులు. షూటింగ్ స్పాట్‌లో కోట, బాబూలు ఉన్నారంటే అదొక పిక్నిక్ స్పాట్‌లా ఉంటుంది. ఈ మాట అప్పటి సినీజనాలు తమ జ్ఞాపకాల్లో నెమరేసుకునే విషయం. ఈ ఇద్దరూ కావాలనే ఫిల్మ్‌నగర్‌లో పక్కపక్కనే ఇళ్లు కట్టించుకున్నారు. వేరువేరు షూటింగుల్లో బిజీగా ఉన్నా.. రోజుకు ఒక్కసారైనా కలిసి మాట్లాడుకునేవారు. ఆ తర్వాత రాజకీయ కారణాల వల్ల బాబూమోహన్ మాదాపూర్‌కు షిఫ్ట్ అయ్యారు. అయినా వీరిద్దరూ తరచుగా కలుస్తూనే ఉంటారు. "అసలు మేమిద్దరమూ కలిసామంటే మామూలుగా ఉండదు.. సెట్‌లో అంతా నవ్వుల జల్లులే.. ఒక పండుగ వాతావరణం వచ్చేస్తుంది!" అంటూ బాబూమోహన్ ఎప్పుడూ చెప్తుంటారు.



ఇప్పటికీ అద్దె కడుతున్నారట!

సునీల్, త్రివిక్రమ్ ... ఈ రెండు పేర్లూ తెలుగు వారందరికీ సుపరిచితాలే. ఒకరు పెన్‌కు పదును పెట్టి పంచ్ డైలాగుల ప్రవాహంతో దూసుకుపోయేవారు. మరొకరు పర్ఫెక్ట్ టైమింగ్‌తో కమెడియన్‌గా ఎంట్రీ ఇచ్చి, హీరోగా ఎదిగిపోయిన వారు. అయితే ఇప్పటికీ వీరి స్నేహాన్ని చూసిన ఎవరికైనా సరే ముచ్చటేయాల్సిందే. ఈ ఇద్దరూ ఒకేసారి భీమవరం నుంచి ఇండస్ట్రీ ఎంట్రీ కోసం హైదరాబాద్ వచ్చారు. పంజాగుట్టలోని సాయిబాబా గుడి దగ్గర రూములో కలిసుండేవారు. అక్కడి నుంచే సినిమా ప్రయత్నాలు చేశారు. తిరిగి సాయంత్రం రూముకు చేరుకున్న తర్వాత త్రివిక్రమ్ అక్కడే ట్యూషన్లు కూడా చెప్పేవాడు. ఇద్దరూ ఎన్నో కష్టాలు పడ్డారు, మరెన్నో రోజులు పస్తులూ ఉన్నారు. చివరకి ఇద్దరూ తమతమ స్థానాల్లో నిలదొక్కుకున్నారు. అయితే ఆ రోజు నుంచీ, ఈ రోజు వరకూ వాళ్ల స్నేహం అలానే నిత్యనూతనంగా ఉంది. రోజురోజుకూ బలపడుతూనే ఉంది. ఇంకో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... వీళ్లిద్దరూ ఇప్పటికీ ఆ పంజాగుట్టలోని రూముకు అద్దె కడుతూనే ఉన్నారట.! "ఆ గదిని సెంటిమెంట్‌గా భావించి.. ఆ రూము ఓనర్‌కు రూము రెంట్ ఇస్తూ ఉంటాం!" అని ఓ సందర్భంలో సునీల్ చెప్పారు.



అల్లరే అల్లరి





నాని, మనోజ్, అల్లరి నరేష్... ఈ ముగ్గురూ కలిస్తే ఇక అల్లరే అల్లరి. సాధారణంగా ఇండస్ట్రీలో ఒకొరికొకరికి మధ్య చాలా విభేదాలుంటాయని అంటూంటారు. కానీ ఈ కుర్రోళ్లు మాత్రం అలాంటివాటికి చెక్ పెడుతూ.. స్నేహంగా కలిసిపోతారు. ఏ కొత్త హీరో సినిమా రిలీజ్ అయినా వెన్నంటి ఉండి భుజం తడతారు. నాన్నల బ్యాక్‌గ్రౌండ్‌లను వీళ్ల స్నేహాల మధ్యకు అస్సలు తీసుకురారు. వీరిలో ఎవరి సినిమా రిలీజ్ అయినా.. ఆడియో ఫంక్షన్ వేడుక అయినా.. మిగతా ఇద్దరూ తమ సొంత సినిమా వేడుకలానే భావిస్తారు. ఏదేమైనా కొత్తతరం హీరోలకు వీళ్ల స్నేహాన్ని ఆదర్శంగా తీసుకోవాలి.



స్నేహానికి వయసుతో నిమిత్తం లేదు. ఆటపాటలాడే బాల్యం నుంచి వృద్ధాప్యం వరకూ అందరిలోనూ స్నేహ భావం ఉంటుంది. స్నేహానుభూతిని అనుభవిస్తేనే తెలుస్తుంది. ఒక్కోసారి కుటుంబసభ్యులతో కూడా చెప్పుకోలేని సమస్యలను స్నేహితులతో నిర్మొహమాటంగా చర్చిస్తాం. స్నేహం ఉన్నచోట అనుమానం, కోపం, ద్వేషం దరిదాపులకు రావడానికి జంకుతాయి. స్నేహం అద్భుతమైంది. స్నేహానికి ఎల్లలు లేవు. నిజమైన మిత్రులకు మించిన ఆస్తి లేదు. మంచి స్నేహం వ్యక్తి వికాసానికి బాటలు వేస్తుంది. మిత్రుడు తోడుంటే ఆయుధం ధరించినంత ధైర్యంగా ఉంటుంది. ప్రతి వ్యక్తి జీవితంలోనూ విలువైన స్నేహాన్ని జీవితాంతం నిలుపుకునే ప్రయత్నం చేయాలి. 'స్నేహానికన్న మిన్నా లోకాన లేదురా...!' అన్నట్లు ఆ విలువైన బంధాన్ని అపురూపంగా కాపాడుకోవాలి.

అందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు..!

ఐ లవ్ యూ ఫ్రెండ్!



స్నేహం అనేది ఒక మహావృక్షంలా ఎదుగుతుంది.. జీవితంతో మమేకమవుతుంది.. ఒక విడదీయరాని అనుబంధమైపోతుంది. మదిలో నిక్షిప్తమైన భావాలను.. అనుభవాలను.. అనుభూతులను పంచుకోవడం తప్ప.. ఏ స్వార్థం లేని జీవన బంధం స్నేహం. జీవితంలో ఎవరున్నా, లేకున్నా మంచి నేస్తం ఒకరు తోడుంటే చాలనుకుంటాం. అలాంటి వారిలో మనకు బాగా గుర్తున్నవారు సచిన్ కాంబ్లీ.

సచిన్... మొత్తం జీవితాన్ని క్రికెట్‌కు ఇచ్చేసిన అంకితభావం అతనది. సచిన్ అనగానే క్రికెట్ గుర్తొచ్చేంత ప్రయాణం చేశాడు. అలానే ఆ పేరు వినపడగానే అతని కుటుంబసభ్యులతో పాటు అతని అపూర్వ స్నేహితుడు వినోద్ కాంబ్లీ కూడా గుర్తొస్తాడు. అది 1988 సంవత్సరం సచిన్-కాంబ్లీలు ఇద్దరూ శారదాశ్రమం పాఠశాల తరపున క్రికెట్ ఆడుతున్న రోజులు. ఒక్కసారిగా యావత్ భారత క్రికెట్ చిన్నారి కాంబ్లీ, సచిన్‌ల వైపు చూసిన రోజు. ఈ ఇద్దరి జోడీ ఏకంగా 664 పరుగులు చేసి 'ప్రపంచ రికార్డ్' నెలకొల్పారు. ఇది వీరి జీవితాల్లో అపురూపమైన ఘట్టం. ఇదే వీరిద్దరూ ఇప్పటికీ చెప్పుకుంటారు. అలా స్కూల్ రోజుల నుంచే వీళ్ల స్నేహం కొనసాగుతూనే ఉంది. సచిన్‌లానే టాలెంటడ్ ప్లేయర్ అయినప్పటికీ, వ్యక్తిగత కారణాల వల్ల కాంబ్లీ కెరీర్ నుంచి త్వరగా తప్పుకోవాల్సి వచ్చింది. అయినా వాళ్ల స్నేహం ఇప్పటికీ స్వచ్ఛంగా కొనసాగుతూనే ఉంది. మధ్యమధ్యలో కొన్ని పొరపొచ్చాలు వచ్చినా.. వారిద్దరి అపూర్వస్నేహం మాత్రం చెక్కు చెదరలేదు. ఈ మధ్యనే సచిన్ జీవితచరిత్ర ఆధారంగా తెరకెక్కిన 'సచిన్... ఏ బిలియన్ డ్రీమ్స్' చిత్రం విడుదలైన సందర్భంగా 'డియర్ మాస్టర్ బ్లాస్టర్... ఐ లవ్ యూ!' అంటూ సోషల్ మీడియాలో కాంబ్లీ తన ప్రేమను కురిపించాడు.



- జీవన డెస్క్

జీవన సౌరభం

సహనం పాటించే వాళ్లే జీవితంలో అనుకున్నది సాధించగలరు.

మీ కోసం

బెండకాయలు తాజాగా ఉండాలంటే రెండువైపులా తొడిమెలు తీసేసి ప్లాస్టిక్ కవర్‌లో వేసి ఫ్రిజ్‌లో ఉంచాలి.



జీవన చిత్రం



వానాకాలం జాగ్రత్త!

వానాకాలం వచ్చిందంటే అదొక ప్రత్యేకమైన ఆనందం. వర్షాన్ని అందరూ ప్రేమించే వాళ్లే మరి. అయితే ఈ సీజన్‌లోనే వర్షాలతో పాటు అంటువ్యాధులూ వస్తాయి. కానీ కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే అంతగా భయ పడాల్సిన పనేమీ ఉండదు. మామూలు టీలనూ, కాఫీలనూ బాగా తగ్గించి వాటి స్థానంలో లెమన్, గ్రీన్, హెర్బల్ టీలను చేర్చడం మంచిది. మంచినీళ్ల విషయంలో ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలి. బయట ఎక్కడపడితే అక్కడ నీటిని తాగకుండా ఇంటినుండే బాటిల్ తీసుకెళ్లాలి. ఇంటిలో ఉపయోగించే నీటిని కూడా తప్పనిసరిగా కాచి వడపోయాలి. వర్షాలు ఎక్కువగా ఉండటంతో నేలకు ఆనుకుని పెరిగే ఆకుకూరల్లో ఎక్కువగా క్రిములు చేరతాయి. వాటిని వండే ముందు ఉప్పుతో శుభ్రం చేయడం తప్పనిసరి. చెత్త ఎక్కువగా పేర్చకుండా ఏరోజు చెత్తను ఆరోజే శుభ్రం చేసుకోవాలి. లేదంటే దోమలూ, ఈగలూ పెరగడం వల్ల అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కొద్దిపాటి అనారోగ్యం అనిపించినా, జ్వరం వచ్చిన లక్షణాలు కనిపించినా సొంత వైద్యం పక్కన పెట్టి, నేరుగా డాక్టర్‌ను కలవండి. ఈ సీజన్‌లోనే ఎక్కువగా విషజ్వరాలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఏ చిన్న అనుమానం వచ్చినా ముందు డాక్టర్‌నే సంప్రదించండి. పిల్లల విషయంలో మరింత జాగ్రత్త తీసుకోవాలి. ఒకవేళ వర్షంతో తడిచి కనుక ఇంటికి వస్తే వెంటనే తలస్నానం చేయించండి. బయటకు వెళ్లేప్పుడు తప్పనిసరిగా రెయిన్‌కోట్ లేదా గొడుగును దగ్గర ఉంచుకోండి.





నైపుణ్యం పెంచుకుంటేనే ఉద్యోగం

డెల్ సిఇఒ బస్క్ అయ్యర్

ఐటి ఉద్యోగులు ఎప్పడికప్పుడూ టెక్నలాజీలో పున:నైపుణ్యం పొందితే తప్పా ఉద్యోగాలు కాపాడుకోలేరు. వారికి వారిగా రీస్కిల్ అవుతూ ఉండాలి. లేనిపక్షంలో ఐటీ ఉద్యోగాన్ని వదిలి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలి. రాబోతున్న నైపుణ్యాలను నేర్చుకోవాల్సిన బాధ్యత ఉద్యోగుల్లోనే ఉంది. అది ఆర్గనైజేషన్‌కు సంబంధించింది కాదు. ఏ కంపెనీ కూడా పున:నైపుణ్యం అందించదు. కొత్త టెక్నాలజీలను ఉద్యోగులు వాడుతూ, వాటిని తెలుసుకుంటూ ఉండాలి.

సిండికేట్ బ్యాంకు నష్టం రూ.263 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ సిండికేట్ బ్యాంక్ జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.263.19 కోట్ల నికర నష్టాన్ని వెల్లడించింది. మొండి బాకీలకు కేటాయింపులు పెరిగిన కారణంగా బ్యాంకు ఏప్రిల్–జూన్ మధ్య కాలంలో నష్టాల్ని నమోదు చేసింది. అంతకు ముందు ఏడాది ఇదే త్రైమాసిక కాలంలో బ్యాంకు రూ.79.13 కోట్ల మేర లాభాన్ని ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల కాలంలో (జూన్ త్రైమాసికంలో) బ్యాంకు మొత్తం ఆదాయం కూడా రూ.6,419.12 కోట్ల నుంచి రూ.6,171.49 కోట్లకు జారింది. ఇదే కాలంలో బ్యాంకు మొండి బాకీల నిమిత్తం బ్యాంకు కేటాయింపులు 79 శాతం మేర పెరిగి రూ.774.41 కోట్ల నుంచి రూ.1,385.66 కోట్లకు చేరాయి. కార్పొరేట్, హోల్‌సేల్ బ్యాంకింగ్ కార్యకలాపాల ద్వారా బ్యాంకు ఆదాయం రూ.2,562.28 కోట్ల నుంచి రూ.2,088.98 కోట్లకు తగ్గింది. రిటైల్ బ్యాంక్ కార్యకలాపాల ద్వారా బ్యాంకుకు లభించిన ఆదాయం మాత్రం స్వల్పంగా పెరిగి రూ.1,973.66 కోట్ల నుంచి రూ.1,984.67 కోట్లకు చేరింది. జూన్ త్రైమాసికానికి బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తుల విలువ మొత్తం రుణ వితరణలో 7.53 శాతం నుంచి 9.96 శాతానికి చేరాయి. నికర నిరర్థక ఆస్తుల విలువ కూడా 5.04 శాతం నుంచి 6.27 శాతానికి చేరాయి.



పడిపోతున్న ఆశలు..

- ఎఫ్‌డి వడ్డీ రేట్లలో మరింత కోత..!
- ఆర్‌బిఐ రెపో రేటు తగ్గింపు ప్రభావం



ప్రజాశక్తి – బిజినెస్ డెస్క్

ఫిక్సుడ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు మరింత తగ్గే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) బుధవారం రెపో రేటును పావు శాతం తగ్గించింది. దీంతో ఆర్‌బిఐ బ్యాంకులకు ఇచ్చే అప్పులపై వడ్డీ రేటును తగ్గిస్తుంది. ఇదే సమయంలో బ్యాంకులు డిపాజిట్‌దారుల పొదుపు, పిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డి)పై ఇచ్చే వడ్డీ రేటుకు కోత పెట్టనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎఫ్‌డిలపై వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నాయని ఖాతాదారులు ఆందోళనలో ఉన్నారు. కాగా వడ్డీ రేట్లు క్రమంగా ఇంకా తగ్గుతాయని గురువారం స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీనే పార్లమెంట్ సాక్షిగా పేర్కొన్నారు. ప్రస్తుతం ఏడాది కాలపరిమితి కలిగిన ఫిక్సుడ్ డిపాజిట్లపై సగటున వడ్డీ రేటు 6.75 శాతంగా ఉంది. సీనియర్ సిటిజన్స్ ఎఫ్‌డిలపై అదనంగా 0.5 శాతం చెల్లిస్తూ సగటున 7.25 శాతం అందిస్తున్నాయి. దీర్ఘకాలం ఎఫ్‌డిలపై కూడా పెద్ద ఆకర్షణీయ వడ్డీ రేటు ఏమీ అందడం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ వడ్డీ రేట్లు వరుసగా తగ్గుతూ వస్తోన్నాయి. ఈ పరిణామం రుణదాతలకు లబ్ధి చేకూర్చినప్పటికీ, డిపాజిట్ ఖాతాదారులకు మాత్రం ఇబ్బందికరమే. ముఖ్యంగా పదవీ విరమణ పొందిన వారు తమ పెట్టుబడులను ఎఫ్‌డిల రూపంలో ఉంచుకున్న వారికి తక్కువ వడ్డీ రేట్ల వల్ల వారి గృహ అవసరాలను తీర్చుకోవడం కష్టతరంగా మారింది.

మరోవైపు అధిక ఆదాయం కలిగిన వారు బ్యాంకు ఎఫ్‌డిలపై వచ్చే రిటర్న్స్‌పై పన్ను చెల్లించాల్సిందే. పన్ను చెల్లించిన తర్వాత 7.25 శాతం వడ్డీ రేటులో మిగిలేది 5 శాతంగా ఉండొచ్చని అంచనా. ఈ వర్గానికి ద్రవ్యోల్బణం పెరుగుదలతో పోల్చితే వాస్తవ రిటర్న్స్ దాదాపుగా శూన్యమే. దీంతో వారి సాధారణ ఆదాయంలో పెద్ద పెరుగుదల ఏమి ఉండదు. ఖచ్చితమైన ఆదాయం కలిగిన వారు ఎఫ్‌డిలకు ప్రత్యామ్నాయంగా కొంత రిస్క్ ఉన్నప్పటికీ మ్యూచువల్ ఫండ్స్‌పై పెట్టుబడులు పెట్టొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.. కాని దీనిపై చాలా మందికి అవగాహన లేదు.

మరోవైపు ఇప్పటికే సేవింగ్ బ్యాంకు ఖాతాల్లోని మొత్తాలపై దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) వడ్డీ రేటును 3.5 శాతానికి కోత పెట్టింది. ఇంతక్రితం ఈ రేటు 4శాతంగా ఉంది. ఎస్‌బిఐ బాటలో మరిన్ని బ్యాంకులు నడిచే అవకాశం లేకపోలేదు. అదే జరిగితే సేవింగ్ ఖాతాలపై ఇస్తున్న వడ్డీ రేటు మరింత తగ్గనుంది. ఫిక్సుడ్ డిపాజిట్ దారులు, సేవింగ్ ఖాతాదారులు ఆకర్షణీయ వడ్డీ రేటు కోసం రిస్కు కలిగిన చిట్‌ఫండ్, ఇతర స్థానిక వడ్డీల కోసం ఆసక్తి చూపే అవకాశం లేకపోలేదు. వడ్డీ రేట్లు క్రమంగా తగ్గుతాయని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఏకంగా పార్లమెంట్‌లోనే స్పష్టం చేశారు. అధిక వడ్డీ రేట్ల నేపథ్యంలో పరిశ్రమ కూడా పెట్టుబడులు పెట్టలేకపోతోందని అన్నారు. అంటే ఫిక్సుడ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గిస్తే తప్పా రుణాలపై తగ్గించలేమని పరోక్షంగా పేర్కొన్నారు. రూ.కోటిలోపు పొదుపు ఖాతాలపై వడ్డీ రేటును 4 శాతం నుంచి 3.5 శాతానికి చేస్తూ ఎస్‌బిఐ తీసుకున్న నిర్ణయాన్ని మంత్రి సమర్థించారు. రుణ రేట్లలో తగ్గింపు నేపథ్యంలో ఎస్‌బిఐ ఆ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

బ్యాంకు ఏడాదికాల ఎఫ్‌డిలపై వడ్డీ రేటు

బ్యాంకు	వడ్డీ రేటు	సీనియర్ల..
యాక్సిస్ బ్యాంకు	6.75	7.25
బంధన్ బ్యాంకు	7.25	7.75
బ్యాంకు ఆఫ్ ఇండియా	6.7	7.2
కెనరా బ్యాంకు	6.75	7.25
డిసిబి బ్యాంకు	6.95	7.45
హెచ్‌డిఎఫ్‌సి	6.8	7.3
ఐసిఐసిఐ బ్యాంకు	6.75	7.25
కొటాక్ బ్యాంకు	6.75	7.25
పోస్టు ఆఫీసు	6.8	6.8
ఎస్‌బిఐ	6.75	7.25
యస్ బ్యాంకు	7.1	7.6

ఆధారం : ఆయా బ్యాంకుల వెబ్‌సైట్లు

సేవ పేరుతో శ్రమ దోపిడి

- రాందేవ్ బిజినెస్ ఎత్తుగడ
- పతాంజలి మాజీ సిఇఒ వెల్లడి

న్యూఢిల్లీ : యోగా గురు, కార్పొరేట్ స్థాయి వ్యాపారాలు కలిగిన రాందేవ్ బాబా సేవ పేరుతో ఉద్యోగుల శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని పతాంజలి మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) ఎన్‌కె పాత్ర తీవ్ర విమర్శలు చేశారు. ఎఫ్‌ఎంసిజి రంగంలో రూ. 10,561 కోట్ల పైగా రెవెన్యూతో భారీ లాభాలను ఆర్జిస్తున్న రాందేవ్ ఉద్యోగులకు మాత్రం వేతనాలు చెల్లించడం లేదని తెలిపారు. పైగా సిబ్బంది చేస్తున్న పనిని సేవగా భావించాలని పేర్కొనడం దారుణమన్నారు. సంస్థలోని ఉద్యోగులకు కంపెనీ చాలా తక్కువ మొత్తంలో వేతనాలు చెల్లిస్తోందని నిజాలు బయటపెట్టారు. తనకు కూడా చాలా తక్కువ జీతం చెల్లించే వారని గుర్తు చేశారు. ముఖ్యంగా తనను కూడా కంపెనీ ఉచితంగా సేవ చేయాలని కోరుకున్నారని వెల్లడించారు. చెప్పే మాటలకీ, చేసే పనులకు ఆస్సలు పొంతన ఉండదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తాను పతాంజలిని వదిలేశానని అన్నారు. తాను సిఇఒగా ఉన్నప్పుడు పతాంజలి ఆయుర్వేద, పతంజలి ఫుడ్‌పార్క్‌కు సంబంధించిన రెండు విధులు ఒకే సారి నిర్వర్తించానని అన్నారు. ఈ రెండు విధులకు వేరువేరుగా వేతనం చెల్లిస్తానని రాందేవ్ హామీ ఇచ్చి అనంతరం ఎగ్గొట్టారని గుర్తు చేశారు. తనకు, ఉద్యోగులకు ఇచ్చిన అనేక హామీలను ఉల్లంఘించారని ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎస్‌కె పాత్ర ఆరోపించారు.

ఐఐటిలో మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించిన ఎస్‌కె పాత్ర 2011–2014 నుండి పతంజలి ఆహార పార్క్ ప్రెసిడెంట్‌గానూ, పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిగాను పనిచేశారు. అంతకుముందు ఎంఎంటిసి లిమిటెడ్, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, చంబల్ ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్, ఎసిఎంఈ టెలీ పవర్ సంస్థలకు పనిచేశారు. మరో ఐఐఎం గ్రాడ్యుయేట్ సి.ఎల్. కమల్ అకస్మాత్తుగా కంపెనీని వీడడంతో ఆయన స్థానంలో పాత్ర ఎంపికయ్యారు.తనకు తొలుత హామీ ఇచ్చినట్టు కాకుండా ఒక ఉద్యోగానికే వేతనం ఇచ్చారని ఎన్‌కె పాత్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకంటే దారుణం ఎంటంటే మొత్తం పతాంజలికి ఉచితంగా సేవలు అందించాలని అనేక సార్లు తనను కోరారని గుర్తు చేసుకున్నారు. పతాంజలి సేవ కోసమే పుట్టిందని గొప్పలు చేప్పే వారని విమర్శించారు. ప్రస్తుతం రాందేవ్ వేతనం తీసుకుంటున్న, తర్వాత అది ఉండదని తనను ఉద్దేశించి పేర్కొన్నారన్నారు. ఇదే అంశంపై తాను పలుమార్లు బాబా రాందేవ్‌ను సంప్రదించినా ఫలితం లేకపోయిందన్నారు. తన కుటుంబ బాధ్యతల నేపథ్యంలో ముందు హామీ ఇచ్చిన వేతనం చెల్లించమని అనేక సార్లు వేడుకున్నానని తెలిపారు. ఉద్యోగులకు, సరైన శిక్షణ లేకుండా, ఎలాంటి ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు లేకుండా అస్తవ్యస్తంగా ఉన్న సంస్థను తాను అభివ ద్ధి చేశానని తెలిపారు. తన కృషి వల్ల కంపెనీ అమ్మకాలను రూ. 317 కోట్ల నుంచి రూ .2,500 కోట్లకు పెరిగిగాయని పాత్ర తెలిపారు. అయినా రాందేవ్‌కు తన పట్ల, సిబ్బంది పట్ల కొంత కూడా విశ్వాసం లేదన్నారు.






కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు.
సెల్ : 9440262072

జనరల్ ఎస్సే ఫ్రేమ్‌వర్క్

గ్రూప్-1 ప్రత్యేకం





1. ఆంధ్రప్రదేశ్ - వ్యవసాయరంగం
ఎ. ఏ.పి.లో వ్యవసాయానికి వినియోగపడుతున్న భూమి వివరాలు
బి. వ్యవసాయ రంగం వాటా – ఆధారపడి జీవిస్తున్నవారి వివరాలు
సి. ఆహార, ఆహారేతర పంటల వివరాలు
డి. రాష్ట్రంలో ప్రధాన పంటలు – వివరాలు
ఇ. రాష్ట్ర ప్రభుత్వ నూతన విధానాలు
– మైక్రో ఇరిగేషన్, పోస్ట్‌హార్వెస్ట్ నిర్వహణ
– ప్రాసెసింగ్ ఇండస్ట్రీ అభివృద్ధి మొదలైనవి

2. పాతికేళ్ల ఆర్థిక సంస్కరణలు - ప్రభావం
ఎ. 1947 –91 మధ్య భారత ఆర్థికవ్యవస్థ – లక్షణాలు
బి. 1991 ఆర్థిక సంస్కరణలకు దారితీసిన పరిస్థితులు
సి. 1991 ఆర్థిక సంస్కరణల సారాంశం
డి. ఆర్థిక సంస్కరణల ప్రభావం
– వ్యవసాయ రంగం
– పారిశ్రామిక రంగం
– పెట్టుబడులు
– విదేశీ మారకద్రవ్యం
– ఉపాధి
– సామాజిక రంగాలు
– సామాజికవర్గాలు (దళితులు, గిరిజనులు, గ్రామీణులు, ఇతరులు)
– వినిమయతత్వం పెరుగుదల


3. ఏ.పి జలవనరుల వినియోగం
ఎ. సాగునీటి లభ్యత వివరాలు
బి. వివిధ నదీ ప్రాంతాలలో విస్తరించి ఉన్న ఆయకట్టు
సి. గోదావరి నదీ ప్రాంతం– పోలవరం ప్రాజెక్టు
డి. వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రాజెక్టుల వివరాలు
ఇ. కృష్ణానది పరీవాహక ప్రాంతం –ప్రాజెక్టులు – నీటి సమస్యలు

4. ఏ.పి.లో సహజవనరులు -పరిశ్రమలు - అభివృద్ధి
ఎ. వివిధ జిల్లాలలో ఖనిజాలు – వివరాలు
బి. కోస్తా తీరం – అభివృద్ధికి అవకాశాలు
సి. రాష్ట్రంలో ఉన్న ఓడరేవులు – కార్యకలాపాలు
డి. వ్యవసాయ, వాణిజ్య పంటలు – అభివృద్ధికి అవకాశాలు
ఇ. రాష్ట్ర ప్రభుత్వ ఐ.టి విధానం 2014–2020
ఎఫ్. ఎలక్ట్రానిక్స్ విధానం 2014–2020
జి. ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ విధానం 2014–2020
హెచ్. భాగస్వామ్య సదస్సు – 2016 – పెట్టుబడులు

5. న్యాయమూర్తుల నియామకం - వివాదం
ఎ. న్యాయవ్యవస్థ ప్రాముఖ్యత
బి. న్యాయమూర్తుల నియామకం – రాజ్యాంగం
సి. కొలీజియం వ్యవస్థ ఏర్పాటు
డి. 99వ రాజ్యాంగ సవరణ – నేషనల్ జుడిషియల్ కమిషన్ ఏర్పాటు
ఇ. 99వ రాజ్యాంగ సవరణ – సుప్రీంకోర్టు తీర్పు
ఎఫ్. నేషనల్ జ్యూడిషియల్ కమిషన్ – భిన్నవాదనలు
జి. కొలీజియం – జస్టిస్ చలమేశ్వర్ అభిప్రాయాలు

6. ఆంధ్రప్రదేశ్ - ప్రత్యేక హోదా
ఎ. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి– ప్రత్యేక హోదా ఆవశ్యకత
బి. ప్రత్యేక హోదా – ప్రత్యేక వర్గ హోదా తేడాలు
సి. గాడ్గిల్ – ముఖర్జీ ఫార్ములా – ప్రత్యేక వర్గ హోదా
డి. ప్రత్యేక వర్గ హోదా పొందడానికి సూచికలు
ఇ. ప్రత్యేక వర్గ హోదా వల్ల ప్రయోజనాలు
ఎఫ్. 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు – 42% వాటా
జి. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా – భిన్నవాదనలు
హెచ్. ప్రత్యేక హోదా – ప్రత్యేక ప్యాకేజీ
ఐ. ప్యాకేజీలో ప్రధానాంశాలు

7. ఆంధ్రప్రదేశ్ విభజనచట్టం - హామీలు - అమలు
ఎ. విభజన నాటికి ఆంధ్రప్రదేశ్ పరిస్థితి – శ్వేతపత్రం వివరాలు
బి. విభజన చట్టం – ప్రధానాంశాలు
సి. రెవిన్యూ లోటు, ఆర్థిక పరిస్థితి
డి. పోలవరం ప్రాజెక్టు, నదీ జలాలు
ఇ. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి
ఎఫ్. 13వ షెడ్యూల్ హామీలు
జి. జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు
హెచ్. ఉద్యోగుల విభజన



ఐ. రైల్వే జోన్ ఏర్పాటు
జె. రాజధాని నిర్మాణం
కె. 9, 10 షెడ్యూళ్లలోని ఉమ్మడి సంస్థల విభజన
ఎల్. హామీల అమలు జరిగిన తీరు

8. ఏ.పి రాజధాని నిర్మాణం
ఎ. రాజధానిపై శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులు
బి. రాజధాని – రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
సి. సి.ఆర్.డి.ఏ ఏర్పాటు
డి. భూ సమీకరణ – 33 వేల ఎకరాలు
ఇ. రాజధాని – సింగపూర్ ప్రణాళికలు
ఎఫ్. రాజధాని నిర్మాణం – ఆర్థిక వనరులు
జి. స్విస్ ఛాలెంజ్ పద్ధతి

9. భూసేకరణ చట్టం - 2013
ఎ. అభివృద్ధి – భూ సేకరణ
బి. 1894 భూ సేకరణ చట్టం
సి. క్రోనికాపిటలిజం – సెజ్‌లు, పరిశ్రమల పేరుతో భూసేకరణ దుర్వినియోగం
డి. 2013– భూసేకరణ చట్టం – ప్రధానాంశాలు
ఇ. 2015 కేంద్ర ప్రభుత్వ ఆర్డినెన్స్
ఎఫ్. భూసేకరణ/ భూసమీకరణ వివాదాలు

10. భారత వ్యవసాయరంగం - సంక్షోభం
ఎ. వ్యవసాయ రంగం ప్రాధాన్యత
బి. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా తగ్గుదల
సి. వ్యవసాయ సంక్షోభానికి కారణాలు – రైతుల ఆత్మహత్యలు
– ప్రభుత్వ పెట్టుబడుల తగ్గుదల
– రైతులకు రుణ లభ్యత
– సబ్సిడీలు తగ్గుదల
– కౌలు రైతుల సమస్యలు
– మార్కెటింగ్ సమస్యలు మొదలైనవి
డి. ఎం.ఎస్.స్వామినాథన్ కమిటీ సిఫార్సులు
ఇ. ప్రభుత్వ చర్యలు

11. గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జిఎస్‌టి)
ఎ. వస్తువులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే వివిధ రకాల పన్నులు
బి. జి.ఎస్.టి చట్ట పరిణామక్రమం
సి. ఒకే జాతి – ఒకే పన్ను
డి. జి.ఎస్.టి చట్టం – ముఖ్యాంశాలు
ఇ. జి.ఎస్.టి వల్ల లాభ, నష్టాలు
– ప్రజలకు
– వాణిజ్య రంగానికి
– ప్రభుత్వానికి
ఎఫ్. జి.ఎస్.టి సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందా?
– భిన్నవాదనలు

12. పెద్ద నోట్ల రద్దు - ప్రభావం
ఎ. పెద్దనోట్ల రద్దు – ప్రభుత్వ వాదనలు
బి. వడ్డీరేట్లు, నగదు డిపాజిట్లు
సి. వివిధ రంగాలపై ప్రభావం
డి. డిజిటలైజేషన్
ఇ. ఆర్థికవ్యవస్థపై ప్రభావం

13. యు.ఎస్.ఎన్నికలు - ట్రంప్ విధానాలు
ఎ. యు.ఎస్.ఎన్నికలు – ట్రంప్ విజయం
బి. ట్రంప్ విధానాలు – రక్షిత విధానాలు
సి. ట్రంప్ విధానాలు – అంతర్జాతీయ ప్రభావం
డి. ట్రంప్ విధానాలు – భారతదేశంపై ప్రభావం
ఇ. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభంలో భాగమే
ఎఫ్. ప్రపంచీకరణ విధానాల నుంచి జాతీయ ప్రయోజనాలవైపు

14. బ్రెగ్జిట్ - ప్రభావం
ఎ. యూరోపియన్ యూనియన్ ఏర్పాటు – లక్ష్యాలు
బి. ప్రపంచీకరణ – యూరోపియన్ యూనియన్
సి. 2008 ఆర్థికమాంద్యం – ఐరోపాపై ప్రభావం
డి. బ్రిటిష్ అంతరంగిక ఆర్థిక పరిస్థితులు
ఇ. బ్రెగ్జిట్ రిఫరెండం – ఫలితాలు
ఎఫ్. బ్రెగ్జిట్ ప్రభావం – ప్రపంచంపై
– ఐరోపాపై
– బ్రిటన్‌పై
– ఇండియాపై

15. ఉగ్రవాదం - ఐసిస్-వలసలు -ప్రభావం
ఎ. ఉగ్రవాదానికి కారణాలు
బి. ఇరాక్, సిరియా అంతరంగిక పరిస్థితులు – ఐసిస్ ఆవిర్భావం
సి. వలసలు – కారణాలు –ప్రభావం
డి. అగ్రరాజ్యాల బాధ్యత
ఇ. చిల్కాట్ నివేదిక
ఎఫ్. ఉగ్రవాద నివారణకు అంతర్జాతీయ చర్యలు

16. నరేంద్రమోడీ ప్రభుత్వ పథకాలు
ఎ. స్వచ్ఛ భారత్ అభియాన్
బి. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన
సి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన
డి. మేకిన్ ఇండియా, స్టార్టప్‌లు
ఇ. స్కిల్ ఇండియా
– ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన
– దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన
ఎఫ్. బీమా రక్షణ
– ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన
– ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన
– అటల్ పెన్షన్ యోజన

17. మహిళా సాధికారత - చర్యలు
ఎ. సమాజంలో మహిళల పాత్ర
బి. చారిత్రకంగా మహిళలు – అభివృద్ధి
సి. భారతరాజ్యాంగం – పార్లమెంట్ – మహిళల కోసం చేసిన చట్టాలు
డి. వివిధ రంగాలలో మహిళల స్థానం
ఇ. రాజకీయ సాధికారత
ఎఫ్. ఆర్థిక సాధికారత
జి. సామాజిక సాధికారత

18. బాల కార్మిక వ్యవస్థ - కారణాలు - నివారణా చర్యలు
ఎ. బాలల ప్రాధాన్యత
బి. బాలలు –భారత రాజ్యాంగం – 23, 21ఎ నిబంధనలు
సి. బాల కార్మిక వ్యవస్థ – కారణాలు
డి. 1986 బాలకార్మిక నిషేధచట్టం – ప్రభుత్వ చర్యలు
ఇ. బాలకార్మిక చట్టంలో ఇటీవల తెచ్చిన మార్పులు
ఎఫ్. బాలకార్మిక వ్యవస్థ – నివారణ – సూచనలు

★

ఉద్యోగాలు

నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్‌లో 15 ఖాళీలు

చెన్నయిలోని నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీఎస్‌సీఎం) 15 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల పేరు-ఖాళీలు : ప్రాజెక్ట్ సైంటిస్ట్ (3)–1, ప్రాజెక్ట్ సైంటిస్ట్ (2)–1, ప్రాజెక్ట్ ఇంజనీర్ (1)–1, ప్రాజెక్ట్ ఇంజనీర్ (1)–1, ప్రాజెక్ట్ అసోసియేట్ (పీఏ)–4, సీనియర్ రీసెర్చ్ ఫెలో (ఎస్ఆర్‌ఎఫ్)–1, జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్)–6.

వేతనం : ప్రాజెక్ట్ సైంటిస్ట్ (3) పోస్టులకు రూ.50,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్ (2)కు–రూ.45,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్ (1), ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులకు రూ.40,000, ప్రాజెక్ట్ అసోసియేట్‌కు–రూ.30,000, ఎస్ఆర్‌ఎఫ్‌కు రూ.18,000, జేఆర్‌ఎఫ్‌కు రూ.16,000.

అర్హతలు : సంబంధిత పోస్టులను అనుసరించి, మాస్టర్స్ డిగ్రీ/ పీహెచ్‌డీ. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.

వయోపరిమితి : జేఆర్‌ఎఫ్, ఎస్ఆర్‌ఎఫ్ పోస్టులకు 30 ఏళ్లు, ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 35 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 45 ఏళ్ల లోపు ఉండాలి.

ఎంపిక విధానం : సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తులకు చివరి తేదీ : ఆగస్టు 16, 2017.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.ncscm.res.in



ప్రభుత్వ ఉద్దేశం ఏమిటి?: ముద్రగడ

ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసం నుంచి ముద్రగడ తన అనుచరులు, జెఎసి నాయకులతో కలిసి పాదయాత్రకు బయల్దేరారు. గేటువద్దకు చేరుకొనేసరికి రోజూ మాదిరిగానే పోలీసులు అడ్డగించారు. పాదయాత్రకు అనుమతించొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినందున అనుమతించడం లేదని జిల్లా ఒఎస్‌డి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ముద్రగడ పోలీసులతో మాట్లాడుతూ తనను అంతర్జాతీయ ఉగ్రవాదిగా చిత్రీకరిస్తూ వేలమంది ఇంటిచుట్టూ కాపలాగా పెట్టి ఇబ్బందులు పెడుతున్నారన్నారు.

భూముల కొనుగోలుపై విచారణ చేపట్టండి

మాజీ ఎంపీ మిడియం డిమాండ్

ప్రజాశక్తి- బుట్టాయగూడెం (పశ్చిమగోదావరి)

ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా పోలవరం నిర్వాసితుల కోసం భూములను కొనుగోలు చేసిన అధికారులపై విచారణ చేపట్టాలని ఏపి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎంపి మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయగూడెంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై బాబూరావు ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడిచినా నేటికీ గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఏజెన్సీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా కేవలం నామమాత్రపు వైద్య శిబిరాలను నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటుందన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని రాస్తారోకో

ప్రజాశక్తి- హిందూపురం టౌన్ (అనంతపురం)

అనంతపురం జిల్లా హిందూపురం పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైసిపి కౌన్సిలర్లు స్థానిక మహిళలతో కలిసి రాస్తారోకో చేపట్టారు. శనివారం హిందూపురంలోని 33, 34, 35 వార్డుల ప్రజలు మేళాపురం సర్కిల్‌లో గంటకుపైగా బైఠాయించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది వచ్చి ఆందోళనను విరమించాలని కోరినా వారు వెనక్కి తగ్గలేదు. ఈ సందర్భంగా వైసిపి కౌన్సిలర్లు శివ, నాగభూషణ్‌రెడ్డి, ఆసీఫ్, జబీవుల్లా, రజనీ, జయమ్మలు మాట్లాడుతూ పలుమార్లు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. అత్యవసరంగా రెండు బోరుబావులు ఈ ప్రాంతంలో వేయించాలని, ఉన్న ట్యాంకర్ల సంఖ్యను మరింత పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ డీఈ, ఏఈలు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

సెప్టెంబర్ 18న చలో విజయవాడ

ఆర్టీసీ అద్దెబస్సు కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్టీసిలో పనిచేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు, వర్కర్ల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ డిమాండ్ చేశారు. విజయవాడలో శనివారం ఎపిఎస్‌ఆర్టీసి హైర్ బస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అద్దె బస్సు కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 18న చలో విజయవాడ పేరుతో ఆందోళన నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. సమావేశంలో ఎంఎ గఫూర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 128 ఆర్టీసి డిపోల్లో 2708 అద్దె బస్సుల్లో ఆరు వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనమివ్వాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐలతో పాటు చట్ట ప్రకారం సంక్షేమ పథకాల్ని అమలు చేయాలని, బస్ పాసులు, యూనిఫాంలు ఇవ్వాలని, వారాంతపు సెలవుల్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు యాజమాన్యాలు చట్టాన్ని అమలు చేయకపోగా, అడిగిన వారిపై వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి చర్యల్ని కార్మికులు ఎక్కువ కాలం సహించరని, పోరాటాల ద్వారా తమ హక్కులకై ఉద్యమించాలని కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందరయ్య, హైర్ బస్సు వర్కర్స్ రాష్ట్ర బాధ్యులు ముజఫర్ అహ్మద్, నాయకులు మల్లికార్జునరావు, సుబ్బయ్యగౌడ్, శ్రీనివాసులు, శేఖర్, సురేష్‌బాబు, రాంభూపాల్, బాషా తదితరులు పాల్గొన్నారు.



ఐటిడిఎ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

గిరిజన సంఘాల ఆధ్వర్యాన ఐటిడిఎ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన ప్రాంతాల అభివృద్ధి దిశగా ఐటిడిఎ పిఒ పనిచేస్తూ, గిరిజన సంఘాల నాయకుల పట్ల వైఖరి మార్చుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. శనివారం విజయనగరం జిల్లా పార్వతీపురం ఐటిడిఎ వద్ద గిరిజన సంఘాల ఆధ్వర్యాన సమస్యలు పరిష్కరించాలని, పిఒ వైఖరి మార్చుకోవాలని కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక గిరిజన సంఘాల సుదీర్ఘ పోరాటాల వల్ల ఏజెన్సీ అభివృద్ధికి ప్రభుత్వాలు ఐటిడిఎలను ఏర్పాటు చేశాయన్నారు. సమస్యలు చెప్పుకునేందుకు ఐటిడిఎకు వెళ్తున్న గిరిజన సంఘం నాయనులను పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఏ గిరిజన సంఘమైనా గిరిజన సమస్యలపైనే వినతులు ఇస్తారని, నిరసన కార్యక్రమాలను చేస్తారే తప్పా వ్యక్తిగతం కాదని అన్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు అధికారి సంఘాల నాయకుల పట్ల వైఖరి మార్చుకోవాలన్నారు. అనంతరం ఐటిడిఎ కార్యాలయం ఆవరణలో ఉన్న అడవి తల్లి విగ్రహానికి వినతి ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్, వ్యకాస జిల్లా కార్యదర్శి రెడ్డిశ్రీరామ్మూర్తి, రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఆర్‌విఎస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసిసి అటెండర్లను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించండి

కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎంసిసి అటెండర్లను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి, వారికి రూ. 10వేలు కనీస వేతనంగా చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించినట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, కార్యదర్శి టి క్రాంతి కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అటెండర్ల వేతనాల్ని నేరుగా బ్యాంక్ ఖాతాలోనే జమచేయాలని విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా 2010లో మండలానికి ఒకరిని ఎంసిసి అటెండర్‌గా నియమించిందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు మండల కార్యాలయంలో ఆఫీసును శుభ్రం చేయడం మొదలు మండల అధికారులు చెప్పే అన్ని పనులూ చేస్తున్న వీరికి కేవలం రూ.3వేలు మాత్రమే చెల్లిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో వీరి నియామకాలు జరిగినప్పటికీ రోజు వారీ కూలీలుగానే చూస్తున్నారని, పక్క రాష్ట్రంలో ఇటువంటి అటెండర్లను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ. 12వేలు వేతనాన్ని చెల్లిస్తున్నారని వివరించారు. జవహర్ రెడ్డిని కలిసిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ చంద్రశేఖర్, ఎంసిసి అటెండర్లు వీరభద్రప్ప, చెన్నయ్య, వెంకటసుబ్బయ్య, అర్జున్, వెంకటయ్య ఉన్నారు.

దొండపాడు ఘటనకు ఖండన

దొండపాడులో వ్యవసాయ కార్మికులపై దాడికి పాల్పడిన భూస్వాముల గూండాలను తక్షణమే అరెస్టు చేసి కేసులు పెట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మరో ప్రకటనలో డిమాండ్ చేసింది.దాడికి పాల్పడ్డ వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని కోరింది. అక్రమ చెరువుల తవ్వకాలను వెంటనే ఆపాలని డిమాండ్ చేసింది.

కొనసాగుతున్న డాల్‌మిల్ కార్మికుల సమ్మె

యాజమాన్యం, కార్మిక నేతల మధ్య చర్చలు విఫలం

ప్రజాశక్తి-తెనాలి

గుంటూరు జిల్లా తెనాలిలోని డాల్‌మిల్ యాజమాన్యం, కార్మిక నాయకుల మధ్య శనివారం జరిగిన చర్చలు విఫలం కావడంతో కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. కూలి రేట్లు పెంచాలని డాల్‌మిల్ ముఠా కార్మికులు చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరుకుంది. శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వాలని కార్మికులు ఒకవైపు ఆందోళన చేస్తుంటే మరోవైపు యాజమాన్యం ఇతరులను ఉపయోగించుకుని పనులు నిర్వహిస్తోంది. దీనిపై శుక్రవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ విషయంపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కార్మిక నాయకులు, మిల్ యాజమాన్యం మధ్య శనివారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో కూలి రేట్లు పెంచేంత వరకు సమ్మె విరమించేది లేదని కార్మిక సంఘ నాయకులు స్పష్టం చేశారు.

దళితులపై భూస్వాముల దాడి

అక్రమ చెరువు తవ్వకాన్ని అడ్డుకున్నందుకు ప్రతీకారం

ప్రజాశక్తి- గుడివాడ (కృష్ణా)



చేయి విరిగిన ఎలిజబెత్ రాణి



భూస్వాముల దాడిలో తలకు 16 కుట్లుపడిన బి.వి.శ్రీనివాస్



అనిల్

కృష్ణాజిల్లాలో భూస్వాముల ఆగడాలు శృతిమించాయి. గుడివాడ మండలం దొండపాడులో అక్రమ చెరువుల తవ్వకాలను అడ్డుకున్న దళితులపై శనివారం దాడి చేశారు. దొరికిన వాళ్లను దొరికినట్లే చితకబాదారు. దళితులకు మద్దతుగా నిలిచిన సిపిఎం డివిజన్ సభ్యులు బివి.శ్రీనివాసరావును తీవ్రంగా గాయపర్చారు. సుమారు 20 మంది గుండాలు కర్రలు, బాదులతో శ్రీనివాసును చుట్టుముట్టి తీవ్రంగా కొట్టారు. అతని తల రెండు చోట్ల పగిలింది. అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో దళితులు శ్రీనివాస్‌ను కొడుతున్న వారిపై తిరగబడ్డారు. అయిన లెక్క చేయకుండా బీరు సీసాలు, రాళ్లతో గుండాలు కొట్టారు. దీంతో ప్రాణభయంతో పరుగులు పెట్టిన దళితులనూ విడిచి పెట్టలేదు. పాతిక మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దొండపాడు గ్రామంలో పాత హరిజన వాడకు ఆనుకుని ఉన్న ఏడెకరాల్లో చెరువు తవ్వుతున్నారు. దీని వల్ల కాలుష్యం పెరుగు తోందని, భూగర్భ జలాలు కలుషిత మౌతాయని దళితులు సిపిఎం, ఇతర ప్రజాసంఘాల సంఘీభావంతో వారం రోజుల నుంచి తవ్వకాలను అడ్డుకుంటున్నారు. శనివారం తవ్వకం పనులు తిరిగి ప్రారంభించటంతో అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అప్పటికే అక్కడ పొంచివున్న 150 మంది గూండాలు వారిని చుట్టుముట్టి విచక్షణా రహితంగా దాడి చేశారు. దొరికిన వారిని దొరికినట్లు చేలల్లో పరిగెత్తించారు. ఊపిరాడకుండా మెడపై కాళ్లు పెట్టి పంట బోదెల్లో కుక్కారు. మహిళలను సైతం వదిలిపెట్టలేదు. తీవ్ర గాయాలైన 25 మందిని గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి, తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావు, కోటేశ్వరమ్మ, అనిల్ తదితరులను విజయ వాడ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసరావు తలపై 13 కుట్లు, అనిల్ తలపై ఐదు కుట్లు వేశారు. కోటేశ్వరమ్మ చెయ్యి విరిగింది. పంటబోదెల్లో కుక్కటంతో ఊపిరాడక మరో మహిళ తీవ్ర అస్వస్థతకు గురైంది.

మంత్రుల ఒత్తిడి

దళితులపై భూస్వాములు దాడి చేయడంతో నలుగురు పరిస్థితి విషమంగా ఉందని తెలిసిన వెంటనే పెత్తందారులకు మద్దతుగా మంత్రులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పెత్తందారులకు చికిత్స చేసినట్లు రిపోర్టు ఇవ్వాలని వైద్యులపై ఒత్తిడి తెచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిరాకరించి గాయాలు లేవని చికిత్స చేయాల్సిన అవసరం లేదని వారిని పంపించారు. మంత్రుల జోక్యంపై దళితులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.

వ్యకాస ఆధ్వర్యంలో నిరసన

దాడికి నిరసనగా వ్యవ సాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దొండ పాడు గ్రామ దళితులు గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయిం చారు. భూస్వాములను అరెస్టు చేసే వరకు కదిలేది లేదని స్పష్టం చేయటంతో అధికారులు దిగొచ్చారు. ఆర్‌డిఒ, డిఎస్‌పి, ఫిషరీస్ జెడిలు ఇరు పక్షాలను సమన్వయ పర్చారు. పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చెరువు అనుమతులను రద్దు చేయాలని దళితులు పట్టుబట్టారు. సిపిఎం తూర్పుకృష్ణా కార్యదర్శి ఆర్.రఘు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాగంటి హరి బాబు, వ్యకాస తూర్పుకృష్ణా కార్యదర్శి మురాల రాజేష్, వెసిపి జిల్లా కన్వీనర్ కె.పి. సారథి, పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.అనీల్ కుమార్, సిపిఎం డివిజన్ కార్యదర్శి ఆర్‌సిపి. రెడ్డి, సిఐటియు డివిజన్ కార్యదర్శి కె.సుబ్బారావు క్షతగాత్రులను పరామర్శించి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు నిధుల్ని దారి మళ్లించొద్దు

బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



జిఒ కాపీని చూపుతున్న సిఐటియు నాయకులు ఆర్‌వి.నర్సింహారావు, పిల్లి నరసింహారావు, వెంకటేశ్వరరావు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధుల్ని దారి మళ్లించొద్దని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. విజయవాడలో ఆ ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.ఉమామహేశ్వరరావు, పిల్లి నర్సింహా రావు మాట్లాడుతూ ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల అవసరాలకు వెల్ఫేర్ బోర్డు నిధుల్ని వినియోగించాలని రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలన్నారు. సంబంధం లేని డిపార్ట్‌మెంట్‌లో నిధుల విడుదలకు ఉత్తర్వులిస్తున్న ఐఎఎస్ అధికారి పూనం మాలకొండయ్యపై చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పును లెక్క చేయకుండా నిధులు పక్కదారి పట్టించడం అన్యాయమన్నారు. ఉద్దానం వంటి సమస్యలను సామజిక బాధ్యతగా ప్రభుత్వం స్వీకరించి అవసరమైన నిధులను ఖర్చు చేయాలని సూచించారు. వెల్ఫేర్‌బోర్డులో రిజిస్ట్రేషన్‌కు వెళ్లిన వారిని చంద్రన్న బీమాలో చేరాలంటూ తిప్పి పంపుతున్నారని, బోర్డు చట్టానికి ఇది విరుద్ధమన్నారు. చంద్రన్న బీమాకు సంక్షేమ బోర్డు నిధులు రూ.400 కోట్లు విడుదల చేయడం అన్యాయమన్నారు. బోర్డు నిధుల్ని రకరకాల పేరుతో దుర్వినియోగం చేయడం మానుకోవాలని సూచించారు. ఆర్‌వి నరసింహారావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాల్సిందే

- లేదంటే జాతీయస్థాయిలో ఉద్యమం
- కృష్ణానది పరిరక్షణ బృందం హెచ్చరిక

ప్రజాశక్తి-తుళ్ళూరు(గుంటూరు)

రాజధాని ప్రాంతంలో రామన్ మెగసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ తదితరులపై టిడిపి నాయకులు దాడికి పాల్పడిన సంఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే క్షమాపణ చెప్పాలని కృష్ణానది పరిరక్షణ-పరిశీలన యాత్ర బృందం నాయకులు డిమాండ్ చేశారు. రెండురోజుల్లో క్షమాపణ చెప్పకపోతే జాతీయస్థాయిలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. శనివారం రాజధాని ప్రాంతం, తుళ్ళూరు మండలం లింగాయపాలెంలోని రైతు కూలీ హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ అనుమోలు గాంధీ ఇంటివద్ద రాజేంద్రసింగ్, ఏక్తా పరిషత్ చైర్మన్ పివి రాజగోపాల్ రాష్ట్రీయ స్వాభిమాన్ ఆందోళన్ అధ్యక్షులు బసవరాజ్ పాటిల్, సిపిఎం రాజధాని సమన్వయ కమిటీ కన్వీనర్ సిహెచ్.బాబూరావు తదితరులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజేంద్రసింగ్ మాట్లాడుతూ.. విలువైన పంటలు పండే భూముల్లో రాజధాని నిర్మాణం జరగడం సముచితం కాదన్నారు. సిఆర్‌డిఎ కమిషనర్ నదిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడంలేదని చెప్పారని, కానీ నదికి అతి సమీపంలో స్టార్టప్ ఏరియాలో నిర్మాణాలు రానున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రాజధానిలో కొందరు తమపై దాడి చేశారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భిన్నాభిప్రాయాలు చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప దౌర్జన్యాలకు దిగడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

జపాన్ బృందం పర్యటన

ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్‌పై అధ్యయనం చేయడానికి గుంటూరు జిల్లా మంగళగిరికి శనివారం జపాన్‌కు చెందిన జికా బృందం వచ్చింది. ఈ బృందం మరో 15 రోజుల తరువాత ఇక్కడే ఉండి అన్ని పరిశీలిస్తుందని కమిషనర్ తెలిపారు.

వంశధార నిర్వాసిత మండలాల్లో నేటి నుంచి 144 సెక్షన్

- నిర్వాసితులు ఆందోళనకు సిద్ధం కావడమే కారణం

ప్రజాశక్తి - హిరమండలం

తమకు న్యాయం చేయాలని కోరుతూ వంశధార నిర్వాసితులు ఆందోళనకు సమాయత్తమవుతుండటంతో ప్రభుత్వం దానిని నిరోధించేందుకు శాంతిభద్రతల సమస్యను ముందుకు తెచ్చింది. నిర్వాసిత మండలాల్లో సెక్షన్-30 పోలీసు యాక్ట్‌తోపాటు, 144వ సెక్షన్‌ను ఆదివారం నుంచి విధించనున్నారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి డిఎస్‌పి వి.సుబ్రమణ్యం వెల్లడించారు. హిరమండలం పోలీస్‌స్టేషన్‌లో కొత్తూరు, పాతపట్నం సర్కిల్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికార యంత్రాంగం సానుకూలంగా ఉందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యలు పరిష్కారం కావడం లేదని విధ్వంసానికి పాల్పడరాదన్నారు. ముందు జాగ్రత్త చర్యగా 144, సెక్షన్-30 అమలు చేస్తున్నామని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులకు నిర్వాసితులు సహకరించాలని కోరారు. సమావేశంలో కొత్తూరు, పాతపట్నం సిఐలు జె.శ్రీనివాసరావు, బి.వి.ఎస్.ఎస్ ప్రకాష్, హిరమండలం ఎస్ఐ ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువజనుల పండుగగా డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న డివైఎఫ్ఐ 14వ రాష్ట్ర మహాసభలు యువజనుల పండగగా జరగాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం ఆకాంక్షించారు. మొట్ట మొదటిసారిగా డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జిల్లాలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. శనివారం జెఎస్ ట్రస్ట్ భవన్‌లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది యువకులు, కార్యకర్తలు ఉన్నా అతిపెద్ద సంఘంగా డివైఎఫ్ఐ ఉండడం అభినందనీయమన్నారు. సెప్టెంబరు 24, 25 తేదీల్లో నెల్లూరులో జరిగే డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు యువజనుల సమస్యలపై భవిష్యత్తులో వారి అభివృద్ధికి ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలనే దిశగా చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుబ్రమణ్యం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం కండి

రియల్ ఎస్టేట్ కోసమే జింక్ పరిశ్రమ మూత

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-గాజువాక, విశాఖ

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే జింక్ పరిశ్రమను మూసివేశారని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు విమర్శించారు. 'విశాఖ జింక్ పరిశ్రమను నడపండి లేకపోతే ఎవరి భూములు వారికి ఇచ్చేయ్యండి' అంటూ మిందిలో పబ్లిక్ సెక్టర్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ జింక్ పరిశ్రమను ఏర్పాటుచేసి ఒకతరం కాకుండానే మూసివేశారని చెప్పారు. 360 ఎకరాల్లో నిర్మించిన ఈ జింక్ పరిశ్రమను ఎకరం రూ.5 కోట్లు చొప్పున రూ.1,825 కోట్లుకు అమ్మాలని యాజమాన్యం చూస్తోందని విమర్శించారు. అప్పట్లో పరిశ్రమ నిర్మిస్తామని చెప్పి రైతుకు రూ.850 చెల్లించి ఇప్పుడు రూ.కోట్లకు విక్రయిస్తుందని తెలిపారు. దీనిపై రాజకీయాలకతీతంగా నాలుగు గ్రామాల ప్రజలు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పోరాటంలో భాగంగా ఈ నెల 18న జింక్ మెయిన్‌గేటు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాలని కోరారు. దీన్ని అడ్డుకోకపోతే మిగతా పబ్లిక్ రంగ సంస్థల స్థలాలను కూడా ఇలానే తెగనమ్మాలని చూస్తారని చెప్పారు. దీనిపై గ్రూపు మీటింగ్‌లు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పబ్లిక్ సెక్టర్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్, టిడిపి నాయకులు ఈటి శ్రీరాములు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలను కాపాడండి

- కరువు సహాయక చర్యలు చేపట్టాలి
- ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పైర్లు పూర్తిగా ఎండిపోతున్నాయని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.పెద్దిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం అనంతపురం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేసిన వేరుశనగ పంటలు ఎండిపోతున్నాయని, రాష్ట్రంలో 240 మండలాలు, అనంతపురం జిల్లాలో 63 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి గతేడాది పుష్కరాలు, రాజధాని శంకుస్థాపన పేరుతో సంబరాలు చేసుకోవడంలో నిమగ్నమై, రాష్ట్రంలో కరువు గురించి నివేదికలు కేంద్ర ప్రభుత్వానికి పంపలేదని విమర్శించారు. కేంద్రం నుంచి నిధులు తక్కువగా రావడానికి సిఎం నిర్లక్ష్యమే కారణన్నారు. ఈ ఏడాదైనా సిఎం సకాలంలో స్పందించి కరువు నివేదికలు కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు రాష్ట్ర యంత్రానికి ఆదేశించాలన్నారు. రైతులు అప్పులు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో రైతులు జీవించడానికి సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాయలసీమ వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల వల్ల 39 శాతం విస్తీర్ణంలో మాత్రమే సాగు చేశారని, సాధారణ విస్తీర్ణం 9.09 లక్ష లక్షల హెక్టార్లకు 3.35 లక్షల హెక్టార్లు సాగు చేశారన్నారు. ఇందులో 50 శాతం పంటలు ఎండిపోయాయని తెలిపారు. రైతులకు పంట రుణాల మాఫీ చేయాలన్నారు. 2016 ఇన్‌పుట్ సబ్సిడీ అర్హులైన రైతులందరికి పంపిణీ చేయాలన్నారు.

పోలవరం నిర్వాసితుల ప్రదర్శన

పునరావాసం కల్పించాలని డిమాండ్

ప్రజాశక్తి - కుక్కునూరు(పశ్చిమగోదావరి)

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టాలని సిపిఎం పోలవరం డివిజన్ కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. పునరావాస ప్యాకేజీ, ముంపు ప్రాంతంలో భూములన్నింటికీ పరిహారం మంజూరు తదితర సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వాసితులతో కలిసి శనివారం పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత స్థానిక పార్టీ కార్యాలయం నుండి సబ్‌కలెక్టరు కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. జోరువర్షంలోనూ నిర్వాసితులు సబ్‌కలెక్టరు కార్యాలయం వద్ద రెండుగంటలపాటు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం డివిజన్ కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ 2018 నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామంటున్న ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసం ఊసెత్తడం లేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ ఇన్‌చార్జి అధికారి ఎస్.కృష్ణమూర్తికి అందజేశారు. సిపిఎం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల కార్యదర్శులు వై.నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జిఒ 64ను రద్దు చేయాలని విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రభుత్వ వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు దూరం చేసే జిఒ 64ను రద్దు చేయాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్‌కెవిటి డిగ్రీ కాలేజీలోని ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం తరగతులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. తమకు ఉద్యోగాలు లేకుండా అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 64ను రద్దు చేయాలన్నారు. పాత జిఒ 16ను అమలుచేయాలని కోరారు. తమ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని విదార్థులు, నాయకులు ఎస్.శ్రీకాంత్, ఎన్.చాముండేశ్వరి డిమాండ్ చేశారు. ఐసిఎఆర్ గుర్తింపు లేని నకిలీ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు జిఒ 64ను తేవడం ద్వారా ప్రభుత్వ విద్యార్థులకు, వ్యవసాయ రంగానికి పెద్ద ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం నకిలీలకు ఉద్యోగాలు కట్టబెట్టే పనిని విరమించుకోవాలన్నారు. వీరి ఉద్యమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.పవన్ సంపూర్ణ మద్దతు తెలిపారు.

నావలకు స్థలం కేటాయించాలని ధర్నా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

చేపల వేటే జీవనోపాధిగా జీవిస్తున్న తమకు నావలు పెట్టుకునేందుకు స్థలం కేటాయించాలంటూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోటిలింగాలపేటలో మత్స్యకారులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా కాలంగా తాము చేపల వృత్తిని జీవనోపాధిగా ఎంచుకుని జీవిస్తున్నామన్నారు. నావలను కోటిలింగాలపేట గోదావరి తీరంలోనే పెట్టుకుని జీవిస్తున్నామన్నారు. అక్కడ ఇసుక ర్యాంపు కేటాయించిన అధికారులు తమ నావలను కైలాసభూమి పక్కన పెట్టుకోవాలని చెప్పారన్నారు. కైలాసభూమి నిర్వాహకులు నావలను పెట్టుకోకుండా అడ్డు తగులుతున్నారన్నారు. సమాచారం అందుకున్న రాజమహేంద్రవరం అర్బన్ తహశీల్దార్ రాజేశ్వరరావు, త్రీటౌన్ సిఐ ఎంవి.మారుతీరావు ఘటనా స్థలానికి చేరుకుని చర్చలు జరిపారు. ఇసుక ర్యాంపు పక్కనే నావలను పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది.

'సిసిఎస్ పట్నాయక్ అక్రమాలపై విచారణ జరిపించాలి'

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

అక్రమ పద్ధతిలో టుబాకో బోర్డు సెక్రటరీగా నియామకం పొందిన సిసిఎస్ పట్నాయక్ అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని టంగుటూరు వేలం కేంద్రం-1 ఆక్షన్ సూపరింటెండెంట్ దేవానంద డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1984లో సీజన్ క్లర్క్‌గా రిక్రూట్‌మెంట్ అయి బోర్డు అసిస్టెంట్ మేనేజర్‌గా, డిప్యూటీ మేనేజర్‌గా పదోన్నతలు పొందారన్నారు. పట్నాయక్‌కు అర్హత లేకపోయినా ఫైనాన్స్ మేనేజర్‌గా, సెక్రటరీగా నియామకం పొందారన్నారు. ఇద్దరు సీనియర్లు ఉన్నా వారిని కాకుండా పట్నాయక్ ఫైనాన్స్ మేనేజర్‌గా అక్రమ పద్ధతిలో పదవి పొందారని విమర్శించారు. బోర్డుకు చైర్మన్, ఈడి లేని సమయంలో సెక్రటరీగా ఉన్న పట్నాయక్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

ప్రజ్ఞ జవాబులు


1. యార్లంగ్
2. 9.86 సెకన్లు
3. ఆధార్, 4. సుష్మ స్వరాజ్
5. అరవింద్ పనగరియ



కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్

సోపోర్: జమ్మూకాశ్మీర్‌లో శుక్రవారం రాత్రి మొదలైన ఎన్‌కౌంటర్ శనివారమూ కొనసాగుతోంది. తాజాగా సోపోర్‌లో భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు మరణించారు. ఓ పోలీసు తీవ్రంగా గాయపడ్డారు. సోపోర్ ప్రాంతం లో ఉగ్రవాదులున్నారనే సమాచారంతో శుక్రవారం రాత్రి భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహించాయి. ఆ సమయంలో ఉగ్రవాదులు తొలుత భద్రతా దళాలపై కాల్పులు జరిపినట్లు పోలీసు అధికార ప్రతినిధి మనోజ్ పండిత చెప్పారు. దీంతో ఎదురుకాల్పులు జరిపామన్నారు. మరణించిన ఉగ్రవాదుల నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, మూడు తుపాకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

70 కేంద్ర పథకాలపై ప్రచారం



న్యూఢిల్లీ : భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఈ ఆగస్టు 15తో 70 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశ ప్రగతిని చాటి చెప్పేలా కేంద్రం చేపట్టిన 70 కార్యక్రమాల గురించి స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. జన్‌ధన్ యోజన, నోట్లరద్దు, జిఎస్‌టి, ముద్ర యోజన, స్వచ్ఛ భారత్, మేక్ ఇన్ ఇండియా, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా, నమామి గంగే.. తదితర కార్యక్రమాలకు ఈ ప్రచారంలో చోటు కల్పించింది. రాజకీయ నిష్పాక్షితను తెలియచెప్పాలా యుపిఎ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన జన్ ఔషధి యోజన .. వంటి పథకాలను కూడా ఈ జాబితాలో చేర్చింది.

8న కేంద్ర కార్మిక సంఘాల జాతీయ సదస్సు

భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనే అజెండా

న్యూఢిల్లీ : కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయానుసారం జాతీయ స్థాయి కార్మికుల సదస్సును ఈ నెల 8న న్యూఢిల్లీలోని కల్ కతోరా స్టేడియంలో నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా కార్మికవర్గ ఉమ్మడి డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టాల్సిన నిరవధిక సమ్మెతో పాటు భవిష్యత్ పోరాటాల కార్యాచరణను ఈ సదస్సులో రూపొందించున్నారు. వివిధ రంగాలకు చెందిన కార్మిక, ఉద్యోగ సంఘాలు, సమాఖ్యల నాయకులు, కార్యకర్తలు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ఈ జాతీయ సదస్సు నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలు ఐఎన్‌టియుసి, ఏఐటియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఏఐయుటియుసి, టియుసిసి, ఎస్‌ఇడబ్ల్యుఎ, ఏఐసిసిటియు, యుటియుసి, ఎల్‌పిఎఫ్ గత జూన్ 2న నిర్ణయించిన సంగతి తెలిసిందే.

కేరళలో బిజెపి కొత్త వ్యూహాలు

నేడు రాష్ట్రానికి అరుణ్‌జైట్లీ

తిరువనంతపురం : దుష్ప్రచారమే లక్ష్యంగా కేరళలో అధికార సిపిఎంను ఎదుర్కొవడానికి బిజెపి కొత్త ఎత్తుగడలు వేస్తోంది. ఆదివారం తిరువనంతపురంలో ఒక రోజు పర్యటనకు కేంద్ర మంత్రి, సీనియర్ నేత అరుణ్‌జైట్లీని ఇదే లక్ష్యంతో తీసుకునివస్తోంది. రాష్ట్రంలో సిపిఎం-బిజెపిల మధ్య ఇప్పటికే ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బిజెపి ఈ నిర్ణయం తీసుకుంది. కేరళలోని బిజెపి నాయకులపై మోడీ-షా నేతృత్వంలోని జాతీయ నాయకత్వం సంతృప్తిగా లేదు. పినరయ్ విజయన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరింత తీవ్రంగా పనిచేయాలని వత్తిడి పెంచుతోంది. ఈ నేపథ్యంలోనే రాజకీయ హింసాకాండతో పినరయ్ విజయన్‌కు సంబంధం వుందని ఆరోపిస్తూ రాష్ట్ర గవర్నర్ పి సదాశివంకు బిజెపి నాయకులు ఇటీవల మెమోరాండం అందచేశారు. కాగా, ఆదివారం ఉదయమే తిరువనంతపురానికి అరుణ్‌జైట్లీ చేరుకుని, హత్యకు గురైన ఆర్‌ఎస్‌ఎస్ నేత ఇంటిని సందర్శిస్తారు. తరువాత ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి కార్యకర్తలు, కుటుంబ సభ్యులతో సమావేశంలో మంత్రి పాల్గొంటారు. కాగా, తమ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని బిజెపి చేస్తున్న ప్రచారాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోంది. సిపిఎం ఎలాంటి దాడులను చేయడం లేదని తెలిపింది. గత కొంతకాలంగా బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కొనసాగిస్తున్న హింసాకాండలో పదుల సంఖ్యలో సిపిఎం కార్యకర్తలు ప్రాణాలు కోల్పోగా, వందలమంది తీవ్రంగా గాయపడ్డారని పార్టీ పొలిట్ బ్యూరో తెలిపింది. ఏదిఏమైనా ఇటీవల జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ నేత హత్యను రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకోవాలని బిజెపి భావిస్తోంది. కేరళలోనూ, పార్లమెంట్‌లోనూ దీన్ని భారీగా ప్రచారం చేయాలని బిజెపి వ్యూహాలు పన్నుతోంది.

180 ప్రసూతి సెలవులు

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నిర్ణయం



కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని మహిళా ఉద్యోగులందరికీ ప్రసూతి సెలవులు 180 రోజులు పాటు ఇవ్వనున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా ఈ నిబంధన వర్తింస్తుందని పేర్కొంటూ శనివారం ఆర్థిక శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో సాంకేతిక సేవలందిస్తున్న వారు సైతం దీనికి అర్హులేనన్నారు. అబార్షన్ వంటి సమస్యలు ఎదురైన సందర్భంలో మరో 42 రోజుల పాటు ఉద్యోగులు సెలవు పొడిగించుకోవచ్చని నోటిఫికేషన్ పేర్కొన్నారు. ఆ సమయంలో కూడా ఉద్యోగులకు ఒప్పందంలో ఉన్న ప్రకారం వేతనం అందుతుందని నోటిఫికేషన్ తెలియజేసింది.

ఐక్యంగా గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

కర్ణాటక గవర్నర్‌తో భేటీ

బెంగళూరు: కర్ణాటక గవర్నర్ వజుభాయి రుదభాయి వాలాతో గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శనివారం భేటీ అయ్యారు. కెఎస్‌ఆర్‌టిసి బస్సులో రాజ్‌భవన్‌కు చేరుకున్న 44 మంది ఎమ్మెల్యేలు గవర్నర్‌తో వ్యక్తిగతంగా మాట్లాడారు. తామంతా ఓ కుటుంబంలా ఇక్కడ మసులుతున్నామని, తమకు బెంగళూరులో ఎటువంటి ఇబ్బందులు లేవని గవర్నర్‌కు తెలిపారు. గుజరాత్ నుంచి మూడు రాజ్యసభ స్థానాలకు ఆగస్టు 8న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బిజెపి ఫిరాయింపులను ప్రోత్సహిస్తుందనే ముందు జాగ్రత్తతో ఆ 44 మందినీ కాంగ్రెస్ అధిష్టానం బెంగళూరుకు పంపించిన సంగతి తెలిసిందే. అయితే వారిని బంధించారంటూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో గవర్నర్‌తో భేటీ అయ్యారు. అనంతరం వారికి ఆతిథ్యమిస్తున్న కర్ణాటక మంత్రి డికె శివకుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ నిజం ఎప్పటికీ దాగదని, కాంగ్రెస్‌లో ఎటువంటి విభేదాలు లేవనడానికి ఎమ్మెల్యేల మధ్య ఐక్యతే నిదర్శనమని చెప్పారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే శక్తిసింహ్ గోహిల్ మాట్లాడారు. "మా ఎమ్మెల్యేలను బిజెపి ప్రలోభాలకు గురిచేస్తోంది. అయినప్పటికీ మేమంతా కలిసే ఉన్నాం. మాలో కొంతమందికి బిజెపి నేతలు రూ.15 కోట్లు ఆశజూపినప్పటికీ వారంతా పార్టీతోనే ఉన్నారు. ఇకపై బెదిరింపులకు పాల్పడమని బిజెపి హామీ ఇస్తే ఇప్పటికిప్పుడే మేం గుజరాత్‌కు వెళ్లిపోతాం" అని అన్నారు. సాధ్యమైనంత త్వరగా స్వరాష్ట్రానికి వెళ్లిపోతామని, ఆదివారం సమావేశమైన భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

పథకం ప్రకారం 'బీఫ్' దాడి

బిజెపి నేత వ్యాఖ్యలతో స్పష్టం

పాట్నా: బీహార్‌లో ఇటీవల చోటుచేసుకున్న గోగూండాల దాడి..ముందస్తు పథకమేనని తేలింది. ఆ ఘటనపై బిజెపి నేత భువార్ ఓజా స్పందిస్తూ "ఇప్పుడు మేం ప్రభుత్వంలో భాగం. అక్రమంగా నడుపుతున్న పశు వధ శాల గురించి బయటపెట్టేందుకే ప్రయత్నించాం" అంటూ చేసిన వ్యాఖ్యలు ఈ కుట్రను బయటపెట్టాయి. వివరాల్లోకెళ్తే ముస్లింలు అధికంగా నివసించే రాణి సాగర్, బగాహి ప్రాంతంలో అక్రమంగా పశువధ శాలను నిర్వహిస్తున్నట్లుగా బిజెపి ఆరోపించింది. ఆ వధ శాలల నుంచి గురువారం 12 టన్నుల మాంసాన్ని తీసుకెళుతున్న ట్రక్కును అడ్డుకునేందుకు ముందుగానే పథకం రచించింది. అనుకున్నట్లుగానే పెట్రోలు బంక్ వద్ద వేకువజామున 2 గంటల ప్రాంతంలో 15 మంది బిజెపి, భజరంగ్‌దళ్ కార్యకర్తలు చేరుకున్నారు. సరిగ్గా 5 గంటల ప్రాంతంలో అటువైపుగా వచ్చిన ట్రక్కును అడ్డుకున్నారు. అందులోవున్న సద్రుద్దీన్ ఖాన్, అజముల్లా ఖాన్, గులాం ఖాన్‌లపై దాడి చేశారు. గతంలో చాలా సార్లు ఆ పశువధ శాల గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు చర్యలు తీసుకోలేదు. దీంతో వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు తాము ఈ మార్గాన్ని ఎంచుకున్నామని చెప్పాడు. దాడికి గురైన వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు..దాడి చేసినవారిపై కేసు నమోదు చేయలేదు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో బిపిన్ కుమార్ అనే పోలీసుపై సస్పెన్షన్ ఓటు వేశారు.



మహిళోద్ధరణ ప్రచారానికే పరిమితం

- ఉద్యోగాలకు దూరమౌతున్న మహిళలు
- సామాజిక, వ్యవస్థీకృత కారణాలే ఎక్కువ
- పని కల్పించలేకపోతున్న విద్య
- ఇంట్లో పనికి లభించని గుర్తింపు
- సిఎంఐఈ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: భారత దేశంలో మహిళలకు కల్పించే ఉద్యోగాలు చాలా తక్కువ. ఎంతో కష్టపడి సంపాదించిన ఆ ఉద్యోగాల్లో నిలదొక్కోవడం వారికి కష్టంగా మారుతోంది. దానికి సామాజిక, వ్యవస్థీకృత లోపాలే కారణమని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకనామీ(సిఎంఐఇ)' నివేదికలో వెల్లడైంది. 2004-2012 మధ్యలో ఒక్క భారత్‌లోనే కోటి 90 లక్షల మంది ఉద్యోగాలు మానేశారు. వీరందరినీ ఓ చోట చేరిస్తే ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న మూడో నగరంగా ఆ ప్రాంతం నిలుస్తుందని ఆ నివేదిక పేర్కొంది. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనూ 9 లక్షల పురుషులు ఉద్యోగాలు పొందగా, 24 లక్షల మంది మహిళలు ఉద్యోగాలు మానేశారు. ఉద్యోగాల విషయానికొచ్చేసరికి మన దేశంలో మహిళలు చాలా ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిఎంఐఇ ఎమ్‌డి మహేష్ వ్యాస్ అన్నారు. యాడ్ ఏజెన్సీ మొదలుకుని నిర్మాణరంగం, దుకాణాలు, రెస్టారెంట్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, విమానాలు, ట్యాక్సీల్లో వారు పనిచేస్తున్నారు. అన్ని రంగాల్లోనూ గత కొన్నాళ్ల నుంచీ వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు.

జి20 దేశాల్లో మూడో స్థానం

జి20 దేశాల్లో మహిళలు ఇబ్బందులు ఎదర్కొంటున్న జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అత్యంత అధ్వాన స్థితిలో సౌదీ అరేబియా ఉండగా, తరువాత స్థానంలో పాకిస్తాన్, ఆ తరువాతి స్థానంలో భారత్ నిలిచినట్లుగా గతేడాది విడుదలైన నివేదికలో వెల్లడైంది. ఈ ఏడాది ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం కార్మిక శక్తిలో మహిళల శాతం(ఎఫ్‌ఎల్‌ఎఫ్‌పి) 34.8 శాతం నుంచి 27 శాతానికి పడిపోయింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు, గ్రాడ్యుయేట్లలోనే ఎఫ్‌ఎల్‌ఎఫ్‌పి రేటు ఎక్కువగా ఉంది. 2004-05, 2011-12 మధ్య కాలంలో ఈ రెండు గ్రూపుల్లోనూ ఉద్యోగాలు కోల్పోయిన మహిళలు ఎక్కువగానే ఉన్నారు.

ఇప్పట్లో పరిస్థితి మారేటట్లు లేదు..

అయితే ఈ పరిస్థితి ఇప్పట్లో మారేలా కనిపించట్లేదని నిపుణులు పేర్కొన్నారు. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో సంస్కరణల జోరు ఎక్కువైన నేపథ్యంలోనే మహిళలు ఉద్యోగాలు కోల్పోయినట్లుగా గణాంకాలు తెలుపుతున్నాయి. ఆ సమయంలో 2 కోట్ల 43 లక్షల మంది పురుషులు ఉద్యోగాలు పొందడం విశేషం. మరోవైపు యువతుల విద్యార్హతలు పెరగడంతో మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోవడం మానేయడం కూడా మరో కారణం. ప్రాథమిక స్థాయిలో వంద శాతం ఆడపిల్లలు పాఠశాలకు వెళ్తున్నారు. కానీ ఉన్నత విద్యకు వచ్చేసరికి వారి సంఖ్య పావు శాతం కంటే తక్కువకు పడిపోతుంది.

2002-03లో ఉన్నత విద్య అభ్యసించేవారు 7.5 శాతం ఉండగా...2012-13 నాటికి ఆ సంఖ్య 20 శాతానికి మాత్రమే పెరిగింది. ఈ లెక్కన శతశతానికి చేరుకోవాలంటే మనకు చాలా ఏళ్లు పడుతుంది.

పని కల్పించని విద్య

సాధారణంగా విద్య అనేది పని కల్పించేందుకు దోహదపడాలి. కానీ గ్రామాల్లో ఆ పరిస్థితి లేదు. 67 శాతం మహిళా గ్రాడ్యుయేట్లు ఉద్యోగాలు చేయట్లేదు. పట్టణాల్లో 68.3 శాతం మహిళా గ్రాడ్యుయేట్లకు అసలు ఉద్యోగాలు దొరకట్లేదు. అయితే వీళ్లంతా ఏం చేస్తున్నారని మనం ప్రశ్నించుకోవాలని అంతర్జాతీయ వృద్ధి కేంద్రం(ఐజిసి) గణాంకాల చీఫ్ ప్రణబ్ సేన్ పేర్కొన్నారు.

తగ్గుతున్న జిడిపి వాటా?

మరోవైపు ఉద్యోగాలకు మహిళలను దూరంగా ఉంచడంతో జిడిపిలో వారి వాటా తగ్గుముఖం పడుతుంది. ప్రపంచ సగటు 37 శాతం కాగా, మన దేశంలో అది 17 శాతంగా ఉండడం ఆందోళన చెందాల్సిన అంశం. ఇంటివద్ద చేసే పనులకు మహిళలకు డబ్బు రూపంలో చెల్లింపులు జరగవు. దీంతో వారు ఆర్థిక స్వేచ్ఛ పొందలేకపోతున్నారు. ఉద్యోగం చేసే మహిళలకు సమాజంలో గౌరవం కూడా పెరుగుతున్న సంగతి తెలిసిందే.

కారణాలేంటి?

సొంతంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ లేకపోవడం, వైద్య పరీక్షలకు వెళ్లాలన్నా కుటుంబసభ్యుల అనుమతి తీసుకోవాల్సి రావడం వంటివి ప్రధాన ప్రతిబంధకాలు కాగా, సామాజికంగా మహిళకు భద్రత కరువవ్వడం మరో కారణం. కొన్ని ప్రాంతాల్లో అయితే మహిళలు ఉద్యోగాల్లోకి వెళ్లడం నేరంగా కూడా పరిగణిస్తారు. పురుషాధిక్యత, వివాహం. కుటుంబసమస్యలు, ఇంట్లో పిల్లల బాధ్యత చూసుకోవాల్సి రావడం వంటి బాధ్యతలు మహిళలను ఇంటికే పరిమితం చేసేస్తున్నాయి. ఒక వేళ ఉద్యోగంలో చేరేందుకు మహిళలకు అనుమతి లభించినా ఇంట్లో వారు పెట్టే అన్ని షరతులకు వారు అంగీకరించాల్సి ఉంటుంది. చాలా మటుకు కంపెనీలు మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యతను ఇవ్వడానికి కారణం, వారు తక్కువ సెలవులు పెడతారు. ఇబ్బంది లేకుండా వ్యవహరిస్తారు. కానీ మిగిలిన పరిస్థితులు సహకరించకపోవడంతో మహిళా నియామకాలు అనుకున్నంతగా జరగట్లేదు.

'సెజ్'లపై కౌంటర్ దాఖలుకు ఆదేశం

విచారణను వాయిదా వేసిన సుప్రీం

న్యూఢిల్లీ: నిరుపయోగంగా వున్న సెజ్ భూములపై దాఖలైన కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. దేశవ్యాప్తంగా నిరుపయోగంగా పడివున్న 50 వేల ఎకరాలను తిరిగి రైతులకు ఇవ్వాలని కోరుతూ కాకినాడకు చెందిన సెజ్ రైతుల సంక్షేమ కమిటీ గతంలో పిటిషన్‌ను దాఖలు చేసింది. జస్టిస్ జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్‌ను విచారించింది. ఈ కేసు విచారణను ఎనిమిది వారాలు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. అంతేగాక కౌంటర్ పిటిషన్ దాఖలు చేసేందుకు రాష్ట్రాలకు నాలుగు వారాల గడువు ఇచ్చింది. కేంద్రం సెజ్‌లు కేటాయిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వాలు భూముల కేటాయిస్తున్నాయి. ఆ భూముల యజమానులు బ్యాంకుల్లో రుణాలు పొందుతున్నారు. ఇదంతా చూస్తుంటే ఓ పెద్ద కుంభకోణంలా ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని పిటిషన్‌దారు పేర్కొన్నారు. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ కూడా ఈ కేసులో తన వాదనలు వినిపించారు. "20 రాష్ట్రాలకు చెందిన 600 సంస్థలు ఈ సెజ్ వ్యవహారాల్లో భాగస్వామ్యమై ఉన్నాయి. పలు మంత్రిత్వ శాఖలకు కూడా సెజ్‌ల కేటాయింపుతో సంబంధం ఉంది. మంత్రిత్వ శాఖ కార్యదర్శి మినహా మిగిలిన వారందరినీ ప్రతివాదులుగా చేర్చాలి" అని సొలిసిటర్ జనరల్ కోరారు. అయితే ఆయన విజ్ఞప్తిని ధర్మాసనం తిరస్కరించింది. మరోసారి వివరణ ఇచ్చేందుకు వీలుగా కౌంటర్ దాఖలు చేసే అవకాశాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలని నిర్ణయించారు.

మహిళను వేధించారనే ఆరోపణలతో

బిజెపి హర్యానా అధ్యక్షుని కుమారునిపై కేసు నమోదు

ఛండీగఢ్: మహిళను వేధించారనే ఆరోపణలతో బిజెపి హర్యానా అధ్యక్షుడు సుభాష్ బరల కుమారుడు వికాస్ బరల(23)పై శనివారం కేసు నమోదైంది. వికాస్ స్నేహితుడు ఆశిష్ కుమార్(22)పై కూడా కేసు నమోదైంది. న్యాయ శాస్త్రాన్ని అభ్యసిస్తున్న వికాస్, ఆశిష్‌లు శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఛండీగఢ్‌లోని మధ్యమార్గ్ గుండా కారులో వస్తున్నారు. అదే సమయంలో కారు డ్రైవ్ చేసుకుంటూ వెళుతున్న మహిళను వారు వెంబడించారు. దీంతో ఆందోళన చెందిన ఆ మహిళ అర్థరాత్రి 12 గంటల 15 నిమిషాల ప్రాంతంలో పోలీసు కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేశారు. పేట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వైద్య పరీక్షలు నిర్వహించగా వారు మద్యం సేవించినట్లు తేలింది. ఐపిసి 354డి కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

దాడి చేసేది వారే... ఖండించేదీ వారే

గుజరాత్ ఘటనపై రాహుల్ విమర్శ

న్యూఢిల్లీ: 'ఇదీ బిజెపి, ప్రధాని మోడీల రాజకీయం. ఈ ఘటనకు పాల్పడింది వారే. తిరిగి వారే ఖండిస్తున్నారు.' అని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. వరద బాధిత ప్రాంతాల్లో పర్యటనల్లో భాగంగా గుజరాత్ వెళ్లిన ఆయనపై శుక్రవారం దాడి జరిగిన సంగతి తెలిసిందే. పలువురు వ్యక్తులు ఆయన కాన్వాయ్‌పై రాళ్లు రువ్వారు. రాహుల్‌గాంధీ ముందుగా తాను ప్రయాణించే బుల్లెట్ ప్రూఫ్ కారులో కూర్చోవాలను కున్నప్పటికీ, కాన్వాయ్‌లో ముందు వరసలో ఉన్న కారులో కూర్చున్నాడు. కారులో ప్రయాణిస్తుండగా ఈ దాడి జరిగింది. వెంటనే భద్రతా దళాలు అప్రమత్తం కావడంతో రాహుల్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. దీన్ని పిరికి పందల చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ ఘటన నేపథ్యంలో భనస్కాంతలోని ధనేరాకు చెందిన స్థానిక బిజెపి నేతను పోలీసులు అరెస్టు చేశారు. దాడి నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ, అహ్మదాబాద్‌తో పాటు పలు నగరాల్లో నిరసన తెలిపారు. రాహుల్‌పై రాళ్లదాడిని సీనియర్ కాంగ్రెస్ నేత, రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ ఖండించారు. ఉద్దేశ్యపూర్వకంగా ప్రణాళిక ప్రకారం ఈ దాడి చేశారన్నారు.

ఘటనపై కాంగ్రెస్ ధ్వజం

రాహుల్ గాంధీపై దాడి జరగడంపై కాంగ్రెస్ మండిపడుతోంది. ఇది పిరికి పందల చర్య అనీ, బిజెపి గూండాలే ఈ దాడికి పాల్పడ్డారనీ ఆ పార్టీ విమర్శించింది. రాహుల్ పర్యటనకు ముందు ముఖ్యమంత్రి రూపాని మాట్లాడుతూ ఆపత్కాలంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. రాహుల్‌ను ప్రజలే నిలదీస్తారని రూపాని అంతకు ముందు ట్విట్టర్‌లో పేర్కొవడం గమనార్హం.

గుజరాత్ సిఎం ఖండన

రాహుల్‌గాంధీపై జరిగిన దాడిని గుజరాత్ ముఖ్యమంత్రి విజయ్‌రూపాని ఖండించారు. దురదృష్టకరమైన సంఘటనగా దీన్ని అభివర్ణించారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. డిజిపి స్థాయి అధికారితో విచారణ జరిపిస్తున్నట్లు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

నిందితుడు బిజెపి యువజన కార్యదర్శి

రాహుల్‌గాంధీపై రాళ్లదాడి చేసిన ఒక వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. బనస్కాంత జిల్లా ఎస్పీ నీరజ్ బద్గుజార్ మాట్లాడుతూ నిందితుడు జయేష్ దర్జి అలియాస్ అనిల్ రాథోడ్‌గా గుర్తించామన్నారు. స్థానిక బిజెపి యువజన కార్యాలయ పర్యవేక్షకుడని తెలియజేశారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ బనస్కాంత జిల్లా బిజెపి కార్యాలయానికి యువజన కార్యదర్శిగా ఉన్నాడన్నారు. అయితే ఈ కేసులో నిందితునితోపాటు మరో ముగ్గురు కూడా ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పృధ్విరాజ్ కత్వాడియా విమర్శించారు.

జిఎస్టీపై న్యాయ పోరాటం

కేంద్ర వైఖరి ఏకపక్షం : కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఎస్టీ అమలులో మొదటి నుంచి కేంద్ర ప్రభుత్వానికి బాసటగా నిలిచిన తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఒక్కసారిగా స్వరం మార్చారు. జిఎస్టీ విధానం అమలులో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష వైఖరికి వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలో శనివారం జరిగిన జిఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఆ సమావేశానికి హాజరైన మంత్రి కెటిఆర్, సీనియర్ అధికారులతో సిఎం చర్చించారు. ఈ విషయంలో ప్రధానికి ఆదివారం లేఖ రాయాలని నిర్ణయించారు. నీటి పారుదల, మంచినీటి పథకాలు, గృహ నిర్మాణం, రహదారుల నిర్మాణం వంటి కార్యక్రమాలకు జిఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు జిఎస్టీని 12 శాతం వర్తింపజేయాలని కేంద్రం నిర్ణయించడం అన్యాయమన్నారు. జులై ఒకటికి ముందు ప్రారంభించిన ప్రాజెక్టులకు జిఎస్టీ వర్తింపజేయడం వల్ల తెలంగాణకు రూ.19 వేల కోట్ల నష్టం వస్తుందని సిఎం పేర్కొన్నారు. బడ్జెట్ తరువాత నిర్ణయం కావడం వల్ల అమలు చేయలేమన్నారు.

ఉప రాష్ట్రపతిగా వెంకయ్య

(మొదటి పేజీ తరువాయి)

6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించామని వివరించారు. అంతకు ముందు అందరి సమక్షంలోనే బ్యాలెట్ బాక్సు సీల్ విప్పామని, మొదటగా చెల్లిన, చెల్లని ఓట్లును వేరు చేశామని, అనంతరం మొదటి ప్రాధన్యత ఓట్లు వేరు చేశామని తెలిపారు. 381 మ్యాజిక్ ఫిగర్ కాగా, 516 ఓట్లతో వెంకయ్య నాయుడు విజయం సాధించారని వెల్లడించారు. ప్రస్తుత ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ పదవీ కాలం ఈ నెల 10తో ముగియనుంది. దీంతో ఆగస్టు 11న వెంకయ్య 13వ ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఓటింగ్ గైర్హాజరైన ఎంపిలు

ఉప రాష్ట్రపతి ఎన్నికల ఓటింగ్‌కు 14 మంది పార్లమెంటు సభ్యులు గైర్హాజరయ్యారు. ఓటింగ్‌లో పాల్గొనని ఎంపిలలో బిజెపి చెందిన ఇద్దరు...విజయ్ గోయల్, సన్వర్ లాల్ జాట్ , కాంగ్రెస్ కు చెందిన ఇద్దరు.. మౌసమ్ నూర్, రాణీ నరా, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్)కు చెందిన ఇద్దరు.. అబ్దుల్ వహబ్, పికె కున్హాలి కుట్టి ,టిఎంసి నుంచి నలుగురు.. కున్వల్ కుమార్ ఘోష్, తపస్ పాల్, ప్రతిమా మోండల్, అభిషేక్ బెనర్జీ , ఎన్‌సిపి చెందిన ఉద్యానరాజే భోంస్లే, పిఎంకెకు చెందిన అన్బుమణి రామ్‌దాస్ , ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు అను ఆఘా, నబా కుమార్ సరానియాలు వున్నారు.

మోడీ శుభాకాంక్షలు

13వ ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీ కాలం ఆదర్శవంతంగా ఉంటుందని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మోడీ ట్వీట్ చేశారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తదితరులు వెంకయ్యకు ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలిపారు.

ఏచూరి అభినందనలు

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడుకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్ కూడా వెంకయ్యకు అభినందనలు తెలిపారు.

రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటా: వెంకయ్య

తనను ఉపరాష్ట్రపతిగా గెలిపించిన అందరికీ ధన్యవాదాలని, రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉంటానని ఉపరాష్ట్రపతిగా గెలుపొందిన వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ఉన్నత విలువలకు కట్టుబడి, రాజ్యాంగాను సారం నడుచుకుంటానని హామీ ఇస్తున్నానని అన్నారు.

గోపాలకృష్ణ గాంధీ అభినందనలు

ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వెంకయ్య నాయుడుకు పలువురు అభినందనలు చెబుతున్నారు. ఫలితం వెలువడిన వెంటనే గోపాలకష్ణ గాంధీ మీడియాతో మాట్లాడారు. వెంకయ్యనాయుడుకు అభినందనలు చెప్పారు. తనకు మద్దతు పలికిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు.

మూడో తెలుగు వ్యక్తి

ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన తెలుగు వారిలో వెంకయ్య నాయుడు మూడో వ్యక్తి. 1952లో సర్వేపల్లి రాధాకష్ణన్ తొలిసారిగా ఈ పదవిని అధిష్టించి రెండు పర్యాయాలు ఆ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. కాగా, 1967లో మరో తెలుగు ప్రముఖుడు వరాహగిరి వెంకటగిరి కూడా ఉపరాష్ట్రపతిగా విజయం గెలుపొంది, అనంతరం ఆయన కూడా రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 1977లో మరో తెలుగు ప్రముఖుడు నీలం సంజీవరెడ్డి ఏకగ్రీవంగా రాష్ట్రపతి పదవికి ఎంపికయ్యారు.

మహారాష్ట్ర మంత్రిపై కొత్త అవినీతి ఆరోపణలు

ముంబయి : మహారాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి ప్రకాష్ మెహత కొత్త ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఘత్కోపార్ నియోజవర్గంలో మురికివాడల అభివృద్ధి కార్యక్రమంలో ప్రకాష్ మెహత, అతని కుటుంబ సభ్యులు అవినీతికి పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ తాజాగా ఆరోపించింది. దక్షిణ ముంబయిలో జరిగిన మురికివాడల అభివృద్ధిలోనూ ప్రకాష్ మెహత నిబంధలను అతిక్రమించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. మంత్రి అవినీతిపై అసెంబ్లీలో ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేశాయి. 'ఘత్కోపార్‌లో మెహతకు చెందిన శ్రీసాయి నిధి ప్రైవేట్ లిమిటెడ్ మురికివాడల అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టింది. లబ్ధిదారులకు ఇప్పటికీ ఇళ్లను అందచేయలదు' అని కాంగ్రెస్‌కు చెందిన రాధాకృష్ణ విఖే పాటిల్ విమర్శించారు. బిజెపి సభ్యుల నినాదాలతో రాధాకృష్ణ తన ప్రసంగాన్ని పూర్తి చేయలేకపోయారు. 'విఖే పాటిల్ సభకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ప్రకాష్ మెహతా అంశాన్ని లేవనెత్తారని' బిజెపి నేత, ఆర్థిక మంత్రి సుధీర్ ముగ్నతివార్ వాదనకు దిగారు. మెహతను మంత్రివర్గం నుంచి తొలగించాలని, అతనిపై వచ్చిన ఆరోపణలపై ముఖ్యమంత్రి విచారణ జరిపించాలని ఎన్‌సిపి ఎమ్మెల్యేలు జయంత్ పాటిల్, అజిత్ పవార్ డిమాండ్ చేశారు. తనపై వస్తున్న ఆరోపణలను ప్రకాష్ మెహత ఖండిస్తున్నారు. తాను మంత్రి కాక ముందు శ్రీసాయి నిధి ప్రైవేట్ లిమిటెడ్‌లో డైరెక్టర్‌గా పనిచేశానని తెలిపారు.

ఒకే హోదా- ఒకే పింఛన్ కోసం

ఆగస్టు 9న నిరసనలకు పిలుపు

న్యూఢిల్లీ: మాజీ సైనికోద్యోగులకు కూడా 'ఒకే హోదా- ఒకే పింఛన్' అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 9న ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద నిరసనలు తెలపనున్నట్లు మాజీ సైనికోద్యోగుల సంఘం ముఖ్య కార్యదర్శి రణబీర్ సింగ్ తెలిపారు. 'ఒకే హోదా- ఒకే పింఛన్', పాత పింఛన్ విధానాలు అమలు వంటి వివిధ డిమాండ్లతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగులందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. సాయుధ దళాల్లో మృతిచెందిన వారికి ప్రత్యేక పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కర్ణాటక మంత్రి ఇంటిపై ఆదాయ పన్ను శాఖ దాడులు

రూ. 11 కోట్లు స్వాధీనం

బెంగళూరు : కర్ణాటక మంత్రి డికె శివకుమార్ ఇంటిపై ఆదాయ పన్ను శాఖ అధికారులు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు సాగిన ఈ దాడులు శనివారం ఉదయంతో ముగిసాయి. బుధవారం ఈ దాడులు ప్రారంభమయ్యాయి. ఈ నాలుగు రోజుల వ్యవధిలో కర్ణాటక, ఢిల్లీలో వున్న 60కు ప్రదేశాల్లో ఈ దాడులు జరిగాయి. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో గుజరాత్‌కు చెందిన 43 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు అత్యంత విలాసవంతమైన రిసార్ట్‌లో డికె శివకుమార్ ఆతిథ్యం ఇచ్చాడు. ఈ నేపథ్యంలో మంత్రిని అధికారులు విచారిస్తున్నారు. మంత్రికి చెందిన 60 ప్రదేశాల్లో సుమారు 11 కోట్లకు పైగా రూపాయిలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. తాను చట్టాలను, రాజ్యాంగాన్ని ఉల్లంఘించేవాడిని కాదని, నిజాలు త్వరలోనే బయటకు వస్తాయని మీడియాతో మాట్లాడుతూ మంత్రి తెలిపారు.

సిబిఐతో విచారణ జరిపించండి

విద్యార్థి నేత హత్యకేసులో అస్సాం ప్రభుత్వం



డిస్పూర్: అస్సాంలోని కోక్రజార్‌లో జరిగిన విద్యార్థి నాయకుడు అహ్మద్ హత్యకేసులో సిబిఐతో విచారణ జరిపించాలని రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఇప్పటికే ఆ రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.ఆయన గతంలో జాతీయ దర్యాప్తు బృందంలో, 'బిటిసి' మైనార్టీ యూనియన్‌లకు ఆయన అధ్యక్షుడిగా పనిచేశారు.

పాక్ చొరబాట్లను తిప్పికొడుతున్న సైన్యం: జైట్లీ

న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల చొరబాట్లుకు పాకిస్తాన్ చేస్తున్న యత్నాలను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతుందని కేంద్ర రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. సరిహదుల్లో శత్రువుపై పైచేయి సాధించే వ్యూహాన్ని సైన్యం అనుసరిస్తోందని, సరిహద్దుల గుండా చొరబాట్లను కట్టడి చేసేందుకు అన్ని చర్యలూ చేపట్టినట్లు లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి తెలిపారు. నిఘా పెరగడం వలన అనేక చొరబాటు యత్నాలు విఫలమయ్యాయని వివరించారు. నియంత్రణ రేఖ వెంబడి ఈ ఏడాది ఇప్పటి వరకూ 285 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ దళాలు ఉల్లంఘించాయని జైట్లీ తెలిపారు.



చైనాలో అవినీతి అధికారికి 14 ఏళ్ళ జైలు శిక్ష

షాంఘై : పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన మాజీ చైనా డెవెలప్‌మెంట్ బ్యాంక్ సూపర్‌వైజరీ బోర్డు ఛైర్మన్ యావో జోంగ్మిన్‌కు 14 ఏళ్ళు జైలు శిక్ష విధించినట్లు చైనా అవినీతి దర్యాప్తు సంస్థ (సిసిఐడి) తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. జైలు శిక్షతో పాటు 3.5 మిలియన్ యువాన్లు(520,276 అమెరికన్ డాలర్లు) జరిమానాకూడా విధించినట్లు తెలిపింది. యావో జోంగ్మిన్ 2002-2013 మధ్య కాలంలో తన సోదరుని ద్వారా ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని దాదాపు 36.2 మిలియన్ యువాన్‌లు లంచాలు తీసుకున్నట్లు సిసిడిఐ తెలిపింది. వివిధ రకాల రుణాలు, ఇతర కాంట్రాక్టు వర్క్‌లు మంజూరు చేసినందుకు గాను లంచాలు తీసుకున్నట్లు వెబ్‌సైట్ పేర్కొంది.

పారిస్ ఒప్పందం నుంచి వైదొలుగుతున్నాం
ఐరాసకు అధికారికంగా తెలిపిన అమెరికా



వాషింగ్టన్ : పారిస్ ఒప్పందం నుంచి వైదొలగనున్నట్లు అమెరికా ఐక్యరాజ్య సమితికి అధికారికంగా తెలిపింది. కాని తన కోసం ఒప్పందం నిబంధనలను మెరుగుపరిస్తే అందులో కొనసాగుతానని తెలిపింది. ఈ మేరకు అమెరికా దేశీయాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. పారిస్ ఒప్పందం నుంచి వైదొలిగే ప్రక్రియలో కొనసాగుతున్నప్పటికీ వాతావరణ మార్పుపై ఐక్యరాజ్య సమితి నిర్వహించే సమావేశాలలో పాల్గొంటుందని ఆ ప్రకటన పేర్కొంది.

ఉత్తర కొరియాపై ఆంక్షలు విధించిన భద్రతా మండలి

ఐక్యరాజ్య సమితి : ఉత్తర కొరియాపై ఆంక్షలను కఠినతరం చేస్తూ అమెరికా రూపొందించిన ముసాయిదా తీర్మానానికి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి శనివారం ఓటు వేసే అవకాశముందని దౌత్యవేత్తలు తెలిపారు. ఉత్తర కొరియా తన వార్షిక రాబడిలో 1 బిలియన్ డాలర్ల రాబడిని కోల్పోయే విధంగా కొన్ని ఎగుమతులపై నిషేధం విధిస్తూ అమెరికా ముసాయిదా తీర్మానాన్ని రూపొందించింది. ఈ తీర్మానంపై ఉత్తర కొరియా ప్రధాన వ్యాపార భాగస్వామి అయిన చైనాతో దాదాపు నెల రోజులపాటు అమెరికా చర్చించింది.క్షిపణి, అణు పరీక్షలను నిలిపివేసేలా ఉత్తర కొరియాపై ఒత్తిడి తెచ్చే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా తెలిపింది. కొత్త ఆంక్షలకు సంబంధించిన తీర్మానంపై శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఓటు భద్రతా మండలిలో ఓటింగ్ జరుగుతుందని దౌత్య వేత్తలు ధృవీకరించారు. బొగ్గు, ఇనుము, ముడి ఇనుము, సీసంతో పాటు చేపలు, సముద్రపు ఆహారం ఎగుమతులపై నిషేధం విధిస్తున్నట్లు ముసాయిదా తీర్మానంలో పేర్కొన్నారు. ఈ తీర్మానాన్ని అన్ని దేశాలు అమలు చేస్తే ఎగుమతులపై ఏడాదికి సగటున ఉత్తర కొరియాకు లభించే ఆదాయంలో మూడో వంత నష్టపోతుందని దౌత్యవేత్త ఒకరు తెలిపారు.

ప్రారంభం కానున్న విదేశాంగ మంత్రుల సమావేశం

మనీలా : ఉత్తర కొరియా నిర్వహిస్తున్న దూర శ్రేణి క్షిపణి పరీక్షలపై ఆగ్నేయాసియా దేశాలకు చెందిన విదేశాంగ మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తన అణు కార్యక్రమంపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలకు ఉత్తర కొరియా కట్టుబడి ఉండాలని ఆగ్నేయాసియా దేశాలు చెప్పాయి. ప్రాంతీయ శాంతి కోసం సానుకూలంగా వ్యవహరించాలన్నాయి. సహజంగా విదేశాంగ మంత్రుల సమావేశం ముగిసిన తరువాత ఆగ్నేయాసియా దేశాల కూటమి ఉమ్మడిగా ఒక ప్రకటన జారీ చేస్తుంది. దానికి భిన్నంగా విదేశాంగ మంత్రులు వేరుగా ప్రకటన జారీ చేశారు. ఆగ్నేయాసియా దేశాల విదేశాంగ శాఖ మంత్రుల వార్షిక సమావేశం సోమవారం జరగనున్నది.

వెనిజులా నూతన రాజ్యాంగ అసెంబ్లీ సమావేశంప్రారంభం

కారకస్ : అమెరికా, వాటికన్‌ల నుంచి వస్తున్న విమర్శలను తోసిపుచ్చుతూవెనిజులాలో అధికార పార్టీ శుక్రవారం జాతీయ రాజ్యాంగ అసెంబ్లీ (ఎఎన్‌సి) సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇది శాశ్వత సభగా నిలబడనున్నది. దేశంలో శాంతి పునరుద్ధరణకు, ప్రజలు ఆశిస్తున్న విధంగా సమస్యలను పరిష్కరించేందుకు, చట్టం, న్యాయం అమలయ్యేందుకు ఎఎన్‌సి ఒక శాశ్వత సభ కానున్నదని రాజ్యాంగ అసెంబ్లీ డిప్యూటీ జువాన్ కార్లోస్ అలమన్ తెలిపారు. ఈ చర్యలతో పాటు దాదాపు వందమంది పౌరుల మృతికి కారణమైన ఆందోళనకు కళ్ళెం వేయడంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిష్క్రియాపరత్వంపై కూడా వెంటనే సమీక్షిస్తామని స్థానిక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆలమన్ తెలిపారు.

ప్రతిపక్షంలో ఉన్న వైరుధ్యాలను ప్రస్తావిస్తూ ప్రజలకు సేవ చేయాలన్న తమ లక్ష్యం పట్ల అసెంబ్లీ సభ్యులు స్పష్టంగా ఉన్నారని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఇది ఒక చక్కని అవకాశమని ఆయన చెప్పారు. ప్రైవేటు వ్యాపార రంగం చేస్తున్న ఆర్థిక యుద్ధాన్ని ఆపేందుకు కూడా తోడ్పడుతుందన్నారు. అంతకు మించి హ్యూగో ఛావెజ్ వారసత్వాన్ని కాపాడుకుంటూ , సోషలిస్టు యంత్రాంగాన్ని రాజ్యాంగ బద్ధం చేసేందుకు, శాంతిని ఏకీకృతం చేసేందుకు, 8 లక్షల మంది ప్రజలు ఎఎన్‌సిని ఎన్నుకున్నారని చెప్పారు. కారకస్‌లోని నేషనల్ అసెంబ్లీలో ఉన్న ఎలిప్టికల్ హాల్‌లో ఎఎన్‌సి ఏర్పాటు ఉత్సవాలు జరిగాయి. దీనికి ముందుగా అధికార పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు.

వెనిజులా చేరుకున్న 272 కంటెయినర్ల ఆహారం

దాదాపు 272 కంటెయినర్లలో ఆహార పదార్థాలు, మందులు, వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన ఉత్పత్తులు బుధవారం వర్గాస్ రాష్ట్రంలోని లాగుయ్‌రా పోర్టుకు చేరుకున్నాయి. గ్రేట్ సావరిన్ సప్లై మిషన్ తీసుకున్న చర్యల్లో భాగంగా ఆహార పదార్థాలు సరఫరా అయ్యాయి. కొలంబియా నుంచి ఈ ఆహార పదార్థాలు వెనిజులాకు చేరుకున్నాయి.

ఇందులో 203 కంటెయినర్ల ఆహార పదార్థాలు, 53 కంటెయినర్ల మందులు, 16 కంటెయినర్ల వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన ఉత్పత్తులు ఉన్నాయి.



చమురు కోసమే, విధ్వంసానికి అమెరికా ప్రణాళిక : వికీలీక్స్

వెనిజులా పట్ల అమెరికా ఆసక్తి ప్రదర్శించడానికి కారణం అక్కడ ఉన్న చమురు కోసమేనని వికీలీక్స్ ట్వీట్ చేసింది. ఈ విషయాన్ని కొన్ని దశాబ్దాల క్రితమే తాము వెల్లడించినట్లు తెలిపింది. నిర్ణయాత్మక రాజకీయాలు, వెనిజులా పట్ల అమెరికా మౌలిక ఆసక్తులు అనే పేరుతో దశాబ్దాల క్రితమే ఈ అంశాన్ని వెల్లడించినట్లు పేర్కొంది. "పెట్రోలు సరఫరాను వెనిజులా కొనసాగిస్తుంది. ఒపెక్ (ఒపిఇసి)లో బాధ్యతాయుతమైన చమురు ధరను అనుసరించడాన్ని కూడా కొనసాగిస్తుంది." అని అప్పట్లో వికీలీక్స్ విడుదల చేసిన డాక్యుమెంట్ పేర్కొంది. ఈ వైఖరి ఇప్పటికి కూడా మారలేదు. అమెరికా ఉత్పత్తి మందగించిన సంకేతాలు వెలువడిన కారణంగా ఈ వారం చమురు ధరలు పెరిగాయని, వెనిజులాపై అమెరికా ఆంక్షలు విధించే అవకాశముందని ఒపెక్ సభ్యులు ఒకరు తెలిపారు.

చైనా, రష్యాల మధ్య పెరగనున్న గ్యాస్ వాణిజ్యం

బీజింగ్ : సహజ గ్యాస్ వినియోగాన్ని పెంచాలనుకుంటున్న చైనా ప్రణాళిక, రష్యా భౌగోళిక ప్రయోజనాలు కలిసి రెండు దేశాల మధ్య కొనసాగుతున్న సహజ గ్యాస్ వాణిజ్యం రానున్న సంవత్సరాలలో మరింత పెరుగుతుందని నిపుణులు పేర్కొన్నారు. చైనాకు చెందిన గెజ్‌హౌబా గ్రూపు కార్పొరేషన్, రష్యాకు చెందిన గజ్‌ప్రోమ్ గ్యాస్ ఇండస్ట్రీ కలిసి ఉమ్మడిగా చేపట్టిన అమూర్ నేచురల్ గ్యాస్ ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రాజెక్టు నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. చైనా-రష్యా నేచురల్ గ్యాస్ తూర్పు పైప్‌లైన్ ఏర్పాటుకు ఈ కర్మాగారం ప్రధాన వనరు కానున్నదని చైనాకు చెందిన గెజ్‌హౌబా గ్రూపు కార్పొరేషన్ తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే సహజ గ్యాస్ ప్రాసెసింగ్ సామర్థ్యం 42 బిలియన్ క్యూబిక్ మీటర్లకు, వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 6 మిలియన్ క్యూబిక్ మీటర్లకు పెరుగుతుందని, ఇది ప్రపంచంలోనే అతి పెద్ద నేచురల్ గ్యాస్ ప్రాసెసింగ్ కర్మాగారమవుతుందని వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. సహజ గ్యాస్ సరఫరా, మౌలిక సదుపాయాల నిర్మాణానికి సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా సహజ గ్యాస్ వాణిజ్యాన్ని పెంచుకునేందుకు చైనా, రష్యా దేశాలు ప్రయత్నిస్తున్నాయి.

కాంగోలో వందలాది మంది పౌరుల హత్య
వెల్లడించిన ఐరాస నివేదిక

జెనీవా : కాంగోలోని కసాయ్ ప్రాంతంలో ఈ ఏడాది మార్చి-జూన్ మధ్య కాలంలో దాదాపు 250 మంది అసాధారణ, రీతిలో హత్యకు గురయ్యారని ఐక్య రాజ్య సమితి (ఐరాస) నివేదిక వెల్లడించింది. డజన్ల సంఖ్యలో పిల్లలు ఊచకోతకు గురయ్యారని తెలిపింది. ఈ హత్యలతో పాటు పలు హింసాత్మక ఘటనలకు కాంగోలో ప్రభుత్వ మద్దతున్న బనమురా తీవ్రవాదులతో పాటు, ప్రభుత్వ వ్యతిరేక కామునా నసాపు మిలిటెంట్లు కారణమని ఆ నివేదిక పేర్కొంది. తరుచూ ఘర్షణలు జరుగుతున్న కసాయి ప్రాంతం నుంచి అంగోలాకు వలస వెళ్ళిన పలువురు శరణార్థులతో జరిపిన ఇంటర్వ్యూల ఆధారంగా నివేదికను రూపొందించినట్లు ఐరాస తెలిపింది. ఈ హింసాత్మక సంఘటనలకు సంబంధించి భయానక విషయాలను శరణార్థులు వెల్లడించినట్లు ఐరాస పేర్కొంది. కాంగోలో పెరిగిపోతున్న, ప్రజలను కలవరపెడుతున్న జాతిపరమైన వైషమ్యాలకు ఈ హత్యలు నిదర్శనమని ఐరాస హెచ్చరించింది.

అక్కడ జరిగిన హింసాత్మక సంఘటనలను శరణార్థులు ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకున్నారు. ఒక ఏడేళ్ళ బాలుడి చేతి వేళ్ళు తెగ నరికారని, సమీప గ్రామంలోని ఒక ఆసుపత్రిపై దాడి చేసి 90 మందిని హతమార్చారని, మిలిటెంట్లు జరుపుతున్న కాల్పుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పలువురు గాయపడిన విషయాన్ని వారు వెల్లడించారు. కాల్పులతో సజీవ దహనమవుతున్న ప్రజల రోదనలు తమను ఎంతో కలిచి వేశాయని చెప్పారు. మిలిటెంట్లు జరుపుతున్న కాల్పులకు భయపడి పారిపోతున్న తమ బంధువులు, మిత్రులను వెంటాడి నరికిన దృశ్యాలను ఐరాస బృందానికి శరణార్థులు వెల్లడించారు. దాదాపు 96 మంది శరణార్థులను ఇంటర్వ్యూ చేసినట్లు ఐరాస నివేదిక తెలిపింది. మార్చి 12 నుంచి జూన్ 19 మధ్య కాలంలో దాదాపు 251 మందికి మరణశిక్ష విధించినట్లు దర్యాప్తు బృందం ధృవీకరించింది. వీరిలో 62 మంది పిల్లలు కాగా వారిలో 30 మంది ఎనిమిదేళ్ళ లోపు వారు కావడం విశేషం.



ఐసిస్‌పై పోరాడతాం: హిజ్బుల్లా

బీరుట్ : సిరియా-లిబియా సరిహద్దుపై ఉన్న ఐసిస్ స్థావరంపై షియత్ గ్రూపు పోరాడనున్నదని హిజ్బుల్లా నేత సయ్యద్ నస్సాన్ నసరల్లా తెలిపారు. ఈ పోరాటం ఇంకా కొద్ది రోజుల్లోనే ప్రారంభమవు తుందని తెలిపారు. లెబనాన్ వైపు ఉన్న సరిహద్దు నుంచి లెబనీస్ సైన్యం ఐసిస్‌పై దాడి జరుపుతున్న సమయంలో, సిరియా సైన్యం, హిజ్బుల్లాలు ఒకేసారి సిరియావైపు నుంచి దాడి జరుపు తాయని నసరల్లా తెలిపారు. దీనిపై ఆయన ప్రసంగాన్ని స్థానిక టెలివిజన్ ప్రసారం చేసింది. యుద్ధా న్ని నివారించి చర్చల ద్వారా పరిష్క రించు కునేందుకు ఐసిస్‌కు తలుపులు తెరిచే ఉన్నాయని ఆయన చెప్పారు. పలువురు లెబనీయులు ఐసిస్ వద్ద బందీలుగా ఉన్న సంగతి తెలిసిందే. సిరియా అధ్యక్షులు బషర్ అల్ అస్సాద్‌కు హిజ్బుల్లా కీలక మిత్రురాలు. వాయువ్య సిరియాలోని రెబల్స్ అధీనంలో ఉన్న ప్రాంతం కోసం ఒప్పందం ప్రకారం నస్రా ఫ్రంట్ మిలిటెంట్లను పక్కనే ఉన్న స్థావరానికి హిజ్బుల్లా బలవంతంగా తరలించింది. ఇందులో లెబనాన్ సైన్యం పాల్గొనలేదు. కాని ఐసిస్‌పై జరిపే దాడికి నేతృత్వం వహించే అవకాశముంది. లెబనాన్‌లో దాడి బాధ్యత సైన్యానిదేనని నసర్లా తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

చిత్తూరులో ఘోర ప్రమాదం

ఉన్నారు. ఘటనా స్థలాన్ని కలెక్టర్ ప్రద్యుమ్న, చిత్తూరు ఎస్‌పి రాజశేఖర్‌బాబు పరిశీలించారు. మృతుల వివరాలను ఢిల్లీలోని స్పెయిన్ దేశ రాయబారి కార్యాలయానికి పంపిస్తామని తెలియజేశారు.

స్పెయిన్ దేశం బార్సిలోనాకు చెందిన 13 మంది భారతదేశంలోని గ్రామాల అభివృద్ధిని పరిశీలించేందుకు వచ్చారు. అనంతపురం జిల్లా బత్తలపల్లి ఆర్‌డిటి సంస్థను పరిశీలించారు. అక్కడనుంచి టెంపో ట్రావెలర్‌లో బత్తలపల్లి నుంచి తమిళనాడు రాష్ట్రం తిరుమణ్ణామలైను సందర్శించడానికి బయల్దేరారు. శనివారం ఉదయం 9:30-10 గంటల మధ్య యాతాలవంక మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కంటైనర్.. ట్రావెలర్ టెంపోను ఢీకొంది. టెంపో డ్రైవర్ సైషావల్లీతోపాటు స్పెయిన్ దేశస్తులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మదనపల్లి డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి ప్రత్యేక చొరవతో క్షతగాత్రులను మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరో ఇద్దరు స్పెయిన్ వాసులు మృతి చెందారు. మృతుల పేర్లు ఇవీ.. పురుషులు ఫిరోజ్‌మోరినోవిసెంట్ (50), పెట్రోస జిజాన్ ఫ్రాన్సిస్కో (31), మహిళలు లుపిజ్‌నవరోమారియానివిస్ (62), మోరన్ మోలినిలో జోషిపా (60). వైద్యుల సూచన మేరకు క్షతగాత్రులైన తొమ్మిదిమందిని బెంగుళూరులోని ఎపిఎన్ కొలెంబో ఆస్పత్రికి తరలించారు.

గరగపర్రు దళితులకు సర్కారు వెన్నుపోటు

230 కుటుంబాలకే పరిహారం ప్రకటించింది. కుటుంబానికి రూ.లక్ష చొప్పున రూ.2.30 కోట్లు విడుదల చేసింది. 130 కుటుంబాలకు తీరని అన్యాయం చేసింది. ఇప్పటికీ గ్రామంలో సాంఘిక బహిష్కరణ కొనసాగుతూనే ఉన్నా చర్యలు లేకుం డా పోయాయి. ఇప్పుడు పరిహారంపై ప్రభుత్వం నిర్ణయం దళితులను మరింత దెబ్బతీసేదిగా తయారైంది. అన్ని కుటుంబాలకూ పరిహారం అందిస్తే తప్ప కొద్దిపాటి పరిహారం తీసుకునే ప్రసక్తే లేదని దళితులు గట్టిగా చెబుతున్నారు. దీనిపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం పునరాలోచిస్తుందా? లేదా? అనేది వేచి చూడాల్సి ఉంది.

ఆధార్ కు 14 వరకు ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకంలో కూలీల వేతనాల్ని ఖాతాల్లో నేరుగా జమ చేయడంలో సమస్యలేర్పడుతున్నందున ఆధార్ అనుసంధానానికి గాను ప్రత్యేక శిబిరాల్ని ఇప్పటికే ప్రారంభించామని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఈ శిబిరాలు 14 వరకు కొనసాగుతాయన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 98 శాతం మంది కూలీల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం పూర్తయ్యిందని సంయుక్త కమిషనర్ బాలసుబ్రమణ్యం తెలిపారు.

నేడు, రేపు గ్రూప్-3 మెయిన్స్ పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల్లో చోటు చేసుకున్న గందరగోళం నేపథ్యంలో పంచాయతీరాజ్ సెక్రటరీ పోస్టులకు సంబంధించి (గ్రూప్-3) మెయిన్స్ పరీక్షలకు ఎపిపిఎస్‌సి విస్తృత ఏర్పాట్లు చేసింది. జిల్లాల వారీగా రెండు విడతల్లో రెండు రోజుల పాటు ఈ మెయిన్స్‌ను 6న తొమ్మిది జిల్లాల అభ్యర్థులకు, 7న నాలుగు జిల్లాల అభ్యర్థులకు నిర్వహించనున్నారు. 1055 పంచాయతీరాజ్ సెక్రటరీ పోస్టులకుగాను 5,66,215 మంది దరఖాస్తు చేసుకోగా, ఏప్రిల్ 23న జరిగిన స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో 1:50 చొప్పున 52,750 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారు.

వీరిలో శ్రీకాకుళం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల వారికి (35,150 మందికి) ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు రెండో పేపర్‌కు పరీక్ష జరగనుంది. మిగిలిన విజయనగరం, తూర్పుగోదావరి, నెల్లూరు, కర్నూలు జిల్లాల అభ్యర్థులకు (17,600 మందికి) సోమవారం మెయిన్స్ నిర్వహించనున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కార్డును తీసుకురావాలని అధికారులు సూచించారు. ఉదయం 8 గంటల నుంచి 8:45 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని, ఆ తరువాత నిమిషం లేటైనా అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. బయోమెట్రిక్ నమోదు చేస్తామని, మహిళా అభ్యర్థులు చేతికి మెహందీ వంటివి పెట్టుకుని హాజరుకావద్దని సూచిస్తున్నారు. అభ్యర్థులు పరీక్షా హాల్ నుంచి బయటకు రాకూడదని, ఇన్విజిలేటర్ అనుమతిలేకుండా బయటకు వస్తే, తిరిగి పరీక్షా హాల్‌లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

నిరుద్యోగ భృతి, ప్రత్యేక హోదా కోసం
రేపు కలెక్టరేట్ల వద్ద ఆందోళన

- యువజన, విద్యార్థి, ప్రజా సంఘాల మద్దతు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిరుద్యోగభృతి, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, విభజన చట్టంలోని 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న పరిశ్రమల ఏర్పాటు, ప్రత్యేక హోదా తదితర డిమాండ్లతో కలెక్టరేట్ల వద్ద ఈ నెల 7న చేపట్టనున్న ఆందోళనకు యువజన, విద్యార్థి, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎపిపిఎస్సీ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్‌లు ఇవ్వాలని డిఎస్సీ, మైనార్టీ, గిరిజన ప్రత్యేక డిఎస్సీ నిర్వహించాలని, 6700 టిటిడి పోస్టుల్ని భర్తీ చేయాలని సమావేశంలో డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలిస్తామని మోడీ, ఇంటికొక ఉద్యోగమిస్తామని చంద్రబాబు అధికారాన్ని చేపట్టారన్నారు. మూడేళ్లు గడిచినా కేంద్రం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, రాష్ట్రంలో ఒక్క డిఎస్సీ తప్ప మిగిలిన ఉద్యోగాల్ని భర్తీ చేయలేదన్నారు. విభజన చట్టం 13వ షెడ్యూల్‌లో ప్రకటించిన పరిశ్రమలను ఏర్పాటు చేసి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం సూర్యారావు మాట్లాడుతూ ఇప్పటికే నెలరోజుల నుండి ఈ సమస్యపై ఉద్యమం చేస్తున్నామని, దానిలో భాగంగా ఐటీ, యువజన, పర్యావరణ శాఖల మంత్రుల్ని కలిసినా దీనిపై స్పందన లేదన్నారు. అందుకే ఈ ఉద్యమాన్ని ఇంకా కొనసాగిస్తున్నామన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం దీర్ఘ కాలిక పోరాటం చేయాలని, అందుకు తాము కూడా కలిసి వస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎన్ నాగేశ్వరరావు, పశ్చిమనగర కార్యదర్శి భార్గవ్, సెంట్రల్ నగర అధ్యక్షులు వెంకటరెడ్డి, లోక్‌సత్తా నాయకులు రవీంద్ర, ఎఐవైఎఫ్ అరుణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ పశ్చిమ క్రిష్ణ కార్యదర్శి సోమేష్, బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షులు సంపర శ్రీనివాస్, పివైఎల్ విజ్ఞేశ్వరరావు, యుబిఐ నాయకులు చైతన్య తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

డ్రగ్స్ కేసులో ఐటి ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో పనిచేసే ఐటి ఉద్యోగుల్లో చాలా మందికి డ్రగ్స్ అలవాటు ఉన్నట్లు సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు. తెలుగు సినిమా పరిశ్రమను ఉక్కిరి బిక్కిరి చేసిన డ్రగ్స్ వ్యవహారం ఇప్పుడు ఐటి పరిశ్రమకు ముచ్చెమటలు పట్టిస్తోంది. డ్రగ్స్ కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితుడు కమింగ కస్టడీ విచారణలో 1500 పైగా ఐటి ఉద్యోగుల సమాచారాన్ని అధికారులు సేకరించారు. వారం దరికీ డ్రగ్స్ అందించినట్లు కమింగ అంగీకరిం చాడు. దీంతో వారికీ నోటీసులను సిట్ సిద్ధం చేస్తోంది. హైదరాబాద్‌లో పనిచేసే వేలాది మంది టెకీల్లో పది మందికి డ్రగ్స్ అలవాటుంటే, అందరికీ ఆపాదిస్తారా అంటూ ఐటి శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ స్పందిం చారు. భారీ సంఖ్యలో ఐటి ఉద్యోగులకు డ్రగ్స్‌తో సంబంధం ఉన్నట్లు తేలడంతో ఐటి వర్గాల్లో కలవరం మొదలైంది. హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక కంపెనీలు సైతం సిట్ నోటీసులపై ఆందోళన చెందుతున్నాయి.

సిట్ విచారణలో సినీ సెలబ్రిటీలు వెల్లడించిన సమాచారం మేరకు గత నెల 26న డచ్ దేశస్థుడు మైక్ కమింగను సిట్ అధికారులు అరెస్టు చేశారు. అదే రోజు ఆయన్ని కోర్టులో హాజరుపర్చారు. కోర్టుకు తరలించే ఆ కొద్ది సమయంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ కమింగ నుంచి ప్రాథమిక సమాచారం సేకరించారు. సిట్ విచారణ ఎదుర్కొన్న వారిలో చాలామంది కమింగ్ పేరు ప్రస్తావించడంతో కోర్టు అనుమతితో సిట్ శుక్రవారం ఆయన్ని కస్టడీకి తీసుకుంది. శనివారం చంచల్‌గూడ జైలు నుంచి సిట్ కార్యాలయానికి తరలించి డ్రగ్స్ కేసుకు సంబంధించి ప్రశ్నించారు.

సిఎం పేషీలో ఇష్టారాజ్యం

- ముఖ్యమంత్రికి ఐవైఆర్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కార్యాలయం(సిఎంఒ)లోని అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఫైరయ్యారు. వారు ప్రజాధనాన్ని వేతనాలుగా తీసుకుంటున్నా ఆ మేరకు ముఖ్యమంత్రికి సలహాలివ్వడంలోగాని, ఫైళ్లపై సంతకాలు చేయడంలోగాని సరిగా వ్యవహరించడం లేదన్నారు. ఈ మేరకు ఫిర్యాదు చేస్తూ శనివారం ముఖ్యమంత్రికి ఐవైఆర్ లేఖ రాశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్థాయి నుంచి సంయుక్త కార్యదర్శి వరకు అధికారులెవరూ నిబద్ధతతో పని చేయడం లేదని విమర్శించారు. సిఎంఒ అధికారులు ఆయా ఫైళ్లను సిఎం కంటే ముందు పరిశీలించి, వాటిపై సంతకాలు చేయాలని, కాని దీన్ని వారెవరూ పాటించడంలేదని తప్పు పట్టారు. కొన్ని ఫైళ్లు ఉన్నతాధికారుల సంతకాలు, పరిశీలన లేకుండానే ముఖ్యమంత్రికి నేరుగా చేరుతున్నాయన్నారు. సిఎంఒలో సచివాలయ నిర్దేశిత మార్గదర్శకాలను అధికారులు పాటించడంలేదని, సిఎంకు చేరే ఫైళన్నీ రికార్డు చేయాలనే నిబంధనను విస్మరిస్తున్నారని ఈ లేఖలో పేర్కొన్నారు, ముఖ్యమంత్రికి పాలనాపరంగా చేసే సూచనలు కూడా రికార్డు చేయాల్సి ఉంటుందన్నారు. అవి కూడా వారు చేయడంలేదని ఐవైఆర్ ఆరోపించారు. ఈ విధానం వల్ల ప్రజా పాలనకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఎపి సెక్రటేరియేట్ ఆఫీస్ మ్యాన్యువల్ (ఎపిఎస్ఒఎం) ప్రకారం సచివాలయంలో పాలన సాగాల్సి ఉంటుందని ఐవైఆర్ సూచించారు. ఇది సిఎంఒ అధికారులకూ వర్తిస్తుందని తెలిపారు. వారు ఫైళ్ల రికార్డులను నిర్వహించకపోవడం బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సిఎంఒ అధికారులు తమకు రాజ్యాంగాధికారాలకు మించి అదనపు అధికారాలున్నట్లు భావిస్తున్నారని విమర్శించారు.

కొందరు రాజకీయ నాయకులకు అనుకూలంగా కొన్ని ఫైళ్లను తమకు ఇష్టమొచ్చినట్లు ఆయా శాఖలకు తిరిగి పంపేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కార్యాలయాల నుంచి ప్రధాన మంత్రి కార్యాలయాల వరకు ఫైళ్లను నిర్వహించేందుకు రికార్డులుంటాయని గుర్తు చేశారు. ఆనీ ముఖ్యమంత్రి కార్యాలయం పరిధిలోనే ఫైళ్లకు రికార్డులు ఉండటంలేదని ఐవైఆర్ తప్పు పట్టారు.

కాగితాలపైనే ఎస్సీ నిధులు

మొదటి పేజీ తరువాయి

5.5 శాతం, ఎస్సీ ప్రోత్సాహకాలు, ప్రాథమిక రంగంలో 5.6 శాతం చొప్పున కేటాయింపులు చేశారు. గ్రామీణ అనుసంధానం, గ్రామీణ మౌలికాభివృద్ధి రంగంలో ఆరు శాతం, గృహ నిర్మాణ రంగంలో 6.4 శాతం, సామాజిక భద్రత విభాగంలో 13.2 శాతం, విద్యా రంగంలో 22.2 శాతం, జీవన ప్రమాణాల మెరుగుదల రంగంలో 29.3 శాతం నిధుల్ని ఎస్సీల కోసం ఖర్చు చేయాలని నిర్దేశించారు.

ఇంత భారీ మొత్తాన్ని ఎస్సీల కోసం కేటాయించినప్పటికీ, వాటిని ఉపయోగించుకోవడంలో చూపుతున్న నిర్లక్ష్యం చర్చనీయాంశంగా మారుతోంది. ఆర్థిక సంవత్సరంలో ఐదో నెల కొనసాగుతున్నప్పటికీ, మొత్తమ్మీద 27 శాతం వరకు మాత్రమే ఖర్చు జరిగినట్లు గుర్తించారు. దీంతో చివరి త్రైమాసికాల్లో లక్ష్యాన్ని సాధించేందుకు హడావిడి చేయడం వల్ల నిధుల వ్యయంలో అవకతవకలు జరిగే ప్రమాదముందని సీనియర్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

గేట్ టాపర్ సుధీర్ ఆత్మహత్య!

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఈ ఏడాది గేట్ పరీక్షల్లో ఆలిండియా టాపర్‌గా నిలిచిన కోవూరు సుధీర్ ముంబయ్‌లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. శుక్రవారం రాత్రి అక్కడి పాలై షీరా నందనీ గార్డెన్‌లో ఈ విషాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. నెల్లూరులోని సుందరయ్య కాలనీకి చెందిన కోవూరు సుధాకర్, గౌరీలకు పెద్ద కుమారుడు సుధీర్(25) 2017 గేట్ పరీక్షలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకర్‌గా నిలిచాడు.


దీంతో అతనికి నెలరోజుల క్రితం బిపిసిఎల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నెలకి రూ.55వేల జీతానికి చేరాడు. అతనితో పాటు అదే కంపెనీలో పనిచేస్తోన్న తమిళనాడుకు చెందిన మరో ఉద్యోగితో కలిసి ఉంటున్నాడు. ఉదయం 5.30 గంటలకు నిద్రలేచి ఉద్యోగానికి వెళ్లాల్సి ఉంటుంది. రెండు షిఫ్ట్‌లు పనిచేయాలి. గదిలో ఉన్న వ్యక్తి డ్యూటీకి వెళ్లిపోయాడు. సుధీర్ ఒక్కడే గదిలో ఉన్నాడు. సాయంత్రం 6 గంటలకు సహోద్యోగి వచ్చాడు. ఎంత సేపు తలుపుతట్టినా తీయలేదు. అక్కడున్న వారికి తెలిపాడు. దీంతో అక్కడున్న వారు రాత్రి 7.30 గంటలకు గది తలుపులు పగులగొట్టి చూశారు. ఆ సమయంలో సుధీర్‌ఫ్యాన్‌కు దుప్పటితో ఉరేసుకుని మృతిచెందిన దృశ్యాన్ని గుర్తించారు. సాయంత్రం 4 గంటలకు ముంబాయి నుంచి చెన్నయ్‌కు విమాన టికెట్ కూడా బుక్ చేసుకున్నట్లు తెలిసింది. ఇంతలోనే ఆత్మహత్య ఎందుకు చేసుకున్నా డనేది తెలి యాల్సి ఉంది. ఈ నెల 1వ తేదీ కంపెనీ ఇచ్చిన రూ.55 వేలు జీతం కూడా తీసుకున్నట్లు సమాచారం. మరో కంపెనీలో చేరేం దుకు ఈనెల 3వ తేదీ బిపిసిఎల్ కంపెనీకి రాజీనామా చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అతని మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అతని మరణవార్తను కంపెనీ ప్రతినిధులు రాత్రి 8.30 గంటలకు తండ్రికి, బంధువులకు తెలిపారు. దాంతో తండ్రి సుధాకర్, సుందరయ్య నగర్ ఏరియా సిపిఎం నాయకులు సుబ్బారావు ముంబాయికి వెళ్లారు. శనివారం అక్కడ పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని నెల్లూరుకు తీసుకొచ్చారు. చేతికొచ్చిన కుమారుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

అణా పైసలతో సహా చెల్లించేస్తా


ఎన్టీఆర్

'నా వైపు నుండి నేను చట్టపరంగా చెల్లించాల్సిన రుసుం ఏమైనా ఉంటే, అణా పైసలతో సహా చెల్లించేందుకు సిద్ధముగా ఉన్నాను' అని ఎన్టీఆర్ అన్నారు. సర్వీస్ టాక్స్ మినహాయింపు వార్తలపై ఆయన స్పందించారు. తాను చట్టానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉండాలి అని నమ్మే వ్యక్తినని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ '2015 లో 'నాన్నకు ప్రేమతో'లో నటించిన సంగతి తెలిసినదే. ఇది లండన్‌లో నిర్మించిన చిత్రం. పొరుగు దేశంలో అందించిన సర్వీస్ (హీరోగా)కు భారత దేశంలో సర్వీస్ టాక్స్ వర్తించదు అని నాకు చెప్పడంతో, చట్టం ప్రకారమే నేను 'నాన్నకు ప్రేమతో' సినిమా నిర్మాతల వద్ద సర్వీస్ టాక్స్ వసూలు చేయలేదు. 2016లో ఇదే విషయంపై కాగ్ నుండి వచ్చిన ఎంక్వైరీకి లిఖిత పూర్వంగా మా ఆడిటర్‌లు స్పందించారు. ఆ స్పందన తరువాత, ఎటువంటి అధికారిక ఉత్తర్వులు కానీ, నోటీసులు కానీ మాకు అందలేదు. చాలా సంవత్సరాలుగా ఆదాయపు పన్ను, సర్వీస్ టాక్స్ క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వ్యక్తిని నేను. భారత పౌరుడిగా నా చట్టపరమైన బాధ్యతలను ఎన్నడూ మరువలేదు. ఈ విషయంలో సంబంధిత అధికారుల నుండి నాకు ఆదేశాలు అందితే అణా పైసలతో సహా చెల్లించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఈ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది' అని చెప్పారు.

ఉన్నది ఒకటే జిందగీ


రామ్

రామ్‌ను సరికొత్తగా ఆవిష్కరించిన చిత్రం 'నేను శైలజ'. కిశోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ హిట్ కాంబినేషన్‌లో మరో సినిమా నిర్మాణంలో ఉంది. 'స్రవంతి' రవికిశోర్, పి.ఆర్. సినిమాస్ సమర్పణలో స్రవంతి సినిమాటిక్స్ పతాకంపై ఈ చిత్రాన్ని కృష్ణచైతన్య నిర్మిస్తున్నారు. ఇందులో అనుపమా పరమేశ్వరన్, లావణ్యా త్రిపాఠి కథానాయికలు. ఈ చిత్రానికి 'ఉన్నది ఒకటే జిందగీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇప్పటి వరకూ జరిపిన షెడ్యూల్స్‌లో 50 శాతం పైగా సినిమా పూర్తయింది. ఈ నెల ఏడో తేదీన మరో షెడ్యూల్ ప్రారంభించనున్నారు.

రవికిశోర్ మాట్లాడుతూ 'స్నేహం, ప్రేమ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఆదివారం ఫ్రెండ్ షిప్ డే సందర్భంగా ఈ చిత్రంలో ఉన్న 'ట్రెండ్ మారినా.. ఫ్రెండ్ మారడు...' అనే పాటకు సంబంధించిన 'లిరికల్ వీడియో'ను విడుదల చేయబోతున్నాం. దేవిశ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటను చంద్రబోస్ రాశారు. దేవిశ్రీ ప్రసాద్ అన్ని పాటలకూ మంచి ట్యూన్స్ ఇచ్చారు. ఊటీలో జరపనున్న భారీ షెడ్యూల్ తో ఒక పాట మినహా సినిమా పూర్తవుతుంది. ఆ పాటను వచ్చే నెల ఇటలీలో చిత్రీకరిస్తాం. దసరాకి సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం" అని చెప్పారు. శ్రీవిష్ణు, 'పెళ్లి చూపులు' ఫేమ్ ప్రియదర్శి ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : దేవిశ్రీ ప్రసాద్, ఆర్ట్: ఎ.ఎస్. ప్రకాశ్, ఎడిటింగ్ : శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ : సమీర్ రెడ్డి.

బయటకు రావాలంటేనే భయమేసేది

- బెల్లంకొండ సాయి శ్రీనివాస్



"అల్లుడు శీను'తో నటుడిగా పర్వాలేదనిపించినా 'స్పీడున్నోడు' మాత్రం వైఫల్యం చెందింది. దాంతో తీవ్ర నిరాశకు గురయ్యాను. బయటకు రావాలంటే భయమేసేది. సినిమా రంగంలో జయాపజయాలు మామూలే అనుకున్నా... కానీ ప్రాక్టికల్‌గా చాలా తేడా ఉంది. ఓ సందర్భంలో ఏడ్చేశాను. ఆ సమయంలో నా చిన్ననాటి స్నేహితులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన మనోధైర్యంతోనే బయటపడ్డాను. నిర్మాత బెల్లంకొండ సురేష్‌కు తనయుడ్ని అయినందుకు గర్వంగా ఉంది. నా గోల్‌ను ఆయన గోల్‌గా భావించి నాన్నగారు ప్రోత్సహిస్తున్నారు" అని చెప్పాడు యువ హీరో బెల్లంకొండ శ్రీనివాస్. ఆయన నూతన చిత్రం 'జయ జానకి నాయక' ఈనెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం శ్రీనివాస్ చెప్పిన విషయాలు.

'జయ జానకి నాయక' అంటే ఏమిటి?

లంకలోని సీతాదేవిని గెలుచుకున్న శ్రీరాముడు అని అర్థం. తను జయంతో జానకితో రాజ్యానికి వస్తుండగా ప్రజలు అన్నమాటలవి. దాన్ని చిత్ర కథకు అనుగుణంగా దర్శకుడు టైటిల్ నిర్ణయించారు. ఇందులో లంక ఏదని తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందే. ఈ జానకి నాయకుడు కొత్తగా ఉంటూ బోయపాటి హీరోలా ఉంటాడు. నేను, రకుల్ కాలేజ్ స్టూడెంట్స్‌మి. జగపతి బాబు విలనిజం కొత్తగా ఉంటుంది. దర్శకుడు ఇప్పటి వరకూ టచ్ చేయని ఓ పాయింట్‌ను చూపించారు. ఒక మంచి ప్రేమకథ, కమర్షియల్ ఎలిమెంట్స్ కాంబినేషన్‌లో రావడం అనేది తక్కువగా జరుగుతుంది. నా మూడో సినిమాకే అలా కుదరడం అదృష్టం అనొచ్చు.

భారీ అంచనాల వల్ల టెన్షన్ ఫీల్ అవుతున్నారా?

భారీ అంచనాలు రావడం మంచిదే. ఇంత అంచనాలతో థియేటర్‌కు వచ్చే ప్రేక్షకుడు పూర్తి సంతృప్తి పొందుతాడు. నేను, బోయపాటి మాత్రమే సినిమా చూశాం. చాలా నమ్మకంగా ఉన్నాం.

ఈ సినిమాలో కొత్తగా నేర్చుకున్న విషయాలేంటి?

అభ్యసించడం అనేది నిరంతర ప్రక్రియ. వంద సినిమాలు చేసినా, తర్వాత సినిమాకు ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటాను. ఈ సినిమా పరంగా ఫిజికల్‌గా కొత్తగా కనపడతాను. నటుడిగా ఇంకా అభినయాన్ని ఇవ్వడానికి ప్రయత్నించాను. క్యారెక్టర్ పరంగా మంచి ఎమోషన్స్‌ను క్యారీ చేశాను.

బోయపాటితో రెండో సినిమానే చేయాల్సింది కదా..ఎందుకు గ్యాప్ వచ్చింది?

మంచి కథ కుదరకపోవడంతోనే రెండో సినిమాగా స్పీడున్నోడు' చేశాను. సినిమాలను ఏదో త్వరత్వరగా చేసేయాలనే ఆలోచనలేవీ లేవు. రెండేళ్లకు ఓ సినిమా చేసినా, మంచి కథలతోనే ప్రేక్షకుల ముందుకు రావాలనుకుంటున్నాను.

మాస్ ఇమేజ్ తెచ్చుకోవాలని చేసే ప్రయత్నం ఎంత వరకూ కరెక్ట్ అనుకుంటున్నారు?

బోయపాటి మాస్ ఇమేజ్ ఉన్న దర్శకుడు. ఆయన సినిమాలో మాస్ ఎలిమెంట్స్‌తో పాటు ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంటుంది. ఈ సినిమాలో కూడా లవ్‌స్టోరీ ప్రధానంగా సాగుతుంది. నేను యాక్షన్, డ్యాన్సుల్లో శిక్షణ తీసుకున్నా. కాబట్టి నేను యాక్షన్ సినిమాలు చేయడంలో తప్పులేదనిపించింది. రేపు భవిష్యత్‌లో ప్యూర్ లవ్‌స్టోరీ వచ్చినా చేయడానికి నేను రెడీ.

పాత్ర పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

లుక్ కోసం పాతిక కిలోలు వరకు పెరిగాను. తర్వాత పది కిలోలు వరకూ తగ్గాను.

'స్పీడున్నోడు' పరాజయం ఎలాంటి ప్రభావం చూపింది?

నేను సాధారణంగా ఏడవను. కానీ 'స్పీడున్నోడు' పరాజయం నన్ను బాగా కుంగదీసింది. దాంతో బాగా ఏడ్చేశాను. కానీ నా స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎంతగానో సపోర్ట్ చేశారు.

మీ నాన్న మీ కెరీర్ పట్ల చాలా కేర్ తీసుకుంటునట్టున్నారు?

హీరో కావాలనేది నా కల. నా కలను ఆయన కలలాగా తీసుకుని పూర్తి చేయడంలో సపోర్ట్ చేస్తున్నారు. మంచి కథల ఎంపికలో తన అభిప్రాయాలను చెబుతున్నారు. సినిమా రంగంలోనే కాదు, ఏ రంగంలోనూ మా నాన్నంత మంచి నాన్న ఉంటారనుకోవడం లేదు. నా స్నేహితులు ఈ విషయంలో నన్ను చూసి ఈర్ష్య పడుతుంటారు. మా నాన్నగారి ప్రొడక్షన్‌లో వేరే హీరోలతో ఈ ఏడాది సినిమా ఉంటుంది. రెండు కథలు కూడా ఫైనలైజ్ అయ్యాయి.

బోయపాటితో పనిచేయడం ఎలా అనిపించింది?

ఆయన స్వంత అన్నలా ట్రీట్ చేశారు. ఈ సినిమా విషయంలో ఆయనిచ్చిన నమ్మకం మరచిపోలేను. అంత పెద్ద డైరెక్టర్‌కు నా గురించి ఇంతలా ఆలోచించాల్సిన అవసరం లేదు. నీకేం కాదు, నీ వెనుక నేనున్నాను. నీతో మరో సినిమా కూడా చేస్తానని ధైర్యం ఇచ్చారు. నాలో అంతగా ఆయనకేం నచ్చిందో నాకు అర్థం కావడం లేదు.

సీనియర్ నటీనటులతో చేయడం ఎలా అనిపించింది?

రకుల్, సమంత, జగపతి బాబు, శరత్ కుమార్ అందరూ సీనియర్లే. ఎదుటివాళ్లు బాగా చేసినప్పుడు మనం కూడా బాగా చేయాలనిపిస్తుంది. సీనియర్స్ అందరూ నాకు కంఫర్ట్ జోన్ ఇచ్చారు. సినిమాలో క్యాథరిన్ స్పెషల్ సాంగ్ చేసింది. అలాగే ప్రగ్యా చాలా కీలక పాత్ర చేసింది. ఇప్పుడు మరో సినిమా చేస్తున్నా. ఈనెల 17 నుంచి రెండో షెడ్యూల్ ఉంటుంది.

నెక్స్ట్ నువ్వే


వైభవి, ఆది

ఆది హీరోగా కొత్త చిత్రం రూపొందుతోంది. ప్రభాకర్.పి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. వి4 మూవీస్ బ్యానర్‌లో బన్ని వాసు నిర్మిస్తున్నాడు. ఇటీవలే షూటింగ్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోన్న ఈ చిత్రానికి 'నెక్స్ట్ నువ్వే' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. హీలేరియస్ కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. వైభవి, రష్మిలు హీరోయిన్స్‌గా చేస్తున్నారు. ఈ చిత్రాన్ని విజయ దశమి కానుకగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దానిలో భాగంగా శనివారం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసందీ చిత్రబృందం. నిర్మాత బన్ని వాసు మాట్లాడుతూ 'మంచి కాన్సెప్ట్. ఆడియన్స్‌ని ఎంటర్‌టైన్ చెయ్యటమే లక్ష్యంగా చేశాం. ఆది పాత్ర చాలా బాగుంటుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి కథ : డి.కె, మాటలు : శ్రీకాంత్ విస్సా, నిరుపమ్ పరిటాల, పాటలు : కె కె సాగర్, ఫొటోగ్రఫీ : కార్తిక్ పళని.


మనోజ్

దేశం వర్ధిల్లాలి..!

మంచు మనోజ్ తాజాగా ఎల్.టి.టి.ఈ చీఫ్ ప్రభాకరన్ పాత్ర చేస్తున్న చిత్రం 'ఒక్కడు మిగిలాడు'. అజయ్ ఆండ్రూస్ నూతక్కి దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ఎస్.ఎన్.రెడ్డి, లక్ష్మీకాంత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకొన్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న విడుదల చేసేందుకు దర్శక నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ "మునుపెన్నడూ భారతదేశ చలన చిత్ర చరిత్రలో చూడని సరికొత్త కథాంశాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. మంచు మనోజ్ యాంగ్రీ యంగ్ మేన్‌గా ఆశ్చర్యపరుస్తాడు. ఈ చిత్రం ట్రైలర్, పాటలు త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 1990 నాటి శ్రీలంక యుద్ధం నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందన్న నమ్మకం ఉంది. ఇటీవల విడుదల చేసిన మంచు మనోజ్ ఫస్ట్ లుక్‌కి విశేషమైన స్పందన వచ్చింది. హాలీవుడ్ టెక్నీషియన్స్ వర్క్ చేసిన ఈ చిత్రం సాంకేతికత పరంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడం ఖాయం' అని చెప్పారు.

నేను మళ్లీ పాడుతా


ప్రియాంక చోప్రా

ప్రియాంక చోప్రా...ఓ స్టార్ హీరోయిన్..కానీ అలా హీరోయిన్‌గానే మిగిలిపో దలుచుకోలేదు. అవకాశం ఉన్నంత మేరకు సినిమాలో ఉన్న 24 రంగాల్లోనూ తన సత్తాను చాటాలనుకుంటుందేమో అని అనిపిస్తుంది. ఇప్పటి వరకూ బాలీవుడ్ సినిమాల్లో కథానాయికగా రాణించేది. అక్కడ నుంచి అమెరికన్ టీవీ ప్రొగ్రామ్ 'క్వాంటికో' ద్వారా బుల్లితెరపై ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం మూడో భాగం కొనసాగుతోంది. హాలీవుడ్‌లోనూ 'బేవాచ్'లో తన సత్తాను చాటింది. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా కలెక్షన్లు ఎలా ఉన్నా అందులో ప్రియాంక నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇవి కాకుండా ప్రాంతీయ చిత్రాలను నిర్మించే పని కూడా చేపట్టిందీ భామ. ఆమె నిర్మించిన 'వెంటిలేటర్'కు జాతీయ చిత్రం అవార్డు కూడా వరించింది. ఒక పక్క సినిమాలు, మరో పక్క టీవీ కమిట్‌మెంట్స్ వల్ల తనకెంతో ఇష్టమైన సంగీతాన్ని పక్కన పెట్టేసింది. మ్యూజిక్ రంగంలో రాణించాలంటే ప్రత్యేక శ్రద్ధ, సమయం కేటాయించాలని అందుకే తాను తన గళానికి కాస్తా విరామం ఇచ్చానని చెప్పింది. గత మూడేళ్లుగా పాటలు పాడడం లేదని ఇక నుంచి ఎలాగైనా తన గొంతుకకు పని చెప్పాల్సిందేనని నిర్ణయించుకుంది. అందుకే ఆస్ట్రేలియన్ డీజే స్పార్క్‌తో కలసి 'యంగ్ అండ్ ఫ్రీ' పేరుతో ట్రాక్‌ను రూపొందించబోతున్నారు. ప్రస్తుతం ఈ పనుల్లో బిజీగా ఉన్నానని పాటలు రాయడం, పాడడం, వాటికి డాన్స్‌లు వేయడమంటే తనకెంతో ఇష్టమని చెప్పింది ప్రియాంక.

సప్తగిరి సూపర్ ఫాస్ట్


సప్తగిరిపై క్లాప్ కొడుతున్న పర్వతనేని కిరణ్

'సప్తగిరి ఎక్స్ ప్రెస్' చిత్రంతో సప్తగిరి హీరోగా తనలో మరో కోణాన్ని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. వెంటనే మరో సినిమా 'సప్తగిరి ఎల్ ఎల్ బీ'ని సెట్స్ పైకీ తీసుకొచ్చాడు. ఇది చిత్రీకరణలో ఉండగానే 'సప్తగిరి సూపర్ ఫాస్ట్' అనే టైటిల్‌తో మరో సినిమాను శనివారం ప్రారంభించేశాడు. అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన ముహూర్తపు సన్నివేశానికి తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి నూతన అధ్యక్షుడు పర్వతనేని కిరణ్ క్లాప్‌నిచ్చారు. రచయిత విజయేంద్ర ప్రసాద్ కెమెరాస్విచ్చాన్ చేశారు. బి.గోపాల్ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. నట్టీస్ ఎంటర్ టైన్మెంట్స్ పతాకంపై జొన్నాడ రమణమూర్తి సమర్పణలో నట్టి కరుణ, నట్టి క్రాంతి, నిర్మిస్తున్నారు.

అనంతరం విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'సప్తగిరి సూపర్ ఫాస్ట్ కథను హర్షవర్ధన్ సిద్ధం చేసి నా దగ్గరకు వచ్చి వినిపించి..నా అనుమతి తీసుకుని ప్రారంభించాడు. మంచి కథ. సప్తగిరికి వందశాతం యాప్ట్ అయిన స్టోరీ ఇది. హీరోగా మరో మెట్టు పైకి ఎక్కుతాడు. మరో విధంగా చెప్పాలంటే సప్తగిరిని సూపర్ స్టార్‌ని చేసే సినిమా అవుతుంద'ని అన్నారు.





ఫ్రెండ్‌షిప్... ఈ విషయం గురించి మాట్లాడటానికి ప్రతి ఒక్కరి దగ్గరా ఎన్నోకొన్ని మాటలు ఉండే ఉంటాయి. ఒక్కొక్కరూ ఒక్కోలా చెప్తారు. ఎవరేం చెప్పినా అల్టిమేట్‌గా వారి కథలో వారి దోస్త్‌ను అపురూపమనీ, అద్భుతమనీ చెప్తారు. చెక్ యువర్ సెల్ఫ్... మీ ఇన్నేళ్ల జీవితంలో మీతో ఎంతమంది కలిసి నడిచారు... ఇంకెంత మంది ఆటలాడారు, పాటలు... పాడారు, దిగులు కమ్ముకున్నప్పుడు నవ్వుల మూటలై వచ్చారు. "కామ్రేడ్, ఎమిగో, డ్యూడ్, దోస్త్" ఎలా పిలుచుకున్నా సరే మీరంటే ఏంటో వాళ్లకు తెలుసు. మీకేం ఇవ్వాలో తెలుసు. అందుకే కదా... సినిమాల నిండా స్నేహం గురించి అన్ని మాటలూ, పుస్తకాల్లో అన్ని కథలూ.. ఎన్ని విన్నా, ఇంకెంత చదివినా కొత్తగానే ఉంటాయి. హత్తుకునేలా ఉంటాయి. ఎందుకంటే అవి మన జీవితాలు. మనం జీవితంలో ఒక భాగమైన మన దోస్త్ గురించి చెప్పే తియ్యటి మాటలు.

ప్రతి ఫ్రెండూ అవసరమేరా..!!

సీన్ మారిపోయింది

నిన్న మొన్నటి వరకూ స్నేహితులంటే మనతోపాటు చదువుకున్న వారో, పోనీ ఇంటి పరిసరాల్లో ఉంటూ చిన్ననాటి నుంచీ మాత్రమే. మనతో చేయిపట్టుకుని తిరిగిన వారో ఇంకా అనుకుంటే ... మహాఅయితే ఏ సమ్మర్ హాలిడేస్‌లోనో చుట్టాలింటికి వెళ్తే అక్కడ ఇంకొంత మంది మిత్రులు దొరికేవారు. ఇప్పుడు సీన్ మారింది బాస్. సోషల్ మీడియా ప్రపంచం మొత్తాన్నీ ఒక దగ్గరకు చేర్చడమే కాకుండా ఎంతో మంది స్నేహితులనూ తెచ్చిపెడుతోంది. ఒకేలా ఆలోచించే వాళ్లనూ, ఒకేలాంటి ఇష్టాలున్న వాళ్లనూ పోగుచేసి భావాలకు పదునుపెట్టుకోమంటోంది.





కొత్త స్నేహాలు, కొత్త జోష్

ప్రతిఒక్కరికీ వారి పరిసరాల మీదా, చుట్టుపక్కల ప్రాంతాలమీదా మంచి అవగాహన ఉంటుంది. అడుగడుగూ పరిచయమూ ఉంటుంది. కానీ కాస్త దూర ప్రాంతాల గురించీ, అసలేమాత్రమూ టచ్ లేని ప్రాంతాల గురించంటే నిట్టూర్పులు వినాల్సిందే. ఇక అక్కడ ఏదన్నా పనిపడితే ఆ ఇబ్బందుల గురించి చెప్పే పనేలేదు. కానీ మనకక్కడో సోషల్ మీడియా ఫ్రెండుంటే చాలు. పని సులువైపోతుంది. ఏదో తెలియని ప్రాంతానికి వెళ్లొచ్చినట్టు అసలే ఉండదు. ఎందుకంటే అక్కడ మనకో ఫ్రెండున్నాడు. తన ఊరంతా తిప్పితిప్పి చూపించే దోస్తున్నాడు.

ఇబ్బందులూ ఉన్నాయి

అన్‌లైన్ స్నేహాలతో ఉపయోగాలతో పాటు, నష్టాలు కూడా ఉన్నాయి. అయితే ఇవి ఇప్పటికిప్పుడు కొత్తగా పుట్టుకొచ్చినవేం కాదు. ఇప్పుడు జరుగుతున్న నష్టాలూ, మోసాలూ అన్‌లైన్ స్నేహాలు పుట్టకముందు నుంచే ఉన్నాయి. అంతకముందు కూడా జరుగే ఉన్నాయి. ఏది ఎలా ఉన్నా సోషల్‌మీడియా స్నేహితులను ఎన్నుకునే ముందు ఒకింత జాగ్రత్త అవసరమే. ఓపిగ్గా పరీక్షించాక కానీ మాట కలపకూడదు. అన్నీ ప్లాట్‌ఫాముల్లో లానే ఇక్కడా మంచీ ఉంది, చెడూ ఉంది. అయితే అది మన మీదనే, మనం స్నేహితులను ఎంచుకునే విధానం మీదనే ఆధారపడి ఉంటుంది.

భయాన్ని గెలిచింది

శ్రావ్య బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. మంచి ప్రొగ్రెసివ్ భావాలున్న అమ్మాయి. కాకపోతే కొంచెం భయస్తురాలు. దానికి తోడు తన భావాలను పంచుకునే వేదిక లేదు. కాలేజీ స్నేహితులతో తన భావాలను షేర్ చేస్తే ఏమనుకుంటారో అని ఊరికే ఉండిపోయేది. ఒక రోజు ఫేస్‌బుక్ పోస్ట్‌లో తన భావాలను పోస్ట్ చేసింది. దానికి ఎంతో మంది నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. అప్పటి నుంచీ తన భావాలను అదే వేదికపై పంచుకుంటోంది. తనలా ఆలోచించే మరింత మంది మిత్రులు తోడయ్యారు. చిన్నగా తన భయాన్ని జయించింది. ఇప్పుడు తన కాలేజీ స్నేహితులకే కాదు... ఎన్నో కాలేజీలకూ, స్కూళ్లకూ తిరిగి సెమినార్లు నిర్వహిస్తోంది.

అలా ముగించారు

శివ మంచి ఫోటోగ్రాఫర్. ఎలాంటి దృశ్యాన్నయినా తనదైన మార్క్‌తో కెమెరాలో బంధించడంలో స్పెషలిస్ట్. డిగ్రీ పూర్తిచేసి ఏడాది కావొస్తోంది. చదువుకుంటున్న రోజుల్లో కూడా ఫోటోగ్రఫీ మీదే ధ్యాస ఉండేది. ఆ ఇష్టంతోనే చదువు పూర్తయ్యాక చేతికొచ్చిన ఉద్యోగంలో ఇమడలేక పోయాడు. అద్భుతంగా ఫోటోలు తీయగలడు. కానీ ఎలా ముందుకెళ్లాలన్న డైలమాలో పడిపోయాడు. ముందు నుంచీ తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో తను తీసిన ఫోటోలు అప్‌లోడ్ చేస్తూ ఉండేవాడు. అలా ఒక ఫోటోగ్రఫీ గ్రూప్‌లోకి యాడ్ అయ్యాడు. అక్కడ తనలాంటి కొందరు మిత్రులు కలిశారు. అలా కలిసిన మిత్రులతోనే ఇప్పుడు వినూత్న ఆలోచనలతో ఒక ఫోటోస్టూడియో రన్ చేస్తున్నారు.

జీవితం, కాలం మనకు చాలాచాలా అవకాశాలను ఇస్తాయి. ఆ అవకాశాలలోనే మన దోస్తులుంటారు. జీవితాంతం మీతో నడిచే ఫ్రెండ్ ఎప్పుడైనా తారసపడొచ్చు. వాళ్లను కనిపెట్టి జాగ్రత్తగా దాచుకోండి.

- సిద్ధార్థ కట్టా

ఆ వయసులో అద్భుత ప్రయాణం



రియా యాదవ్‌కి పందొమ్మిదేళ్ల వయసున్నప్పుడు తన తండ్రి బైక్ కొనిపెట్టాడు. అప్పటి నుంచే ఆమె బైక్ నేర్చుకోవడం మొదలుపెట్టింది. సరిగ్గా ఏడు నెలల తర్వాత ఆమె ప్రపంచ రికార్డ్ సొంతం చేసుకుంది. ఢిల్లీ కాలేజ్‌లో చదువుకుంటున్న రియా లద్దాక్‌లోని ప్రపంచలోనే అత్యంత ఎత్తయిన మోటారు వాహనాలతో దాటగలిగే ఖర్దుంగ్లా పర్వతం అధిరోహిం చిన అతిపిన్న వయసు వ్యక్తిగా రికార్డ్ సాధించింది. చిన్నప్పటి నుంచీ బైక్‌లంటే అమితమైన ఇష్టమున్న రియా కోరికను గమనించి, తన తండ్రి రాయల్ ఎన్‌ఫీల్డ్ 350ని ఆమెకు బహూకరించాడు. అప్పటి నుండీ తన సోదరుడితో పాటు రైడింగ్ ట్రిప్స్‌కు వెళుతుండేది రియా. అలా మొదలైన ఆమె ప్రయాణం ప్రపంచ రికార్డ్ స్థాయిని చేరింది.

ఖర్దుంగ్లా ప్రయాణం గురించి రియా ఇంట్లో చెప్పినప్పుడు అందరూ క్యాజువల్‌గా తీసుకున్నారు. కానీ రియా సీరియస్‌గా ఈ ట్రిప్ చేయాలనుకుంటుందని తెలిసి ఆశ్చర్యపోయారు. అయినా ఎట్టకేలకు ఒప్పుకోక తప్పలేదు. పదమూడు రోజుల సాగిన ఆమె ప్రయాణం తన జీవితంలో అత్యంత మధురమైన రోజులంటుంది రియా. మనాలి దాటిన తర్వాత రియా ఫోన్ నెట్‌వర్క్‌లేక పనిచేయడం ఆగిపోయింది.

ఆ తర్వాత తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారంలేదు. తాను హైస్కూల్ చదువుతున్న రోజుల్లో ఎన్‌సిసి క్యాంప్‌లో ఉన్నప్పుడు తప్ప ఎప్పుడూ తల్లిదండ్రులకు దూరంగాలేని రియా ఆ రోజు బాగా ఏడ్చింది. కానీ ఆమె అనుకున్న ప్రయాణం ఆగిపోకూడదనే పట్టుదలతో ముందుకు సాగింది. అప్పుడు తనతో పాటు ఉన్నవి రెండే. ఒకటి బైక్, మరొకటి ఖర్దుంగ్లా అధిరోహించాలనే నిశ్చయం. ఎందుకంటే అది ఆమెకు మరెప్పటికీ దొరకని ఒక అద్భుతమైన జీవితానుభవం. అందులోనూ రియా బైక్ నేర్చుకున్నదే కొత్త. కనుక రైడింగ్‌లో చిన్నచిన్న ఇబ్బందులు ఉండే అవకాశం లేకపోలేదు. రోడ్డుపైన ఎక్కువ ట్రాఫిక్ ఉంటేనే కంగారుపడే రియా పర్వత మార్గంలో చాలా ఇబ్బందులు ఎదుర్కోంది. కానీ అడ్డంకులను మౌనంగా ఎదుర్కోని, వాటిని అధిగమించే ఆత్మవిశ్వాసం ఈ ప్రయాణంలో సాధించానని చెబుతుంది. ఎప్పుడైతే మనం ఒకటి సాధించాలని నిశ్చయించుకున్నామో దాన్ని పొందే వరకూ మరో ఆలోచనకు చోటుండదంటుంది.

విజయవంతంగా పూర్తిచేసిన ఈ రికార్డ్ రైడ్ తర్వాత ప్రపంచంలో అత్యంత ఎత్తయిన ర్యాలీ రైడ్- 'రైడ్ దె హిమాలయా'లో పాల్గొనాలనే ప్రయత్నంలో ఉంది. దాని కోసం చేసే ప్రాక్టీస్‌లో తన సోదరుడు కూడా తనతో పాటే వెనుక పరిగెత్తుతుంటే చూసిన కొందరు జనాలు అతను రియాకు బాయ్‌ఫ్రెండ్ అనుకుని ఇంట్లో కంప్లైంట్ చేశారంట... సరే, ఈ సంగతి అలా ఉంచితే, మహిళా రైడర్లు పురుష రైడర్లకంటే ఏం తీసిపోరు అంటుంది రియా. ఒకరకంగా పురుష రైడర్లకంటే మహిళా రైడర్లకే ఎక్కువ ప్రశంసలు అందుతాయి. ఈ ప్రోత్సాహంవల్లే మహిళా బైకర్ గ్రూపులు మరిన్ని వస్తున్నాయని హర్షం వ్యక్తం చేస్తుంది. "ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన రియా ఆశించేదంటంటే, ఆడపిల్లలు రోడ్డుపై బైక్ నడపడం చూసిన జనాలు దాన్ని సాధారణంగానే పరిగణించే రోజులు రావాలంటోంది" ఆ రోజులు రావాలని మనమూ ఆశిద్దాం. ★



డ్రోన్ల డ్రైవర్



బెంగళూరుకు చెందిన యువకుడు కాలేజ్‌లో చదువుకుంటూనే తన కలల్ని నిజం చేసుకుంటున్నాడు. తనకి ఇష్టమైన ఏరోడైనమిక్స్‌లో ప్రతిభను కనబరుస్తున్నాడు. క్రైస్ట్ యూనివర్సిటీలో చదువుతున్న ఈ యువ విద్యార్థి నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్ (ఎన్ఏఎల్)కు చెందిన అనధికారిక డ్రోన్ టెస్ట్ పైలెట్‌గా వ్యవహరిస్తున్నాడు. చిన్న వయస్సులోనే భారతదేశపు యంగ్ సైంటిస్ట్‌గా అవార్డు పొందిన రోహిత్‌దే గత కొన్ని సంవత్సరాలుగా ఉపయోగంలోలేని వస్తువులతో డ్రోన్లు తయారుచేస్తూ అందరి దృష్టినీ ఆకర్షించి, నాసాతో సహ పెద్దపెద్ద కంపెనీలే తమతో పనిచేయమని అడిగే స్థాయికి ఎదిగాడు. బెంగళూరులోని డ్రోన్ సొల్యూషన్ కంపెనీలో ఉద్యోగం చేస్తూనే బిఎస్‌సి పూర్తిచేయడానికి కష్టపడి చదువుతున్నాడు. రోహిత్‌కు ఐదేళ్ల వయసు ఉన్నప్పుడే తన మొదటి క్వాడ్‌కోప్టర్ అనే హెలికాప్టర్‌ను తయారుచేశాడు. నాలుగు రూటర్లు అమర్చి దాన్ని రూపొందిం చాడు. పదిహేనేళ్లకు అలాంటి పది వాహనాల్ని తయారుచేసి గుర్తింపు పొందాడు. వాటన్నింటినీ జిపిఎస్ రిసెప్టివిటీతో నోటిమాట ద్వారా నియత్రించే విధంగా తయారుచేశాడు. రోహిత్ డబ్బున్నోడేమీ కాదు. మైక్రోప్రాసెసర్ కొనడానికి యాభైవేలు ఖర్చుచేయలేక, కొన్ని పుస్తకాలు చదివి, సొంతగా తయారుచేసేశాడు. పేరులేని ఏరియల్ వాహనాన్ని (యుఏవి) రూపొందించిన రోహిత్ జాతీయ వార్తల్లో వెలిగిపోయాడు. దీనివలన భవిష్యత్తులో విపత్తులను గుర్తించే విజ్ఞానాన్ని పొందవచ్చు. ఇలాంటి నైపుణ్యమున్న వ్యక్తి ఎవర్నయినా ఆకర్షిస్తాడు మరి, అందుకే నాసా వాళ్లు పిలిచి, ఆ రోజుకి రోహిత్‌ను కోపైలెట్‌గా నియమించారు. ఏరోడైనమిక్స్‌లో శాస్త్రవేత్తగా ఎదగాలని అను కుంటున్న రోహిత్‌కు ఆల్ ది బెస్ట్!! ★

రైజ్ యువ(ర్) వాయిస్

యువత కోసం ప్రజాశక్తి ఏర్పరచిన వేదిక రైజ్ యువ(ర్) వాయిస్. వ్యవస్థలో మార్పు రావాలి అనే ఆశయంతో పాఠకుల నుంచి వచ్చే అభిప్రాయాలను ప్రజల వద్దకు చేర్చే ఒక ప్రత్యేక కాలమ్ రైజ్ యువ(ర్) వాయిస్. ఈ రోజు నుంచి రైజ్ యువ(ర్) వాయిస్‌కు మీరు పంపే ప్రశ్నలు, సలహాలు, అభిప్రాయాలను ప్రతీ ఆదివారం "జోష్"లో వచ్చే రైజ్ యువ(ర్) వాయిస్ కాలమ్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తాం. మీ వాయిస్ మాకు పంపవలసినది: జోష్, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం: 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-2 లేదా ఫోన్ నెం: 9490099417కు కాల్ లేదా మెసేజ్ చేయవచ్చు లేదా joshprajasakti@gmail.com కు మెయిల్ పంపగలరు.

వేటగాడు - 2

కథ: శాఖమూరి శ్రీనివాస్ (సెల్: 94410 75755)
బొమ్మలు: తుంబలి శివాజీ (సెల్: 98492 27509)



పొడుపు కథ

పసుపు దుప్పట్లో తెల్లటి ఆసామి, అతనెవరు?

గజంల్లగ్గల్ల : ఙ్ఞఅఙ

జోక్ :

బాలు : నాన్నా..! నేను ఫస్ట్‌క్లాస్‌లో పాసైతే మీరేం చేస్తారు..?

తండ్రి : ఆనందంతో పిచ్చోడినైపోతారా..!

బాలు : అందుకే నేను పాసవడంలేదు నాన్నా

తండ్రి : ఆ..!!??




పత్తి వ్యర్థంతో ఇంధనం



పిల్లలూ పత్తి పంటను మనం పంటగా పరిగణిస్తాం. దానివల్ల రైతులకు మిగతా వాటికంటే కాస్త లాభం ఎక్కువ దక్కుతుంది. కానీ పత్తి పంట కోతకు వచ్చాక చాలా వ్యర్థపదార్థాలు మిగిలిపోతాయి. వాటిని రైతులు పొలాల్లో కాల్చేస్తుంటారు. ఇలా ఉత్పత్తి అయిన పొగ పర్యావరణానికి, మనుషులకు కూడా ఎంతో హానికరం. మన దేశంలోనే అత్యధిక పత్తి పంట పండిస్తారు. అంటే మన కారణంగా వాతావరణ కాలుష్యం పెరుగుతుందన్నట్లే కదా! దానికి పరిష్కారంగా గుజరాత్‌లోని 'అబెలాన్' కంపెనీకి చెందిన పంకజ్ పటేల్ అనే వ్యక్తి తన మిత్రులతో కలిసి పత్తి పంట ద్వారా ఉత్పత్తి అయిన వ్యర్థ పదార్థాలను రైతుల వద్ద కొనుగోలు చేసి, వాటిని ఇంధనపు బిళ్లలుగా మార్చి, పరిశ్రమలకు అమ్ముతున్నారు. ఇలా చేయడం వల్ల రైతులకు అదనపు ఆదాయం, శిలాజ ఇంధనాల ఆదానే కాక పర్యావరణ సంరక్షణ కూడా జరుగుతోంది. ఈ పద్ధతి చాలా బాగుంది కదూ. ఇలా ప్రతి రాష్ట్రంలో చేస్తే కాలుష్యాన్ని కొంతైనా తగ్గించవచ్చు. ★





గడులు నింపండి!

పిల్లలూ.! పైనున్న చిత్రంలో కొన్న బొమ్మలు ఉన్నాయి కదా!? వాటికెదురుగా ఇచ్చిన గడులలో వాటి పేర్లతో నింపండి!

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

ఆటలు

12 | విజయవాడ
ఆదివారం 6 ఆగస్టు 2017

అర్జునకు నామినేషన్ ఆలస్యంపై బోపన్న ఆగ్రహం



న్యూఢిల్లీ : దేశ రెండో అత్యున్నత పురస్కారం అర్జున అవార్డుకు డెడ్‌లైన్ ముందే నామినేషన్ ఎందుకు పంపలేదని భారత స్టార్ టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్‌పై అసహనం వ్యక్తం చేశాడు. గడిచిన దశాబ్ద కాలం నుంచి తాను సాధించిన విజయాలే అవార్డుకు గీటురాయి అని అలాంటప్పుడు ముందే నామినేషన్ పంపి ఉండాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశాడు. గతంలో ఎన్నోసార్లు పేరును ప్రతిపాదించిన తిరస్కరణకు గురి అవుతూనే ఉంది. ఏప్రిల్ 28 తేదీతో ఈ అవార్డుకు గడువు ముగిసిపోగా, జూన్ 14 ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను బోపన్న దబ్రోవోస్కితో కలిసి సాధించిన అనంతరం బోపన్న పేరును అవార్డుకు ఏఐటిఏ ప్రతిపాదించింది. నామినేషన్ పంపినా, కనీసం అతనికి అవార్డు ఇవ్వాలని అభ్యర్థించకపోవడం బోపన్న ఆగ్రహానికి కారణం అయ్యింది.ఆలస్యంగా పంపడానికి తానే సాక్షి అని, ఇది ముమ్మాటికే క్షమించరాని అంశమని బోపన్న వ్యాఖ్యానించాడు.

సిరీస్ విజయానికి 8 వికెట్లు..



191 పరుగులు చేసిన మెండిస్ (110) కరుణ రత్నే 92 నాటౌట్

ఫాలోఆన్ ఆడుతున్న శ్రీలంక
తొలి ఇన్నింగ్స్ 183కే ఆలౌట్
రెండో ఇన్నింగ్స్ 209/2



వేగంగా 150 వికెట్లు తీసిన రెండో బౌలర్ జడేజా



భజ్జీని దాటేసిన అశ్విన్

కొలంబో: శ్రీలంక పర్యటనలో సిరీస్ విజయానికి భారత్ ఎనిమిది వికెట్లు దూరంలో నిలిచింది. కొలంబోలో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆతిథ్య శ్రీలంకను భారత్ స్పినర్లు అశ్విన్ ఐదు వికెట్లు, జడేజా రెండు వికెట్లతో తిప్పేశారు.దీంతో తొలి ఇన్నింగ్స్ 183కే ఆ జట్టు కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో 459 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన విరాట్ శ్రీలంకను ఫాలోఆన్ ఆడించాడు. శనివారం నాటి మూడో రోజు ఆట ముగిసే సమయానికి కరుణ రత్నే 92 పరుగులు, పుష్పకుమార 2 పరుగులతోను క్రీజులో నిలిచారు. 60 ఓవర్లు ఆడిన చండీమాల్ సేన 209/2తో ఓటమి నుంచి బయట పడేందుకు ఎదురీదుతోంది. ఓపెనర్ కరుణ, మెండీస్ అద్భుతంగా ఆడి రెండో వికెట్‌కు 191 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడంతో మూడో రోజు ఓటమి నుంచి ఆ జట్టు గట్టెక్కింది. చేతిలో ఉన్న 8 వికెట్లతో 230 పరుగులను దాటి అదనంగా చేస్తేనే శ్రీలంక ఓటమి నుంచి తప్పించుకోవచ్చు. దీంతో ఆదివారం నాడే విరాట్ సేన మూడు టెస్ట్‌ల సిరీస్‌ను వశం చేసుకోవడానికి అవకాశం ఉంది.

డిక్వెల్లా ఒక్కడే.. 51 ఔట్

50/2 పరుగులతో రెండో రోజు బ్యాట్ పట్టిన శ్రీలంక స్కోర్ బోర్డులో 10 పరుగులు కలిశాక కెప్టెన్ దినేష్ 10 పరుగుల వద్ద జడేజా బౌలింగ్‌లో పాండ్యకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. మెండిస్ 24 వద్ద నాలుగో వికెట్‌గా, మ్యాథ్యూస్(25) వద్ద ఐదో వికెట్‌గా వెనుదిరిగారు. దీంతో శ్రీలంక 117కే సగం వికెట్లను కోల్పోయింది. ఈ దశలో డిక్వెల్లా కీలకమైన అర్ధ సెంచరీ(51) తో జట్టు స్కోర్‌ను 150 పరుగులకు చేర్చి ఏడు వికెట్‌గా వెనుదిరిగాడు. ఫెరీరా 25 పరుగుల చేయడంతో ఆ జట్టు 183 వద్ద ఇన్నింగ్స్‌కు తెరపడింది.

జడ్డు 32 టెస్ట్‌లు .150 వికెట్లు..

భారత ఆల్‌రౌండర్, లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా రెండో ఫాస్టెస్ వికెట్లను తీసిన బౌలర్‌గా అవతరించాడు. కొలంబో టెస్ట్‌లో 3వ రోజు శనివారం ధనుంజయ డిసిల్వాను ఔట్ చేయడంతో జడ్డు 150 వికెట్ల మైలురాయికి చేరుకున్నాడు. కేవలం 32 టెస్ట్‌ల్లో ఈ ఫీట్‌కు చేరుకున్న రెండో భారతీయ బౌలర్‌గా అవతరించాడు. అశ్విన్ (29) ప్రసన్న, కుంబ్లే (34) మన్కడ్ (40), బిషన్ సింగ్ (41) రవిశాస్త్రి (78) టెస్ట్‌ల్లో ఈ ఫీట్‌కు చేరుకున్నారు.

అశ్విన్ 5 వికెట్లు... 26 సార్లు..

శ్రీలంక టాప్ ఆర్డర్‌ను కూల్చేసిన రవిచంద్రన్ అశ్విన్ 5 వికెట్లు చొప్పున 26 సార్లు తీసిన బౌలర్‌గా అవతరించాడు. మాజీ స్పిన్నర్ హర్భజన్‌సింగ్‌ను 25 సార్లు ఈ విధంగా వికెట్ల తీసిన ఫీట్‌ను అశ్విన్ దాటేశాడు. తొలి రోజు రెండు వికెట్లతో అశ్విన్ సత్తా చాటగా, శనివారం మాథ్యూస్, ఫెరీరా, ఫెర్నాండో వికెట్లను తీసి 183కే ఆలౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు.

మెండీస్ దూకుడు.. అనుహ్యంగా పుంజుకున్న శ్రీలంక..

459 పరుగుల ఫాలోఆన్ గండాన్ని ఎదురీదుతున్న శ్రీలంకకు రెండో ఇన్నింగ్స్‌లో 7 పరుగుల వద్ద తరంగా బౌల్డ్ అయ్యాడు. ఈ దశలో బరిలో దిగిన బ్యాట్స్‌మెన్ కుశాల్ మెండీస్ భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని తన ఫామ్‌ను చాటాడు. 120 బంతుల్లోను సెంచరీ చేయగా, మరో బ్యాట్స్‌మెన్ కరుణ రత్నే అర్ధ సెంచరీతో సత్తా చాటడంతో రెండో వికెట్‌కు వీరిద్దరు 191 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. కుశాల్ మెండీస్ ఫాలోఆన్ ఆడే సందర్భంలో సెంచరీ నమోదు చేసిన తొమ్మిదో శ్రీలంక క్రికెటర్‌గాను, భారత్‌పై సెంచరీ చేసిన 15వ క్రికెటర్‌గాను నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో అనుహ్యంగా 183కే కుప్పకూలిన శ్రీలంక వేగంగా పుంజుకోవడం విశేషం.

మో ఫరాకు స్వర్ణం



బోల్ట్

లండన్ : 10వేల మీటర్ల పరుగులో బ్రిటన్ లెజెండరీ స్ప్రింటర్ మో ఫరా స్వర్ణంతో ప్రపంచ అథ్లెటిక్స్‌లో సత్తా చాటాడు. ప్రపంచ వ్యాప్త ఈవెంట్లలో ఇది పదో స్వర్ణం కావడం విశేషం. గతేడాది రియో ఒలింపిక్స్‌లో 5వేల, 10వేల పరుగుల్లో స్వర్ణం సాధించిన మో ఫరా నాటకీయ పరిణామాల నేపథ్యంలో చివరి లాప్‌లో 65 సెకన్ల ముందుగా చేరుకుని స్వర్ణం సాధించాడు. 26:49.51 సెకన్లతో స్వర్ణం సాధించగా, 2012 లండన్‌లో 26:49,53 సెకన్లతో పసిడిని సాధించాడు.

సెమీస్‌రేసులో ద్యుతీ, అనస్ విఫలం

ప్రపంచ అథ్లెటిక్స్ మీట్‌లో భారత అథ్లెట్లుకు తొలిరోజే చుక్కెదురైంది. ఒడిషా స్ప్రింటర్ ద్యుతీచంద్, క్వార్టర్ మిల్లర్ మొహ్మద్ అనస్ తొలి హీట్స్‌లోను నిష్క్రమించారు. శనివారం నాటి మహిళల 100 మీటర్లు పరుగులో ద్యుతీచంద్ అర్హతా ప్రమాణాన్ని అందుకోలేక ఆరో స్థానంలో నిలిచింది. 12.07 సెకన్లతో లక్ష్యాన్ని చేరుకుంది. ఈ సీజన్‌లో సొంతగడ్డ ఒడిషాలో 11.30 సెకన్ల బెస్ట్ లక్ష్యాన్ని చేరుకున్న ద్యుతీ ఇక్కడ ఆ మేరకు సత్తా చాటలేకపోయింది. 21 ఏళ్ల ద్యుతీ టాప్ క్లాస్ ఈవెంట్‌లో నిరాశ పర్చింది. పురుషుల 400 మీటర్ల పరుగులో అనస్ 45.70 సెకన్లలో చేరుకుని సెమీస్‌కు చేరాడు. అయితే సెమీస్‌లో టాప్-3లో నిలవకపోవడంతో ఇంటిముఖం పట్టాడు. 22 ఏళ్ల కేరళ స్ప్రింటర్ అనస్ ఈ సీజన్‌లో వ్యక్తిగత బెస్ట్ 45.32 సెకన్లు.

నేటి భారత షెడ్యూల్ ఇదే.

.ఆదివారం నాటి ప్రపంచ అథ్లెటిక్స్‌లో పలువురు భారత అథ్లెట్లు పాల్గొననున్నారు.మారథాన్ రేసులో టి గోపి, మహిళల 400 మీటర్ల హీట్స్‌లో నిర్మలా షిరోన్, పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో సిద్దాంత తింగలయ్య, మహిళల మారథాన్ రేసులో మోనికా ఆథారే పోటీ పడతారు.

సెమీస్‌కు బోల్ట్.....

ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌లో 100 మీటర్ల స్వర్ణంపై కన్నేసిన జమైకన్ పరుగుల యంత్రం ఉసేన్ బోల్ట్ శుక్రవారం నాటి తొలి హీట్స్‌లో పేలవంగా ప్రదర్శన మొదలెట్టాడు. అయితే కీలకమైన సెమీస్ రేసుకు చేరుకున్నాడు. ఉసేన్ బోల్ట్ 9.58 సెకన్లలో లక్ష్యాన్ని అధిగమించాడు. బోల్ట్‌కు ప్రధాన పోటీదారుడు కెనడా అథ్లెట్ డీ గ్రేస్ గాయంతో దూరం అయ్యాడు. మరోవైపు ఇతర హీట్‌ల్లో 21 ఏళ్ల జమైకన్ కోల్‌మన్ 10.01 సెకన్లతో రెండో ఫాస్టెస్ రన్నర్‌గా నిలిచాడు.12వ స్వర్ణం సాధనకు ఒక్క అడుగు దూరంలో నిలిచాడు. 30 ఏళ్ల బోల్ట్ అథ్లెటిక్స్ లండన్‌లోనే వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్న విషయం తెల్సిందే.4క్ష్మ400 మీటర్లు రిలే పరుగులో బోల్ట్ స్వర్ణంపై గురి పెట్టాడు. వచ్చే శనివారం అనగా 12వ తేదీన ఈ పోటీలో బోల్ట్ తన టీమ్ సభ్యులతో కలిసి తుది పరుగుకు సిద్ధం అవుతున్నాడు. ఇప్పటి వరకు 11 ప్రపంచ పతకాలు, 8 ఒలింపిక్ స్వర్ణాలతో ముందంజలో నిలిచాడు.



స్వర్ణం సాధించిన ఆనందంలో కూమారుడ్ని ఎత్తిన మో ఫరా

విజేందర్‌కు డబుల్ బెల్ట్



చైనా నెం:1 జుల్ఫికర్‌పై జయభేరి

ముంబయి : బాక్సింగ్‌లో కింగ్ ఆఫ్ ఆసియా పేరొందిన భారత్ ప్రొ బాక్సర్ విజేందర్ సింగ్ డబుల్ టైటిల్ పోరులో విజేతగా అవతరించాడు. నువ్వానేనా అన్నరీతిలో సాగిన చైనా నెం:1 బాక్సర్ జుల్ఫికర్ మైమతియాలితో జరిగిన శనివారం నాటి డబుల్ టైటిల్ పోరు హోరుగా సాగింది. 45 సెకన్లలోనే విజయం సాధిస్తానన్న విజేందర్ మాటను నెగ్గించుకోలేనప్పటికీ సవాల్‌కు ప్రతి సవాల్‌గా సాగినప్పటికీ తుది ఫలితం మాత్రం సింగ్‌నే వరించింది. పది రౌండ్ల పోరులో ముగ్గురు జడ్జిల మార్కులు సింగ్‌కే అనుకూలంగా వచ్చాయి. 96-93,95-94,95-94తో తన కంటే పదేళ్ల పెద్ద అయిన మైమతియాలిని మట్టి కరిపించి సొంతగడ్డపై తొమ్మిదో బౌట్‌లోను విజేందర్ సింగ్ జయకేతనం ఎగుర వేశాడు.ముంబయిలోని నేషనల్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా డబుల్ టైటిల్ పోరు ప్రారంభానికి ముందు జాతీయ గీతాలపనలు చేపట్టారు.ఈ బౌట్‌ను తిలకించేందుకు బాలీవుడ్ నటులు అభిషేక్ బచ్చన్, సోనూ సూద్, గుల్షన్ గ్రోవర్, రణదీప్ హుడా హాజరయ్యారు.

జితేందర్, అఖిల్ సత్తా...

భారత ఒలింపియన్ బాక్సర్లు జితేందర్ కుమార్, అఖిల్ కుమార్ శనివారం ప్రొఫెషనల్ బాక్సింగ్ అరంగ్రేటంలో అదరగొట్టారు. తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నారు. లైయిట్ వెయిట్ 61.2 కిలోల విభాగంలో బరిలో దిగిన జితేందర్ సింగ్ ప్రత్యర్థి టానెట్ లిఖితమ్‌ప్రాన్‌పైపై రెండు రౌండ్ల పోరులో విజేతగా అవతరించాడు. అర్జున అవార్డు గ్రహీత అఖిల్ కుమార్ ప్రత్యర్థి టై గిల్‌క్రిస్ట్‌పై దిమ్మతిరిగే పంచ్‌లతో విరుచుకుపడ్డాడు. దీంతో ప్రత్యర్థి చేతులెత్తేశాడు.



జుల్ఫికర్‌తో పోటీ పడుతున్న విజేందర్



ప్రపంచ రెజ్లింగ్‌లో మనీష్, సాజన్‌కు కాంస్యాలు

ఫిన్‌లాండ్: జూనియర్ ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు శనివారం సత్తా చాటారు. గ్రీకో-రోమన్ విధానంలో మనీష్, సాజన్‌లు మెరిశారు. 60 కేజీల విభాగంలో మనీష్ మూడు బౌట్‌ల్లో విజయం సాధించి సెమీస్‌కు అర్హత సాధించాడు. అద్భుతమైన ప్రతిభతో గాబిన్ కిమ్(కొరియా), సెడ్డె తాజ్యెవ్(తుర్క్‌మెనిస్థాన్),క్రిస్టేనా ఇస్త్వావన్(హంగరీ)పై గెలిచాడు. సెమీఫైనల్లో మోరాడ్ అబెద్వేల్లి ఇరాన్ చేతిలో 3-1తో పరాజయం చెందడంతో కాంస్యం సాధించాడు. 74 కేజీల విభాగంలో సాజన్ క్వార్టర్స్‌లో పరాజయం పాలయ్యాడు.ఇతనిపై గెలిచిన కిర్గిస్థాన్ ప్రత్యర్థి ఫైనల్స్‌కు చేరడంతో రీప్‌చేజ్ రౌండ్‌కు అవకాశం వచ్చింది. రెండు రిప్‌చేజ్ రౌండ్లలో అండెర్స్ (టర్కీ),మొహ్మద్ పర్వీజ్ నెయిజ్ (ఇరాన్)పై విజయం సాధించడంతో సాజన్ కాంస్యం సాధించాడు.

ఆసియా షాట్‌గన్‌లో అంకుర్‌కు స్వర్ణాలు

న్యూఢిల్లీ : కజకిస్తాన్ ఆస్థానలో జరుగుతున్న ఏడవ ఆసియాన్ షాట్‌గన్ ఛాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత, టీమ్ ఈవెంట్లలో అంకుర్ మిట్టల్‌కు రెండు స్వర్ణాలు లభించాయి. డబుల్ ట్రాప్ ఈవెంట్‌లో మిట్టల్ టాప్ సిక్స్ షూటర్లలో 71 పాయింట్లను సాధించి స్వర్ణం కైవసం చేసుకున్నాడు. యూఏఈ షూటర్ ఖలాద్ అల్‌కబీ 70 పాయింట్లతో రజతం సాధించాడు. టీమ్ ఈవెంట్‌లో సంగ్రామ్ దహియా(43), మొహ్మద్ అసబ్ (34)తో కలిసి స్వర్ణం సాధించాడు.



అదరహో ముంబా



ఢిల్లీపై 36-22 పాయింట్లతో జయభేరి

నాగపూర్: యు ముంబా, దంబంగ్ ఢిల్లీ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో ముంబా భారీ పాయింట్ల తేడాతో జయకేతనం ఎగుర వేసింది. శనివారం నాటి పోరులో 36-22తో ముంబా తన సత్తా చాటింది. ముంబా కెప్టెన్ అనూప్ కుమార్ ఆరు ,షాబీర్ బాపు ఏడేసి పాయింట్లతో దుమ్మురేపారు. ఢిల్లీ టాప్ రైడర్ మీరాజ్ ఏడు పాయింట్లతో సత్తా చాటినా, ఇతర ఆటగాళ్ల పేలవమైన ప్రదర్శన జట్టును ఓటమి నుంచి రక్షించలేకపోయారు. దీంతో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో ముంబా జోన్ ఎలో 10 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది.రైడ్ పాయింట్లు, టాకిల్ పాయింట్లలో 15 చొప్పున సాధించిన ముంబా ప్రత్యర్థిపై పూర్తిస్థాయి ఆధిపత్యం సాధించింది. ఎక్స్‌ట్రాల రూపంలో 5 పాయింట్లును సాధించిన ఢిల్లీ రైడింగ్‌లో 10, టాకిల్‌లో ఏడు పాయింట్లను సాధించింది. ముంబా జట్టును ఒక్కసారిగా ఆలౌట్ చేయలేకపోయింది.తొలి అర్ధ భాగంలో ముంబా ఢిల్లీపై 14-8 ఆధిక్యంలో నిలిచింది.రెండో అర్ధభాగంలో మరింత రెట్టించిన ఉత్సాహంతో దాడులు, ప్రత్యర్థి రైడర్ల పట్టేయడంతో పది పాయింట్ల మేర ఆధిక్యంతో దూసుకెళ్లింది.

ఉత్తరప్రదేశ్ యోధా జయభేరి..

యూపి యోధా జట్టు తొలి సీజన్‌లోనే రెండో విజయాన్ని అందుకుంది. బెంగళూరు బుల్స్‌పై 32-27తో రెండో విజయాన్ని సాధించింది. బెంగళూరు కెప్టెన్ రోహిత్ 11 పాయింట్లను సాధించినా చివర్లో జట్టును గెలిపించడంలో ముందంజ వేయలేకపోయాడు. బెంగళూరు బుల్స్, ఉత్తరప్రదేశ్‌ల యోధా జట్ల మధ్య రెండో మ్యాచ్ సాగింది. ఈ మ్యాచ్‌లో యోధా ఆటగాళ్లు ఆది నుంచి తమ పదునైన దాడులతో పాయింట్లతో ముందంజ వేశారు. యూపి కెప్టెన్ నితిన్ తోమర్ తొలి రైడింగ్ పాయింట్‌తో బోణి కొట్టాడు. రెండో అర్ధ బాగంలోను యోధా ఆటగాళ్లు బరిలో దుమ్మురేపారు. నితిన్ అత్యధికంగా తొమ్మిది పాయింట్లతో తన సత్తాను మరోసారి రుచి చూపించాడు.బుల్స్‌ను ఏ దశలోను కోలుకోనీయకుండా వ్యూహాత్మంగా వ్యహరించి సక్సెస్ సాధించాడు.

నేటి మ్యాచ్‌లు

రాత్రి 8 గంటలకు
బెంగాల్ వారియర్స్ × ఉత్తర ప్రదేశ్ యోధా
రాత్రి 9 గంటలకు
బెంగళూరు బుల్స్× పాట్నా పైరేట్స్

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68